


# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక




శుక్రవారం 19-09-2025 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 148 రూ॥ 6.00




# పంతుల్లకు కొలువు గండం!









మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

# టీచర్లకు టెట్..ఉద్యోగానికి త్రెట్

## సుప్రీంకోర్టు తీర్పుతో టీచర్లలో అయోమయం

## 2010కి ముందు రిక్రూట్ అయిన టీచర్లకు టెట్ పరీక్ష

- పంతుల్లకు కొత్త పరీక్ష!
- టెట్ పాస్ కాకపోతే ఉద్యోగం ఊస్ట్
- సుప్రీంకోర్టు తీర్పుతో టీచర్లలో ఆందోళన
- తమిళనాడులో తప్పని సరి చేస్తే ఒక్క శాతం పాస్ అయ్యారు.
- ఏపీలో 50శాతం కూడా పాస్ కాలేదు.
- తెలంగాణలో అమలు చేస్తే అంతే సంగతులు!
- ఆ పరీక్ష పెడితే నేను కూడా పాస్ కాకపోవచ్చు. అంటు ఉపాధ్యాయ సంఘ నాయకుడు శ్రీపాల్ ప్రకటన
- అప్పీలుకు వెళ్తామని ఉపాధ్యాయ సంఘాల నిర్ణయం
- తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి
- టెట్ పరీక్ష వల్ల 50 వేల మంది ఉపాధ్యాయుల కొలువులు పోవొచ్చు

**హైదరాబాద్, నేటిధాత్రి:**
తెలంగాణలోనే కాదు దేశ వ్యాప్తంగా పంతుళ్ల గొంతులో పచ్చి వెలక్కాయ పడినంత పనైంది. త్వరలో పంతుళ్లకు కొలువుగండం రానున్నది. తెలంగాణలో కనీసం ఓ 50వేల మంది ఉపాధ్యాయులు కొలువులు పోయే పరిస్ధితి తరుముకొస్తోంది. తాజాగా సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల ఎంతోమంది ఉపాధ్యాయులు కొలువులు రాంరాం కానున్నాయి. సుప్రింకోర్టు తీర్పుతో ఒక్కసారిగా టీచర్లు అయోమయానికి గురౌతున్నారు. ఉక్కిరిబిక్కి రౌతున్నారు. ఇప్పుడేం చేయాలన్నదానిపై సంఘర్షణ పడుతున్నారు. సుప్రింకోర్టే తీర్పు ఇచ్చిన తర్వాత తిరుగేముంటుంది. ఒక వేళ రివ్యూ పిటీషన్ వేసి మళ్లీ సుప్రింకోర్టు తలుపు తట్టినా, అదే తీర్పు రాదన్న గ్యారెంటీ ఏముంది? సహజంగా సుప్రింకోర్టు తీర్పులలో రివ్యూ పిటీషన్లు వీగిపోవడమే జరుగుతుంది. కోర్టుకు వెళ్లి మరోసారి చీవాట్లు తినడంకన్నా, కోర్టు ఆదేశాలను పాటించడమే మేలనుకునే సంఘాలు కూడా వున్నాయి. 2010కి ముందు టీచర్లుగా రిక్రూట్ అయిన వారు తప్పనిసరిగా టెట్ (టీచర్స్ టాలెంట్ టెస్ట్) పరీక్ష రాయాలి. అందులో పాస్ కావాలి. ఈ టెట్ కూడా రెండు రకాలు గా వుంటుంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఒకటి, ప్రైమరీ టీచర్ పోస్టులకు మరోకటి నిర్వహిస్తారు. అలాంటి పరీక్షను ఇప్పుడు 2010 కి ముందు ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు రాయాలి. ఇదీ స్థూలంగా సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పు. గతంలో ఉపాధ్యాయ అర్హత పరీక్షకు టెట్ అనేది వుండేది కాదు. కాని 2010 తర్వాత కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ ఈ నిర్ణయం తీసుకున్నది. దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున చర్చలు జరిగిన తర్వాతే ఈ నిర్ణయం కేంద్రం ప్రకటించింది. అయితే అప్పటికే ఉద్యోగాలు చేస్తున్న వారి గురించి రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. వారిపై నిర్ణయం తీసుకోలేదు. కాని కొత్తగా డిఎస్సీలు రాయాల్సిన ప్రతి అభ్యర్ధి టెట్ రాయడం తప్పని సరి చేసింది. దాంతో క్వాలీటీ టీచర్లు వస్తున్నారన్నది గుర్తించారు. గతంలో కేవలం డిఎస్సీ(డిస్టిక్ట్ సెలక్షన్) జరిగేది. ఇందులో కూడా మరో మతలబు వుండేది. ఏ జిల్లా ఉపాధ్యాయులను ఆ జిల్లా పరిషత్ రిక్రూట్ చేసుకునేది. తర్వాత కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో డిఎస్సీ పరీక్ష నిర్వహిస్తున్నారు. అయినా ఆ పేరు ఇప్పటికీ కొనసాగుతూనే వుంది. ఇప్పుడు టెట్ రాయడం ఉపాధ్యాయులకు సాధ్యమా? అంటే సాద్యం కాకపోవచ్చు? ఎప్పుడో చదువుకున్న పాఠాలను ఇప్పుడు మళ్లీ చదువుకొని పరీక్షలు రాయడం అనేది సాధ్యం కాకపోవచ్చు? అనేదే ఎక్కువగా వినిపిస్తున్న మాట.అయితే టీచర్లు తప్పించుకోవడానికే ఈ పన్నాగం పన్నుతున్నారనేది కొంత మంది వాదన. డిఎస్సీ రాసిన సమయంలో అన్ని రకాల సబ్జెక్టులు చదివి, పరీక్షలు రాశారు. డిఎస్సీ సెలక్టయ్యారు. ఇప్పుడు కూడా ప్రైమరీ,అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో టీచర్లకు ప్రత్యేక సబ్జెక్టు అనేది ఏదీ లేదు. వుండదు. అన్ని రకాల సబ్జెక్టులు చెప్పడానికి సిద్దంగా వుండాలి. చెప్పాలి. కాని ఇప్పుడు పరీక్షలు మేం రాయలేమని టీచర్లు చెప్పడం విడ్డూరంగా వుంది. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు సబ్జెక్టులు చెప్పే టీచర్లలో ప్రత్యేకంగా డీఎస్సీలో ఎంపిక చేసుకున్న సబ్జెక్టులు పాసైన తర్వాతే ఉద్యోగాలు వచ్చాయి. స్కూల్ అసిస్టెంట్ పరీక్ష రాసే అధ్యాపక అభ్యర్ధులు సైన్‌ను ఎంపిక చేసుకుంటే అందులో మూడు రకాల విభాగాలు వుంటాయి. మ్యాథ్స్ సబ్జెక్టు వారికి ప్రత్యేకంగానే వుంటాయి. సోషల్‌లో కూడా భూగోళశాత్రం, చరిత్ర, పౌరశాస్త్రం, ఆర్ధశాస్త్రం వేరువేరుగానే వుంటాయి. ఈ సబ్జెక్టులు చెప్పగలిగిన టీచర్లు పరీక్షలు ఎందుకు రాయలేరన్నది ఇప్పుడు జరుగుతున్న చర్చ. నిజానికి 2010 తర్వాత ప్రతి టీచర్ టెట్ రాయాల్సి వుండేది. కాని ప్రభుత్వాలు అలసత్వం చేశాయి. ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తులను మన్నించాయి. వారికి సహకరించాయి. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రమోషన్లలోకూడా టెట్‌తో పని లేకుండానే వచ్చాయి. ఇప్పుడు అవే గుదిబండగా మారాయి. ఆ సమయంలో ప్రైమరీ స్కూల్ టీచర్ నుంచి ప్రమోషన్ పొందిన వారిలో ఎక్కువ శాతం టీచర్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి బిఈడీలు చేయలేదు. ఆ సమయంలో ఉద్యోగాలు పొందిన వారిలో సింహభాగం టీచర్లు అలగప్పా, అన్నామలై యూనివర్సిటీల నుంచి బీఈడీ చేసిన వారే. అందులోనూ అవి దూరవిద్య బిఈడీలు. అంటే ఆ బీఈడీలు చేసిన ఏ ఒక్క అభ్యర్ధి కాలేజీకి వెళ్లింది లేదు. చదవుకున్నది లేదు. ఇక్కడ మరో విచిత్రమేమిటంటే ఆ యూనివర్సిటీల బీఈడీ చేసిన వాళ్లంతా ఇంగ్లీష్ మీడియంలో పరీక్షలు రాశారు. కాని ఇప్పటికీ ఆ టీచర్లలలో ఎవరికీ ఒక్క ముక్క ఇంగ్లీష్ రాదు. కాని ప్రమోషన్లు సంపాదించి ఇంగ్లీష్ బోధిస్తున్నారు. ఇతర సబ్జెక్టులు బోధిస్తున్నారు. అసలు ఆ రోజుల్లో ఇంగ్లీష్‌లో పాస్ కావడమే గొప్ప. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారు తెలుగు మీడియం చదువుకొని, ఇంగ్లీష్‌లో అన్నామలై, అలగప్పా యూనివర్సిటీల దూరవిద్య సర్టిఫికెట్లు పొందారు. అదృష్టం కలిసొచ్చి ఉద్యోగాలు సంపాదించుకున్నారు. అలాంటి వారు చెప్పే చదువుల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్ధుల భవిష్యత్తు ఎలా వుంటుందో అర్ధం చేసుకోవచ్చు. అందుకే మన విద్యా వ్యవస్ధ ఇలా తగలబడిపోయిందని చెప్పడంతో సందేహం లేదు. తర్వాత కాలంలో దూర విద్య బీఈడీలను ఉమ్మడి రాష్ట్రంలో అనుమతించలేదు. దాంతో ఎంతో కొంత నాణ్యమైన చదువును చదువుకున్న ఉపాధ్యాయులు ఆ తర్వాత వచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను నిలబెడుతున్నారు. కాని అలగప్పా, అన్నామలై యూనివర్సిటీల బిఈడీలు చేసిన వారి వల్ల విద్యా వ్యవస్ధ భ్రష్టుపట్టిపోయింది. ఇప్పుడు టీచర్ల యూనియన్లలో నాయకులుగా వున్నవారు ఎక్కువ ఆ బాపతు టీచర్లే అని అంటుంటారు. ఒదుకంటే వాళ్లు చదువులు చెప్పలేరు. మాటలు చెప్పి పొద్దు పుచ్చుకోగలరు. కాలయాపన చేసి కాలం వెల్లబుచ్చగలరు. నిజం చెప్పాలంటే ఆ తరం అదృష్టవంతులు. వారు చదవు చెప్పలేకపోయిన అడిగిన వారు లేదు. తర్వాత రాజకీయాల్లో దూరి ప్రజలను ప్రభావితం చేసినా పట్టించుకున్న వారు లేదు. అప్పుడే పెరిగిన రియలెస్టేట్ వ్యాపారాలు సాగించి కోట్లు సంపాదించడంతో వారిని చూసి ఇతర టీచర్లు భయపడం మొదలైంది. ఫైనాన్స్ కంపనీలు, చిట్ ఫండ్ వ్యాపారాలు మొదలు పెట్టారు. పిల్లలకు చదువులు చెప్పడం తప్ప అన్నీ చేస్తూ వస్తున్నారు. ఇప్పుడు ఉన్నఫలంగా వారికి టెట్ పరీక్ష అంటే ఇబ్బంది పడుతున్నారు. అయితే సుప్రింకోర్టు కూడా ఒక్క వెసులుబాటు కల్పించింది. రిటైర్ మెంటుకు 5 గడువు వున్న ఉపాధ్యాయులను మినహాయించింది. లేకుంటే ఇంకా ఎంత మంది టీచర్లు కొలువులు కోల్పోయేవారు. తమిళనాడు రాష్ట్రంలో టెట్ పరీక్షను రాస్తే అందులో ఒక్క శాతం ఉపాద్యాయులు కూడా ఉత్తీర్ణత సంపాదించలేదని తెలుస్తోంది. ఏపిలో కూడా టెట్ పరీక్ష నిర్వహిస్తే కనీసం సగం మంది ఉపాద్యాయులు పాస్ కాలేదని సమాచారం. ఇప్పుడు తెలంగాణలో టెట్ పరీక్షను ఆ తరం ఉపాధ్యాయులకు నిర్వహిస్తే ఎంత శాతం మంది పాస్ అవుతారో అని దిగులు పడుతున్నారు. అయితే టెట్ పాసైన వారికే ప్రమోషన్లు ఇవ్వడం జరుగుతుందని కూడా సుప్రింకోర్టు తీర్పునిచ్చింది. దాంతో ఇటీవల ప్రమోషన్లను ప్రకటించినా, ఆ తరం ఉపాద్యాయులు సైలెంటుగా వున్నారు. ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుందని గొంతెత్తితే మొదటికే మోసం వస్తుందన్న భయపడ్డారు. గొంతు సవరించుకోవడానికి కూడా ఇష్టపడలేదు. వారికంటే జూనియర్లకు ప్రమోషన్లు వస్తుంటే చూస్తూ వుండిపోయారు. అదే గతంలో అయితే సీనియర్లకు అన్యాయం జరుగుతుందని రోడ్డెక్కేవారు. ప్రమోషన్లు ఎలాగూ పోయాయి. తర్వాత ఉద్యోగాలే పోయే పరిస్ధితి వస్తుందా? అని దిగులు చెందుతున్నారు. కాకపోతే కొంత గడువిచ్చి రెండుసార్లు అవకాశం కల్పించాలని కొంత మంది ఉపాద్యాయులు కోరుతున్నారు. కొంత మంది దీనిపై మళ్లీ రివ్యూ పిటీషన్‌కు వెళ్తున్నారు. మరి కొంత మంది ఏ ప్రభుత్వ ఉద్యోగికి లేని ఈ తిరకాసులు మాకే ఎందుకొని ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి ఇది ఎటు దారి తీస్తుందో అని కూడా అనుకుంటున్నారు. ఏది ఏమైనా అన్ని శాఖలు వేరు. విద్యా శాఖ వేరు. రేపటి తరాన్ని తయారు చేసే వ్యవస్ధలో లోప భూయిష్టంగా వుండొద్దు. నాణ్యమైన విద్య అందాలంటే టాలెంటెడ్ ఉపాద్యాయులు తప్పని సరి కావాలి. అందరూ కోరుకునేది ఇదే..!







# నేటిధాత్రి
తెలుగు వార్త పత్రిక

21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం





శుక్రవారం 19-09-2025 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 148 రూ॥ 6.00


## నేపాల్ శాంతిస్థాపనకు మద్దతు

నేపాల్ ప్రధాని సుశీలా కార్కీకు మోడీ ఫోన్



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
నేపాల్‌లో శాంతి స్థాపనకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందని

09లో


# ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు













- ఇతర రాష్ట్రాల ఫోన్లు ఉపయోగింపు
- ఒక రాష్ట్రం తరవాత మరో రాష్ట్రం
- కాంగ్రెస్‌కు పడే ఓట్ల జాబితా గుర్తించి చర్య
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాహుల్ వివరణ

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు దిల్లీలో మీడియా సమావేశంలో ఆరోపణలు చేశారు. ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక పక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు వేసే కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించామన్నారు. త్వరలో ఎన్నికల సంఘంపై హైడ్రోజన్ బాంబ్ పేల్చబోతున్నట్లుగా ప్రకటించినట్టుగానే గురువారం రాహుల్‌గాంధీ పేల్చారు. ఓట్ల చోరీపై గతంలో కొన్ని ఆధారాలు బయటపెట్టగా.. ఈరోజు మరిన్ని ఆధారాలను బయటపెట్టారు. మీడియా ముందు వీడియో ప్రజెంటేషన్ ఇస్తూ... ఓట్ల చోరీపై 100 శాతం ఆధారాలతో రుజువులు బయటపెడుతున్నట్లు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా లక్షలాది ఓట్లు తొలగించాలని

09లో

## సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు అసాధ్యం


- రాహుల్ విమర్శలను ఖండించిన ఈసి
- అబద్దాల ప్రచారంతో అస్థిరత సృష్టించే యత్నం
- రాహుల్ విమర్శలపై మండిపడ్డ బీజేపీ నేతలు





న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా

09లో



## రాగల మూడురోజులు భారీ వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు

09లో

# సహకారానికి సిద్ధం



- సీఎంతో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ భేటీ
- తెలంగాణ విద్యార్థులకు సహకారం ఇస్తామని హామీ

హైదరాబాద్, నేటిధాత్రి:
భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్ కోఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి బ్రిటిష్ హైకమిషనర్ వివరించారు. యూకే యూనివర్సిటీలలో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి అక్కడి యూనివర్సిటీలు ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న కొత్త ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్ట్‌ను కూడా బ్రిటీష్ హైకమిషనర్‌కు సీఎం వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు ట్రైనింగ్ అందించేందుకు బ్రిటిష్ హైకమిషనర్ సుముఖత వ్యక్తం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటీష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కోరారు. జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం కోరగా.. అందుకు బ్రిటీష్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి డిప్యూటీ హైకమిషనర్ హైదరాబాద్ గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమి అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి హాజరయ్యారు. విద్య, సాంకేతిక సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు బ్రిటిష్ హైకమిషనర్ సీఎంకు వివరించారు. యూకే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్‌ను కో ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు అంగీకరించారు.



## దమ్ముంటే జూబ్లీహిల్స్‌లో గెలిచి చూపించు

కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్

ఖమ్మం, నేటిధాత్రి:
నేటి పేదోడి ప్రభుత్వం సంక్షేమ పథకాలు తెస్తుంటే.. కొంతమంది విషం కక్కుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పాముకు కోరల్లో విషం ఉంటే, కొందరి నాయకులకు ఒళ్ళంతా విషం ఉంటుందని విమర్శించారు. ఎదులాపురం మున్సిపాలిటీ వరంగల్ క్రాస్ రోడ్డులో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వేదిక మీద నుంచి నాటి ప్రబుద్ధులను అడుగుతున్న.. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే మీకు కడుపు మంట ఎందుకని ఆయన ప్రశ్నించారు. పెదోడికి ఇల్లు కట్టిం చి ఉంటే మీకు ఈ పరిస్థితి ఉండేది కాదని హితవు పలికారు.

### బీఆర్ఎస్‌కు మరోసారి ప్రజలు బుద్ధి చెప్తారు..


బీఆర్ఎస్ నాయకులకు ప్రజలు రెండు పర్యాయాలు బుద్ధి చెప్పారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. వారి సోదరి, బిడ్డ సమస్యను సీఎం రేవంత్ రెడ్డికి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

09లో

## వ్యాసరచన పోటీలకు దరఖాస్తులు

విద్యార్థులు అక్టోబర్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హైదరాబాద్, నేటిధాత్రి:
సర్కారు బడుల్లోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6-10వ తరగతి వరకు గల విద్యార్థులు అక్టోబర్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



## ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి తెలంగాణ పోలీసు నియామక మండలి నిన్న (బుధవారం) నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు 1000 డ్రైవర్లు, 743 శ్రామిక్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నది. అక్టోబర్ 8న ఉదయం 8గంటల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్టు వెల్లడించింది. అదేనెల 28 దరఖాస్తులకు చివరి గడువుగా నిర్ణయించినట్టు తెలిపింది. వివరాలకు www.tgprb.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది

## ఆ డబ్బు మొత్తం రేవంత్ రెడ్డి కక్కాల్సిందే

రూ. 66 కోట్లను జప్తు చేయాలని క్యాబినెట్ ఎందుకు తీర్మానం చేసిందో చెప్పాలి : పెద్ది సుదర్శన్ రెడ్డి



హైదరాబాద్, నేటిధాత్రి:
సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిసి ధాన్యం టెండర్లలో వేల కోట్లు దోచుకున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ డబ్బు మొత్తం రేవంత్ రెడ్డి కక్కాల్సిందే అని సుదర్శన్ రెడ్డి అన్నారు.
ధాన్యం టెండర్లలో కుంభకోణం జరుగుతుందని బిఆర్ఎస్ చెప్పింది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిసి వేల కోట్ల రూపాయలు దండుకున్నారని క్యాబినెట్ తేల్చింది. డబ్బులను జప్తు చేయాలని జీఓ నంబర్ 15 విడుదల చేసింది. ధాన్యం

09లో

## అల్మట్టి ఎత్తు పెంచేందుకు కర్ణాటక యత్నం

ఇప్పటికీ స్పందించని రేవంత్‌పై మాజీ ఎంపీ వినోద్ ఫైర్



హైదరాబాద్, నేటిధాత్రి:
అల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తుంటే.. ఇప్పటికీ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడంపై బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అంశంపై తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు.
కృష్ణా ట్రిబ్యునల్ 2013లో అల్మట్టి ప్రాజెక్టు ఎత్తుకు సంబంధించి తీర్పు ఇచ్చింది. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ తీర్పుపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఆందోళనల నేపథ్యంలో అప్పటి ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పీ వేస్తే

09లో



## అభాగ్యుల కన్నీళ్లు తుడవలేని ప్రభుత్వం

ఇటీవలి ప్రమాదాలపై కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, నేటిధాత్రి:
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అభాగ్యుల కన్నీళ్లు తుడవలేని అమానవీయ సర్కార్ ఇది అని కేటీఆర్ విమర్శించారు. అది ఎస్ఎల్‌బీసీ సొరంగం అయినా, సిగాచీ పరిశ్రమ అయినా, హైదరాబాద్ వరదలయినా, ప్రతి చోటా అదే నేరపూరిత నిర్లక్ష్యం, అదే చేతగానితనం అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు. వరదనీటి నాలాల్లో ముగ్గురు గల్లంతై నాలుగు రోజులు దాటినా కాంగ్రెస్ సర్కార్ చేష్టలుడిగి చూస్తుందని మండిపడ్డారు. ప్రాణాలు ఎలాగూ కాపాడలేరు.. దురదృష్టవశాత్తూ ఎవరైనా మరణిస్తే కనీసం పార్థివదేహాలు అయినా వెలికితీయలేని అసమర్థ ప్రభుత్వం ఇది! అభాగ్యుల కన్నీళ్ళు తుడవలేని అమానవీయ సర్కారు ఇది! అని కేటీఆర్ విమర్శించారు.

## అదంతా ఫేక్..

ఆ వార్తలను ఖండిస్తున్నా

- పార్టీ మారడం,రాజీనామా చేయడం అంటూ రూమర్స్
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వివరణ



నల్లగొండ, నేటిధాత్రి:
తనటే గిట్టని కొందరు వ్యక్తులు తన ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు, సామాజిక మాధ్యమాల ద్వారా అవాస్తవాలు వ్యాపింపజేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వదంతులను నమ్మొద్దని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. గుంటూరులో ఓ కార్యక్రమానికి వెళ్తూ.. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో కార్యకర్తలతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ప్రచారంపై స్పందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతు న్నానని ఇలా రకరకాల వార్తలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, పార్టీని బలోపేతం చేసేందుకు కొన్ని సందర్భాల్లో నా అభిప్రాయాన్ని బహిరంగంగా చెప్పాను. అలా చెప్తే తప్పేంటి?ఇవాళ కూడా ఓ ప్రైవేటు- కార్యక్రమానికి గుంటూరు వెళ్తుంటే.. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి వెళ్తున్నానని వదంతులు సృష్టిస్తున్నారు. నా రాజకీయ భవిష్యత్ గురించి మీడియా సమావేశం పెట్టి చెబుతా, అప్పటి వరకు ఈ దుష్ప్రచారాలు నమ్మొద్దని తెలంగాణ సమాజాన్ని కోరుతున్నానని రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తన పదవికి రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని లేదా కొత్త పార్టీ పెడుతున్నానని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని ఆయన స్పష్టం చేశారు. మా కుటుంబం ఎప్పటినుంచో కాంగ్రెస్ పార్టీ నేపథ్యమే ఉన్న కుటుంబం. నాకు కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అంటే గౌరవం ఉంది. కానీ నాకు, మా కుటుంబానికి గిట్టని కొందరు వ్యక్తులు కావాలనే ఈ రకాల ప్రచారం చేస్తున్నారు. మా ప్రతిష్ఠ దిగజార్చేందుకే ఈ రూమర్లు సృష్టిస్తున్నారని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకే తన వ్యాఖ్యలు ఉంటాయని, తన రాజకీయ భవిష్యత్తుపై తాను చెప్పకపోతే ఇతరుల మాటలను ఎవరు నమ్మొద్దని ఆయన హితవు పలికారు.

# భూసేకరణ పనుల వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య , రెవెన్యూ



**జహీరాబాద్, నేటిధాత్రి:**

సంగారెడ్డి జిల్లా జిల్లాలో జరుగుతున్న భూసేకరణ పనుల వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ,రెవెన్యూ అధికారులను ఆదేశించారు . బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో రీజినల్ రింగ్ రోడ్ ( ఆర్ఆర్ఆర్ ),రోడ్ ఓవర్ బ్రిడ్జీలు ( ఆర్ఓబిఎస్ ) నేషనల్ ఇన్వెస్ట్మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ ( నిమ్స్ ) కోసం జరుగుతున్న భూసేకరణ అంశాలను సమగ్రంగా సమీక్షించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణలో ప్రజల న్యాయమైన హక్కులు కాపాడబడేలా, రైతులకు న్యాయం జరుగేలా, అలాగే అభివృద్ధి ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెద్దాపూర్, గిర్మాపూర్ శివంపేట్ మండలాల్లో భూసేకరణ సమస్యలపై సవివర చర్చ జరిపి,వాటికి సాధ్యమైన పరిష్కారాలను సూచించారు. ముఖ్యంగా రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణ విషయమై భూముల సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు . భూసేకరణలో న్యాయం జరిగేలా విక్రయ విలువలను ఆధారంగా పరిగణించాల్సిందిగా పేర్కొన్నారు .అదేవిధంగా, జహీరాబాద్ పరిధిలో ఏర్పాటు చేయతలపెట్టిన నేషనల్ ఇన్వెస్ట్మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్స్) కు సంబంధించిన భూసేకరణ పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ( ఎన్ఐసిడిసి ) తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ( టి జి ఐ ఐ సి ) ల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ( ఎంఒయు ) మేరకు, నిమ్స్ లో భాగంగా జహీరాబాద్ స్మార్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చేయబడనున్నది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక కారిడార్ కోసం అవసరమైన భూముల సేకరణపై అధికారులు సమగ్ర నివేదికను సమర్పించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ మాధురి,రెవెన్యూ అధికారులు ,నేషనల్ ఇన్వెస్ట్మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట పట్టణంలో బతుకమ్మ సంబరాల సన్నాహాలు..

**రామాయంపేట, నేటిధాత్రి:**



రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని వెంకన్నగారి చెరువు వద్ద బతుకమ్మ పండుగ వేడుకలను సంబంధించి సన్నాహాలు జోరుగా కొనసాగుతున్నాయి. చెరువు కట్టపైకి వచ్చే మహిళలు సౌకర్యంగా పూల బతుకమ్మలు నిమజ్జనం చేయగలిగేలా ప్రత్యేకంగా మెట్లు తయారు చేయడంపై మున్సిపల్ సిబ్బంది పట్టు పట్టారు.ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా భారీ సంఖ్యలో మహిళలు చెరువుకు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకే భద్రతా చర్యలతో పాటు సౌకర్యాల కల్పనకు ముందస్తుగానే పనులు ప్రారంభించారు.విద్యుత్ దీపాలు, ట్రాఫిక్ సదుపాయం, చెరువు పరిసరాల్లో శుభ్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ అధికారులు తెలిపారు. పట్టణ ప్రజలందరూ పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకునేలా మున్సిపాలిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోందని పేర్కొన్నారు.పట్టణంలో బతుకమ్మ వేడుకలు మరింత వైభవంగా, భక్తి శ్రద్ధలతో జరగాలని మున్సిపల్ సిబ్బంది ఆకాంక్షిస్తున్నారు."

## లంబాడీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి , నేటిధాత్రి:**



లంబాడీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం ఉదయం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకుంటపల్లి(11వ వార్డు)లో జరిగిన లంబాడీల తీజ్ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు, పెళ్లికాని యువతులు సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం తీజ్ పాటలకు యువతులతో కలిసి ఎమ్మెల్యే స్టెప్పులేసి సందడి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ...ఈ తీజ్ పండుగలో పెళ్లికాని యువతులు ఆట పాటలతో ఆనందంగా పాల్గొనడం మన ఆచారాలు, విలువలను భావితరాలకు తీసుకువెళ్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం లంబాడీ కులస్తుల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, లంబాడీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. తీజ్ వంటి పండుగలు సామాజిక ఐక్యతకు, సాంస్కృతిక పరిరక్షణకు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద కుంట పల్లి గ్రామ వాసులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పై ప్రత్యేక దృష్టి సారించండి

**జహీరాబాద్, నేటిధాత్రి:**



గురువారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిపై ఎంఈవోలు తనిఖీలు చేయాలని సూచించారు. స్థలం ఉన్న పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ పెంపేలా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు మధ్యాహ్నం 1 గంటలోపు విద్యార్థుల హాజరును మొబైల్ యాప్ లో ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాలని ఆదేశించారు.

## అమెరికా సుంకాల ప్రభావం తగ్గించేందుకు కేంద్రం చర్యలు




ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తికి కేంద్రం స్పందన..


**తిరుపతి, నేటిధాత్రి:**

ఆంధ్రప్రదేశ్‌లోని ఆక్వా రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై లోక్‌సభలో ఎంపీ మద్దిల గురుమూర్తి ప్రస్తావించిన విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. అమెరికా విధించిన దిగుమతి సుంకాల కారణంగా రొయ్య రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రం నుండి ఉత్పత్తి అయ్యే రొయ్యలలో దాదాపు 70 శాతం అమెరికాకు ఎగుమతి అవుతుండగా, తిరుపతి జిల్లాలోనే 28 వేల ఎకరాల్లో సుమారు 1.25 లక్షల టన్నుల ఉత్పత్తి జరుగుతోందని ఎంపీ కేంద్రానికి వివరించారు. ఈ విషయంపై సమగ్ర పరిశీలన జరిపిన తర్వాత, మెరైన్ ప్రొడక్ట్స్ ఎగుమతి అభివృద్ధి అథారిటీ (ఎంపెడా)తో చర్చించి పలు చర్యలు చేపట్టినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ తెలిపారు. అమెరికా పరస్పర సుంకాల నిర్ణయం నేపథ్యంలో ఆక్వా రైతులు నష్టపోకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా అధిక విలువ కలిగిన సముద్ర జాతుల ఉత్పత్తి వైపు దృష్టి సారించిందని తెలిపారు. ఇందులో సీబాస్, కోబియా, పాంపానో, క్రాబ్, తిలాపియా, గ్రూపర్, బ్లాక్ టైగర్,స్కాంపి వంటి జాతులను ప్రోత్సహిస్తోందన్నారు. తద్వారా ఆక్వాకల్చర్ రైతుల ఆదాయ భద్రతను పెంచి, అమెరికా వంటి ప్రధాన మార్కెట్లలో టారిఫ్‌ల కారణంగా వచ్చే ఆదాయ నష్టాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని తెలియజేశారు అంతేకాకుండా ఎంపెడా ప్రపంచవ్యాప్తంగా కొత్త మార్కెట్లను గుర్తించడం తో పాటుగా, ఇప్పటికే ఉన్న మార్కెట్లను విస్తరించే దిశగా కృషి చేస్తోందన్నారు.రైతులకు లాభదాయకమైన ధరలు లభించేలా వివిధ ప్రభుత్వాలు, కొనుగోలు, ఎగుమతిదారులు సమావేశాలు, వాణిజ్య ప్రతినిధి బృందాల ద్వారా చర్యలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. దేశీయ మార్కెట్ లో ఆక్వా ఉత్పత్తుల వినియోగాన్ని పెంపొందించేందుకు కూడా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపిందని తెలియజేశారు.ఆక్వా రైతుల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపట్టేందుకు కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అమెరికా సహా పలు దేశాలతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలపై చర్యలు జరిపి, మార్కెట్ యాక్సెస్ పెంపు, టారిఫ్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు.

# ఇంతకూ రజాకార్లెవరు?

డా.సంగిశెట్టి శ్రీనివాస్ సామాజిక, రాజకీయ విశ్లేషకులు

సంచకారి




**జహీరాబాద్ ,నేటిధాత్రి:**


రజాకార్లలో కేవలం ముస్లింలు మాత్రమే ఉన్నారు అని 'హిందూత్వ' వాదులు చేసే ప్రచారం పూర్తిగా అసత్యం, రజాకార్లలో దళితులు, బీసీలు, రెడ్లు కూడా ఉన్నారు. నిజానికి ప్రతి గ్రామంలో వారికి అన్ని విధాల షెల్టర్ ఇచ్చి, వండి పెట్టింది గ్రామ పటేల్, పట్వారీలు. వీళ్లు ఎక్కువగా రెడ్డి, బ్రాహ్మణ సామాజికవర్గం వారే! ఈ వాస్తవాన్ని దాచిపెట్టి రజాకార్ల పేరిట ముస్లిం సమాజాన్ని మొత్తాన్ని టార్గెట్ చేయడము, దోషులుగా చిత్రించడం, ముస్లింలందరూ రజాకార్లే అనే విధంగా భావజాల వ్యాప్తి చేయడం ప్రజల మధ్యన విద్వేషాలను సృష్టించేందుకు వేసే పన్నాగంగానే చూడాలి.

తమ అధికారంలోకి రావాలన్నా, ఉన్న అధికా రాన్ని కాపాడుకోవాలన్న భారతీయ జనతాపార్టీ మత రాజకీయాలపై ఆధారపడుతుంది. మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి ప్రత్యేకంగా వాట్సప్ యూనివర్సిటీ సహకారం తీసుకుంటుంది. మతాల మధ్యన ఉద్రిక్తత సడలకుండా చూస్తుంది. ఆవుల రవాణా అడ్డుకునే పేరిట లేని అధికారాన్ని చేతు ల్లోకి తీసుకొని ఆ పార్టీ మద్దతుదారులు లించింగ్కు పాల్పడుతారు. అంతెందుకు చేప్ కేసులో శిక్ష పడ్డ గుజరాతీ నిందితులను విడుదల చేయించడంలోనూ, విడుదలైన వారిని ఘనంగా ఊరేగించడంలోనూ వీరికి వీరే సాటి, ఒకే దేశం, ఒకే సంస్కృతి' పేరిట భిన్నత్వాన్ని చెరిమేస్తున్నది. నిలదీస్తే నిందిస్తున్నదీ వీళ్ళే. మొత్తమ్మీద తమకు ఓట్లు ఒనగూరే ఏ మార్గాన్నైనా ఈ పార్టీ ఆరాధిస్తుంది. అనుసరిస్తుంది. మెజారిటీ–మైనారిటీ నేరేషన్ ప్రచారంలో పెడుతూ ఓట్ల రాజకీయా లకు తెరదీస్తుంది. ఈ పరంపరలో భాగంగానే 2024 సార్వత్రిక ఎన్నికల ముందు వరుసగా రెచ్చగొట్టే సినిమాలు తీసి విడుదల చేసింర్రు. అందుకు తగ్గట్టుగా రాజకీయ లాభమూ పొందింర్రు! అందులో భాగంగానే దేశ వ్యాప్తంగా 'రజాకార్' అనే సినిమాను విడుదల చేసింర్రు. ఇప్పుడు హైదరాబాద్పు పోలీసు చర్య జరిగి 77 ఏండ్లయిన సందర్భంగా మరో సారి ఈ విషయాల గురించి మాట్లాడుకోవాల్సిన అవసరమున్నది. 1947 ఆగస్టు 15 తర్వాత నిజాం హైదరాబాద్ను ప్రత్యేక దేశంగా ప్రకటించుకున్నాడు. ఈ మేరకు ఇండియా– హైదరాబాద్ రాజ్యాల మధ్యన నవంబర్ 29, 1947 నాడు యథాతథ ఒడంబడిక జరిగింది. పాకిస్తాన్ ప్రధాని జిన్నా, ఇంగ్లండ్ ప్రధాని విన్స్టన్ చర్చిల్లు హైదరాబాద్ రాజ్య సార్వభౌమాధికారాన్ని గుర్తించారు. లాండ్లకే దేశమయినంత మాత్రానా దానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు ఉండవా అని చర్చిల్ దేశ పార్లమెంటులో మాట్లాడిండు. హైదరాబాద్ని వెనకేసుకొచ్చిండు. ఈ అన్నింటి నేపథ్యంలో హైదరాబాద్పు ఇండియా దాడి సరికాదంటూ రజాకార్లు తిరుగుబాటు చేసింర్రు. అయోధ్యలో బాబ్రీమసీదుని కూల్చిన కరసేవకుల మాదిరిగానే రజాకార్లు చట్టానికి అతీతులుగా వ్యవహరించారు. నిజానికి రజాకార్లు అంటే దైవ కార్యకర్తలు. ఈ దైవ కార్యకర్తలు దేవుని పేరిట నిజామ్ ప్రభుత్వాన్ని, 'ప్రభువు' ఉస్మానలీ ఖాన్ని కాపాడేందుకు అనుసరించిన దోపిడి, దౌర్జన్య, హత్య, అత్యాచార మార్గాలను ఖండించాల్సిందే. ఈ దుర్మార్గానికి గాను వారిని నిందించాల్సిందే, నిలదీయాల్సిందే. దోషులుగా నిలబెట్టాల్సిందే. అయితే అదే సమయం లో రజాకార్లు ఎవరు? ఇందులో అన్ని మతాల వారున్నారా? ఉంటే వారి వ్యవహార శైలి ఎలా ఉండింది? అనే విషయాలన్నీ కూలంకషంగా చర్చించుకోవాలి. స్వీయ ప్రయోజనాల కోసం వాస్తవాలను వక్రీకరించకుండా చూడాలి. రజాకార్' సినిమాలో అత్యాచారాలు, హత్యలు చేసే ఉన్మాద బృందంగా ఈ రజాకార్లను చిత్రించారు. అయితే ఈ రజాకార్లలో కేవలం ముస్లింలు మాత్రమే ఉన్నారు అని హిందూత్వ వాదులు చేసే ప్రచారం పూర్తిగా అసత్యం, రజాకార్లలో దళితులు, బీసీలు, రెడ్లు కూడా ఉన్నారు. నిజానికి ప్రతి గ్రామంలో వారికి అన్ని విధాల షెల్టర్ ఇచ్చి, నండి పెట్టింది గ్రామ పటేల్, పట్వారీలు, వీళ్లు ఎక్కువగా రెడ్డి, బ్రాహ్మణ సామాజిక వర్గం వారే! ఈ వాస్తవాన్ని దాచిపెట్టి రజాకార్ల పేరిట ముస్లిం సమాజాన్ని మొత్తాన్ని టార్గెట్ చేయడము, దోషులుగా చిత్రించడం, ముస్లింలందరూ రజాకార్లే అనే విధంగా భావజాల వ్యాప్తి చేయడం ప్రజల మధ్యన విద్వేషాలను సృష్టించేందుకు చేసే పన్నాగంగానే చూడాలి. దొరలు, దేశ ముఖు, దేశ పొండ్యాలు, జాగీర్దార్లు, జమీందార్లు గ్రామాల్లో చేయించే నిర్బంధ వెట్టిచాకిరిని నిరసిస్తూ 1937, 1938 రెండేండ్లలోనే తెలంగాణలోని కేవలం నల్లగొండ, వరంగల్ జిల్లాలలో మొత్తం 18వేల మంది దళితులు ఇస్లామ్ మతంలోకి మారింర్రు. వెట్టి దాకిరి నుంచి విముక్తి కలగడమే గాకుండా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సంస్థ వాళ్లు వీరిని కొంత ఆర్థికంగా ఆదుకున్నారు. ఇట్లా మతం మార్చుకున్న వారిని ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా రక్షణగా ఉండింది కూడా మజ్లిస్ బృందమే! కేవలం దళితులే కాదు బీసీలు కూడా ఇట్లా మతం మార్చుకున్న వారిలో ఉన్నారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అన్న దొడ్డి మల్లయ్య కూడా ఇస్లామ్ స్వీకరించిండు. తన మందలోని గొర్లను దొరలు బలవంతంగా ఎత్తుకుపోవడానికి పరిష్కార మార్గంగా దొడ్డి మల్లయ్య మతం మారిండు. శుద్ధి, కబ్లీగ్ ఉద్యమాలు రెండు వైపులా జరిగాయి. ఈ ఉద్రిక్త పరిస్థితి ఒక దశాబ్దంపాటు కొనసాగింది.






అంతేందుకు నిజాం ప్రభుత్వంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పింగళి వెంకటరామారెడ్డి ఉప ప్రధానిగా వ్యవహరించిండు. రజాకార్లకు మద్దతుదారుగా నిలిచారు అనే ఆరోపణలపై పోలీస్ యాక్షన్ తర్వాత ఈయన్ని మిలిటరీ ప్రభుత్వం గృహ నిర్బంధంలో ఉంచింది. ఈయన తనయుడు పింగళి జగన్మోహన్రెడ్డి ఆ తర్వాత జడ్జిగా పనిచేశారు. అదే సమయంలో వెంకటరామారెడ్డితో పాటు గృహ నిర్బంధంలో ఉన్న మరో మంత్రి బి.ఎస్.వెంవిద్యాశా దళితుడైన బి.ఎస్.వెంకటరావు బహిరంగంగానే రజాకార్లకు మద్దతు ప్రకటించిండు. ఈయన నిజాం ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిండు. తన పదవీ కాలంలో అంబేడ్కర్ ఔరంగా బాద్లో ఏర్పాటు చేసిన కళాశాలకు ఈయన ఆర్థికంగా అండగా నిలిచిండు. దళితుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఒక కోటి రూపాయల నిధిని నిజామ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ నిధి నుంచి విద్యాశాఖా మంత్రిగా పదిలక్షల వరకు తన అభీష్టం మేరకు సంస్థలకు కేటాయించే అధికారం ఆయనకుండింది. అట్లా ఎన్ని సార్లయినా కేటాయించే అధికారాన్ని ప్రభుత్వం ఆయనకు కట్ట బెట్టింది. అయితే ఈ సొమ్ములో నుంచి కాసిం రజ్వీ నడిపించిన రజాకార్లకు ఆర్థిక సహాయం అందిందని రిపోర్టు ఆన్ ద రజాకార్స్ అనే పేరిట హైదరాబాద్పు పోలీసు చర్య జరిగిన వెంటనే ప్రచురించిన గ్రంథంలో పేర్కొన్నారు. ఇదే నివేదికలో బి.ఎస్.వెంకటరావు స్వయంగా బీదర్ కు వెళ్ళి దళితులను రెచ్చగొట్టి భూస్వాములను దోచుకో వాలని రెచ్చగొట్టినట్టు కూడా పేర్కొంది. అయితే ఇదంతా ఎక్కడా కూడా రుజువు కాలేదు. బి.ఎస్.వెంకటరావుని కూడా మిలిటరీప్రభుత్వం నిర్బంధంలోకి తీసుకున్నది. మొత్తం ఐదు మంది హిందువులు నిజాం ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసింర్రు. ఇందులో మొదటి వ్యక్తి పింగళి వెంకట రామారెడ్డి పూర్తి కాలం నిజాంకు మద్దతుదారుడిగా ఉన్నారు రెండోపూర్తి బి.ఎస్.వెంకటరావు. ఈయన కూడా సానుకూలంగానే ఉన్నాడు. మూడో వ్యక్తి రామాచారి. కర్నాటక–హైదరాబాద్కు చెందిన ఈయన మొదట నిజాం ప్రభుత్వంలో చేరిండు. అయితే వారి చర్యలు హిందు పులకు వ్యతిరేకంగా ఉండడంతో కొన్ని రోజుల తర్వాత బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఈయన కాంగ్రెస్ వాది, మరో వ్యక్తి మల్లికార్జు నప్ప, హైదరాబాద్– కర్నాటకకు చెందిన ఈయన లింగాయత్ ల ప్రతినిధిగా మంత్రివర్గంలో కొనసాగించు. చివరి వ్యక్తి జోషి, ఈయన గుజరాతీ మూలాలున్న మరత్వాణా లాయర్. కాసీం రజ్వీని అప్పటి దేశ ఉప ప్రధాని సర్దార్ పటేల్తో కల్పించింది కూడా ఈ జోషియే జోషికి పటేల్



డా.సంగిశెట్టి శ్రీనివాస్
సామాజిక, రాజకీయ విశ్లేషకులు

సంచకారి

బంధువు కావడంతోనే ఆయన మంత్రయిందు అనే ప్రచారమూ జరిగింది. ఇట్లా నిజాం ప్రభుత్వంలో ఉన్నటువంటి హిందువులందరూ ప్రభుత్వానికి సానుకూలంగానే ఉన్నారు. (ఒక్క రామాచారి తప్ప), ఈ సమయంలోనే రజాకార్ల ఆగడాలు కూడా జరిగినాయి. అయితే ఈ ఆగడాలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమయింది. ఈ విఫలమయిన ప్రభుత్వంలో వీరూ ఉన్నారు.

అట్లాగే ఆగడాలను అరికట్టక పోవడమే గాకుండా వారికి లోపాయ కారిగా మద్దతు పలికింది పోలీసు డైరెక్టర్ నవాబ్ దీన్ యార్ జంగ్. ఆయన పూర్తిగా ఖాసిం రాజ్వి మనిషిఇక్కడ గుర్తించాల్సిన విషయమేమిటంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పోరాటం చేసింర్రు. కమ్యూనిస్టులు నిజామ్ ప్రభుత్వం రద్దు కావాలని, భూమి, భుక్తి, విముక్తి కోసం కొట్లాడింర్రు. ఇక్కడ రజాకార్లు ప్రధానంగా ఘర్షణ పడ్డది కమ్యూనిస్టులతోనే అశ్వరావుపేట (ఖమ్మం జిల్లా)లాంటి మారుమూల ప్రాంతాల్లో సైతం మందుపాతరలో రజాకార్లు చనిపోయింర్రు. అయితే భారత సైన్యం హైదరాబాద్పు పోలీసు చర్య జరిపిన తర్వాత కమ్యూనిస్టులు, రజాకార్లు ఒక్కట య్యింర్రు. రజాకార్ల ఆయుధాలు కమ్యూనిస్టుల పరమయ్యాయి. ఇట్లా చరిత్రలో అనేక మలుపులు తిరిగిన రజాకార్ల గురించి సరైన విశ్లేషణ ఇంకా జరగాల్సి ఉన్నది. రజాకార్ల పాలన, నయా రజాకార్లు అంటూ ఇప్పటికీ ముస్లింలను దృష్టిలో పెట్టుకొని కొన్ని పార్టీలు ప్రచారం చేస్తూ ఉంటాయి. వారికి రజాకార్లలో అన్ని మతాల వారు, అన్ని కులాల వారు ఉన్నారు అనే విషయాన్ని అర్థం చేయించాలి. ఈ విషయాలు అర్థం కాకపోవడం మూలంగానే భారత కమ్యూనిస్టు పార్టీ సెప్టెంబర్ 17ని విలీన దినంగా చేయాలని కోరుతుంది. తన ఎజెండా క్లియర్గా ఉండడంతో భారతీయ జనతా పార్టీ విమోచన దినంగా జరుపుతున్నది.

## బిఆర్ఎస్ లో చేరిన మల్లక్కపేట కాంగ్రెస్,బిజెపి నాయకులు

**పరకాల, నేటిధాత్రి:**



మండలంలోని మల్లక్కపేట గ్రామానికి చెందిన పలువురు బిజెపి,కాంగ్రెస్ పార్టీలకు చెందిన బిజెపి గ్రామ అధ్యక్షులు బండి ఉదయ్ కిరణ్,తాళ్ల ప్రదీప్,బూత్ కమిటీ అధ్యక్షులు గురజాల శివరాజు,బొజ్జమ్ శివ,కాంగ్రెస్ బూత్ కమిటీ అధ్యక్షులు చెన్న రాజేందర్ బిఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ లో చేరారు.వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు.వచ్చే స్థానిక సంస్థల పోరులో బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వవైఫల్యాలని,మోసాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు,మాజీ వైస్ ఎంపిపి చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి,మాజీ సర్పంచులు సుమాల శ్రీనివాస్,బయ్యా రాజేందర్,గ్రామ బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహం,బిపి పరీక్షలు



**తాండూరు, నేటిధాత్రి:**

మాదారం పోలీస్ స్టేషన్ గ్రౌండ్ లో ఓపెన్ జిమ్ వద్ద తాండూర్ తెలంగాణ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 46 మందికి మధుమేహం(షుగర్) బి.పి పరీక్షలు ఉచితంగా చేపించారు.మధుమేహం (షుగర్) బీపీ ఉన్నవారికి జాగ్రత్తలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు దేవరకొండ రాజయ్య,ఉపాధ్యక్షులు ఠాగూర్ ఉగ్రాసింగ్,మద్దికుంట రామచందర్,క్యాబినెట్ మెంబర్ రౌతు వెంకటేశం, తాటిపాముల సాంబమూర్తి ,గందె రాజన్న, తొగరు శ్రీనివాస్,ల్యాబ్ టెక్నీషియన్ వేణు,వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## యువతమాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఎస్సై పరమేష్



**శాయంపేట, నేటిధాత్రి:**

శాయంపేట మండలం గోవిందా పూర్ గ్రామంలోజాగృతి పోలీస్ కళా బృందం వరంగల్ నగర పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 8:45 గంటల వరకు శాయంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవిందా పూర్ గ్రామంలో పోలీస్ కళా బృందం వారిచే యువకులు గంజాయి డ్రగ్స్,గుట్క మత్తు పదార్థాల బారిన పడవద్ద ని,గంజాయి అమ్మిన సేవించిన 8712584473 మొబైల్ నెంబరుకు సమాచారం అందించాలి. ప్రమాదాలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, డయల్100, సీసీటీవీ కెమెరాలు, వృద్ధాప్యం లో తల్లితండ్రులను మంచిగ చూసుకోవాలని, మూఢ నమ్మకాలపై మ్యాజిక్ షో, అలాగే తదితర సామాజిక అంశాలపై పాటల ద్వార వివరిస్తూ, మరియు సైబర్ క్రైమ్స్, బెట్టింగ్ ఆప్స్ పై నాటిక ద్వార ప్రదర్శన చేస్తూ1930 సైబర్ హెల్ప్ లైన్ నంబర్ తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పరమేశ్ ఏ ఎస్ ఐ కుమారస్వామి, హెడ్ కానిస్టేబుల్,కానిస్టేబుల్స్ ఆఫీసర్స్, కళాబృందం ఇంచార్జ్ వుమెన్ ఏఎస్ఐ నాగమణి సభ్యులు, హెచ్ ఎస్ విలియమ్, వెంకటేశ్వర్లు,రత్న య్య, పిసి పూల్ సింగ్, హోమ్ గార్డ్స్ శ్రీనివాస్, నారాయణ, చిరంజీవి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## రోడ్డుపై ధర్నా చేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



**భూపాలపల్లి ,నేటిధాత్రి:**

అంబేద్కర్ చౌరస్తా టు జంగేడు వరకు నాలుగు లైన్ల రోడ్డు పనులు గత రెండు సంవత్సరాల నుండి పూర్తికాలేదు ఈ రోడ్డు నిధులను స్థానిక ఎమ్మెల్యే తన సొంత మండలమైన ఘనపురం మండలానికి నిధులను దారి మళ్లించారు ఈ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమనే రెడ్డి ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ భూపాలపల్లి అంబేద్కర్ చౌరస్తా నుండి జంగేడు వరకు సెంట్రల్ లైటింగ్ నాలుగు లైన్లతో రోడ్డుకు 10 కోట్లతో రూపాయలతో రోడ్డు నిర్మాణానికి గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడం జరిగింది కానీ ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు 10 కోట్లు కేటాయించడం జరిగింది కానీ ఆ నిధులను స్థానికంగా గెలిచిన ఎమ్మెల్యే భూపాలపల్లి అభివృద్ధిని మరిచి నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం నిధులను తన సొంత మండలమైన ఘనపురం మండలానికి నిధులను దారి మళ్లించారు ఇప్పటికైనా అంబేద్కర్ చౌరస్తా టు జంగేడు వరకు నాలుగు లైన్ల రోడ్డుకు నిధులు కేటాయించి రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యేను జిల్లా కలెక్టర్ ను డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్ మాజీ మున్సిపల్ చైర్మన్ వెంకటరాణి సిద్దు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి రఘుపతిరావు తిరుపతి మాడ హరీష్ రెడ్డి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ దాడులు.



**నల్లబెల్లి, నేటిధాత్రి:**

ఉమ్మడి వరంగల్ జిల్లా డిప్యూటీ కమిషనర్ అంజన్న రావు ఆదేశాల మేరకు నాటు సారా నియంత్రణకై స్పెషల్ డ్రైవ్ లో భాగంగా గురువారం నల్లబెల్లి మండలం నందిగామ, రేలకుంట జంట గ్రామాలలో నాటుసార స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించడం జరిగిందని.ఈ దాడులలో ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి 45 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని 1900 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేయడం జరిగిందని వరంగల్ రూరల్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ మురళీధర్ పేర్కొన్నారు. ఈ దాడులలో జిల్లా ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ శ్రీనివాస్ రెడ్డి, నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి, వరంగల్ రూరల్ టాస్క్ ఫోర్స్ సీఐ రమేష్ చందర్, ఎన్ఫోర్స్మెంట్ సిఐ నాగయ్య, ఎస్సైలు రమ, శిరీష, స్థానిక ఎస్ఐ గోవర్ధన్ సిబ్బంది పాల్గొన్నారు

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను అవమానపరిచిన

▶▶బీసీ, దళిత సంఘాల డిమాండ్



**సిరిసిల్లటౌన్, నేటిధాత్రి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవం లో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ప్రోటోకాల్ పాటించకుండా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను అవమానపరిచి అగౌరపరచినందున అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం, బీసీ కుల సంఘాలుమరియు దళిత సంఘాలు గురువారం రోజున డిమాండ్ చేశాయి, కలెక్టర్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేసిన అనంతరం బీసీ సంక్షేమ



సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు గడ్డం నరసయ్య, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్పా దేవయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, పద్మశాల సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు కత్తెర దేవదాసు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రాగుల రాములు, ఎస్సీ ఎస్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు కంసాల మల్లేశం , బీసీ సేన జిల్లా అధ్యక్షుడు బట్టు ప్రవీణ్, బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్ లు గురువారం రోజున అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలియజేసి మాట్లాడుతూ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే బీసీ బిడ్డ ఆది శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేస్తున్న క్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా ప్రోటోకాల్ పాటించకుండా మధ్యలోనే వచ్చి తన కారు సైరన్ సౌండ్ మోగించి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ని మరియు ప్రజా పాలన దినోత్సవాన్ని అగౌరపరిచి అవమానించారన్నారు, ఉద్దేశపూర్వకంగా ఒక బీసీ బిడ్డ ఆయన ఆది శ్రీనివాసును ప్రోటోకాల్ పాటించకుండా అవమానపరిచిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆది శ్రీనివాస్ కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు , చట్టరీత్యా చర్య తీసుకోవాలని ఎస్పీ గారికి ఫిర్యాదు చేసిన అనంతరం పై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు, ఆది శ్రీనివాస్ పై జరిగిన అవమానం యావత్తు బీసీ ,దళితులకు జరిగిన అవమానంగా మేము భావిస్తున్నామన్నారు, చర్యలు తీసుకోకపోతే నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో పర్శ హన్మాండ్లు,గడ్డం నరసయ్య, కత్తెర దేవదాసు , బొప్ప దేవయ్య , చొక్కాల రాము, గోలి వెంకటరమణ, రాగుల రాములు ,రాగుల జగన్ ,బట్టు ప్రవీణ్ ,తడక కమలాకర్, కంచర్ల రాజు , రవీందర్, మల్లేశం ,ఇల్లంతకుంట తిరుపతి, నల్ల శ్రీకాంత్, సామల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


# నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎస్ ఎస్ వి ఎం స్కూల్

▶▶పలు ప్రమాదాలు జరిగిన పట్టించుకొని అధికారులు

▶▶కనీస తరగతుల సౌకర్యాలు లేకుండా పాఠశాల నిర్వహణ

**మహాదేవపూర్, నేటిధాత్రి:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని సూరారం గ్రామంలోని ఎస్ ఎస్ వి ఎం పాఠశాల నియమ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని గురువారం రోజున ఒక ప్రకటనలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు అన్నారు. ఒక పాఠశాల నిర్వహించాలంటే తరగతులకు అనుగుణంగా తరగతి గదులు విద్యార్థులు ఆడుకోవడానికి క్రీడా ప్రాంగణం తో పాటు ఉపాధ్యాయులకు కనీస విద్యా అర్హత తో పాటు జిల్లా స్థాయి మండల స్థాయి అధికారుల దగ్గర నుండి గుర్తింపు పత్రాలు దూరప్రాంతాల విద్యార్థుల రాకపోకలకు బస్సు సౌకర్యం తో పాటు దానికి సంబంధించిన పూర్తి అర్హతలు ఉంటేనే ఒక పాఠశాల నిర్వహించడానికి అర్హత కలుగుతుంది కానీ సూరారంలో ఎస్ఎస్వి ఎం పాఠశాలకు ఇలాంటి అర్హతలు ఏమి లేకున్నా ఇన్ని సంవత్సరాలు పాఠశాల నిర్వహిస్తున్న కూడా మండల స్థాయి జిల్లా స్థాయి అధికారులు కనీసం తొంగి



చూడకపోవడం గమనార్హం. ఇలాంటి పాఠశాల నిర్వహించడానికి అనుమతులు ఎలా ఇచ్చారు అర్థం కావడం లేదని వాపోయారు. గతంలో కూడా ఆ స్కూల్లో ఉన్నటువంటి స్కూల్ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అంబటిపల్లి గ్రామంలో మూడేళ్ల చిన్నారి మృతి చెందినప్పటికీ పాఠశాల పై గానీ దానికి బాధ్యులైన వారిపై కానీ చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిమ్మకు నేర్పినట్టు వ్యవహరించడం పట్ల ఆంతర్యం ఏమిటో తెలియాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల అనుమతులు రద్దు చేసి పాఠశాల ప్రిన్సిపాల్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎఫ్ ఎఫ్ ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా మహాదేవపురం మండల ఎంఈఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు నెయ్యర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పరిశుభ్ర తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి, నేటిధాత్రి:**

భూపాలపల్లి పట్టణాన్ని పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ దసరా పండుగల ఏర్పాట్లు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఇంటింటి నుండి వ్యర్థాలు సేకరణ, స్వచ్ఛ వాహనాలను జిపిఎస్ ట్రాక్టర్ ద్వారా పర్యవేక్షణ, సిబ్బంది సమయపాలన, ఖాళీ ఇంటి స్థలాలు పరిశుభ్రంగా ఉంచడం, వన మహోత్సవంలో ప్రతి ఇంటికి 6 మొక్కలు పంపిణీ, ప్రధాన రహదారి డివైడర్ లో మొక్కలు సంరక్షణ, వ్యర్థాలు నుండి వర్మీ తయారు, చిన్నారుల పార్కు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పక ప్రతి ఇంటి నుండి వ్యర్థాలు సేకరణ జరగాలని వార్డు అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక ఫోకస్ చేయాలని సూచించారు. వార్డు అధికారులు నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రీ సైక్లింగ్ వస్తువులు విక్రయాలు, తడి చెత్తను వర్మీ తయారు చేసి మొక్కలకు వినియోగించడం, విక్రయాలు ద్వారా ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డివైడర్ లో నాటిన మొక్కలు వంగిపోకుండా సపోర్ట్ గా కర్రలు పెట్టాలని అన్నారు. వన మహోత్సవంలో ప్రతి ఇంటికి 6 మొక్కలు పంపిణీ చేయాలని, పంపిణీ వివరాలు రిజిస్టర్ లో నమోదులు చేయాలని తెలిపారు. ఖాళీగానున్న ఇంటి స్థలాలు పరిశుభ్రం చేయాల్సిన బాధ్యత స్థల యజమానులదేనని అలాంటి స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని, నిర్దేశించిన సమయంలో పరిశుభ్రం చేయకపోతే మున్సిపాలిటీ నుండి పరిశుభ్రం చేపించి జరిమానా విధించాలని స్పష్టం చేశారు. దుకాణాల ముందు వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని, వ్యర్థాలు వేస్తే జరిమానా విధించాలని తెలిపారు. మాంసాహార దుకాణాల నుండి వ్యర్థాలు ఆరుబయట వేయకుండా అవగాహన కల్పించాలని, రహదారుల వెంబడి, ఆరుబయట వేస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. వ్యర్థాలు వేస్తున్న ప్రాంతాలను గుర్తించి వ్యర్థాలు వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా అవగహన కొరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇంటి పన్నులు వసూళ్లు నూరు శాతం జరగాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలో చిన్నారుల కోసం పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనతరం నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం, ఆడిటోరియం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని, ప్రహరి నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. బతుకమ్మ,దసరా ఉత్సవాలకు వార్డుల వారీగా సక్రమమైన ఏర్పాట్లు చేయాలని వార్డు అధికారులను ఆదేశించారు. ఈ నెల 21వ తేదీ నుండి ప్రారంభం కానున్న బతుకమ్మ సంబరాల్లో మహిళలు బతుకమ్మలు ఆడే ప్రాంతాలను గుర్తించి పారిశుద్ధ్య కార్యక్రమాలు, విద్యుత్ సౌకార్యం కల్పించాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా ఘాట్ వద్ద ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. 30వ తేదీన జరిగే సద్దుల బతుకమ్మ, 2వ తేదీన జరిగే దసరా వేడుకలకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఏ ఈ మానస, డిపిఓ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ దేవస్థానం నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించిన

**తిరుపతి, నేటిధాత్రి:**

తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం పాలక మండలి సభ్యులుగా నూతనంగా ఏర్పాటైన చైర్మన్ మహేష్ యాదవ్, కమిటీ సభ్యులు రుద్ర కిషోర్, విమల, వరలక్ష్మి, మధులత, గుణ, భాగ్య వల్లి, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, శ్యామల, లక్ష్మనరావు లను.. గురువారం గంగమ్మ తల్లి దేవస్థానంలో తిరుపతి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి సుమన్ బాబు ఘనంగా సత్కరించారు. చైర్మన్, కమిటీ సభ్యులందరికీ జనసేన నాయకులు సుధాకర్, పవన్ కుమార్,



సుమంత్ లలో కలసి శుభాకాంక్షలు తెలియజేశారుకూటమి ప్రభుత్వంలో ఏర్పడిన ఈ కమిటీ సభ్యుల ద్వారా గంగమ్మ తల్లిని భక్తులకు మరింత చేరువయ్యేలా చేయాలని, ఆలయ అభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలను అందించాలని సుమన్ బాబు కోరారు. ఈ క్రమంలో ఆముదాల వెంకటేష్, జానకిరామ్ రెడ్డి, పవన్ ముకేష్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలన రాకతో తెలంగాణకు స్వేచ్ఛ

▶▶కంచెలు తొలగించాం..మానసిక బానిసత్వ సంకెళ్లు తెంచాం..

▶▶అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ద్విముఖ వ్యూహంతో రేవంత్ రెడ్డి పాలన

▶▶ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో భూపాలపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

▶▶విలేకరుల సమావేశంలో పోలినేని లింగారావు

**మొగుళ్ళపల్లి, నేటిధాత్రి:**

ఆంధ్ర నుండి విడివడిన తెలంగాణ రాష్ట్రం పదేళ్లలో నియంత పాలనలో మగ్గిపోయిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వచ్చిన తర్వాత తెలంగాణకు స్వేచ్ఛ లభించిందని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణకు నయా నిజాంగా మారి భూములను, ప్రాజెక్టులను మింగేశాడని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు..మొగుళ్లపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోలినేని లింగారావు గత ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు. గురువారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయిన తర్వాత తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా అధికారాన్ని చేజిక్కించుకున్న కేసీఆర్ తెలంగాణ ప్రజల పాలిట నయా నిజాంగా మారాడన్నారు. పదేళ్లలో తెలంగాణ నియంత పాలనలో మగ్గిపోయిందని, ప్రజాస్వామ్యం పీక పీకేశారని ఆయన మండిపడ్డారు. ఎన్నికలకు ముందు పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం



నియంత పాలన నుంచి తెలంగాణ ప్రజలను విముక్తి చేస్తామని చెప్పిన ప్రకారంగానే 2023 డిసెంబర్ 3న తెలంగాణకు కాంగ్రెస్ ప్రభుత్వం స్వేచ్ఛను ప్రసాదించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాయంలో ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల ఫలితంగా అన్ని రంగాల్లో రాష్ట్రం సర్వతోముఖంగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన అని, దీనికి చరిత్రే సాక్ష్యమన్నారు. తెలంగాణలో దొరవేసిన కంచెలను తెంచి..మానసిక బానిసత్వ సంకెళ్లను తెంచామన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ద్విముఖ వ్యూహంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను కొనసాగిస్తున్నారన్నారు. పాలనలో పారదర్శకత..అభివృద్ధిలో ఆధునికత..సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ..తెలంగాణ రాష్ట్రం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో ఆదర్శవంతమైన రాష్ట్రంగా తెలంగాణ రూపుదిద్దుకుంటుందన్నారు. అదేవిధంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా ఉంటూ..నియోజకవర్గానికి అధిక మొత్తంలో నిధులను తీసుకువచ్చి..కనివిని ఎరుగని రీతిలో భూపాలపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నాడని పోలినేని లింగారావు కొనియాడారు.

# తిరుపతి మంగళం అడవుల్లో 6 ఎర్రచందనం దుంగలు స్వాధీనం..

▶▶ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు..



**తిరుపతి, నేటిధాత్రి:**

తిరుపతి జిల్లా కరకంబాడి రోడ్డు లోని మంగళం అటవీ ప్రాంతంలో 6ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వంలో ఆర్ ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ఎస్ఐ టి. విష్ణు వర్ధన్ కుమార్, మామండూరు నుంచి కరకంబాడీ ఆటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. గురు వారం తెల్లవారుజామున మంగళం సమీపంలోని గ్రాండ్ వరల్డ్ వెనుక వైపు కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారు. దీంతో టాస్క్ ఫోర్స్ టీమ్ వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేసింది. అయితే వారు తప్పించు కుని పారిపోసాగారుఅయితే వారిని వెంబడించిన టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇద్దరిని పట్టుకో గలిగారు. వారి నుంచి 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. వారిని దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. వారిని డీఎస్పీ వీ శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ జె శ్రీనివాస్ విచారించగా, ఎస్ ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వ్యవసాయ నమోదు భాగంగా సందర్శించిన అధికారీ వెంకటేశం



**జహీరాబాద్, నేటిధాత్రి:**

ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ గ్రామంలో పలు పంటలను వ్యవసాయ అధికారీ వెంకటేశం పంట నమోదు లో భాగంగా సందర్శిదం జరిగింది, పంట నమోదు ప్రతి రైతు పంటల వారిగా గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులకు తెలియ జేయాలి.పంట నమోదు ప్రాముఖ్యత కొనుగోలు కేంద్రాల్లో వచ్చిన పంటను అమ్ముకోవడానికి %ు% సి.సి. ఐ కేంద్రం లో కూడా పండించిన పంటల ను అమ్ముకోవడానికి ఎలాంటి ఇబ్బందులుండవు ఇందులో వ్యవసాయ విస్తరణ అధికారీ మంజుల, రైతులు బీచప్ప, మనెన్న పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు..

▶▶లక్ష రూపాయల బహుమతి అవకాశం

▶▶జిల్లా కన్వీనర్ మేడికాల అంజయ్య

**చందుర్తి, నేటిధాత్రి:**

రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, తెలంగాణ (ఎస్ ఏల్ టీ ఏ -టి ఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ లు మేడికాల అంజయ్య, రాచర్ల వేణుమాధవ్, సత్య ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకే ఈ అవకాశం ఉందన్నారు. 6వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులు, రాష్ట్ర స్థాయి కమిటీ నిర్ణయించిన తెలంగాణ కవులైన 11మంది గురించి వ్యాసం రాయాలన్నారు. ఆ కవులు, 1)బమ్మెర పోతన ,2)దాశరథి కృష్ణమాచార్య ,3)సుద్దాల హనుమంతు, 4)వట్టి కోట ఆళ్వార్ స్వామి, 5)వానమామలై వరదాచార్యులు, 6)సురవరం ప్రతాపరెడ్డి, 7)సామల సదాశివ, 8)బోయ జంగయ్య, 9)పాకాల యశోద రెడ్డి, 10)కాళోజీ నారాయణరావు, 11)డాక్టర్ సి.నారాయణరెడ్డి పాఠశాల స్థాయిలో పై కవుల గురించి వ్యాసరచన పోటీ పెట్టి ప్రతి పాఠశాల నుంచి ఒక అమ్మాయి ఒక అబ్బాయి రాసిన రెండు వ్యాసాలను జిల్లా స్థాయి పోటీలకు పంపించవలసి ఉంటుందని వారు తెలిపారు. అలా జిల్లా స్థాయిలో ప్రత్యక్ష పోటీకి ఎంపికై వచ్చిన 50 వ్యాసాల నుండి 5 గురుని ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపించనున్నట్లు అంజయ్య తెలిపారు.



రాష్ట్ర స్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ గెలిచిన విద్యార్థులందరికీ లక్ష రూపాయలను బహుమతులుగా పంచనున్నట్లు నిర్వాహకులు నిర్ణయించినట్లు, వారు తెలిపారు. జిల్లా స్థాయికి ప్రతి పాఠశాల నుంచి రెండు వ్యాసాలు పంపించాలన్నారు. వీటికి చివరి తేదీ అక్టోబర్ ఆరు గా నిర్ణయించారు. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అందరిని ఈ వ్యాసరచన పోటీలలో పాల్గొనేటట్లు చేసి, ప్రతి పాఠశాల నుంచి రెండు వ్యాసాలను పంపించేలా తెలుగు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని, ఇందుకుగాను గూగుల్ ఫాం నింపాలన్నారు. విద్యార్థులు రాసిన తెలంగాణ కవుల ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా ఉన్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడికాల అంజయ్య, వేణుమాధవ్, సత్య ప్రవీణ్ పిలుపునిచ్చారు. పూర్తి వివరాలకు 9441544727,9440491439 నెంబర్ల ను సంప్రదించాలన్నారు.

# రక్తదానం చేసిన బిజెపి మండల నాయకులు



**మహాదేవపూర్,నేటిధాత్రి:**

భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలలో భాగంగా గురువారం రోజున మండల బిజెపి నాయకులు రక్తదాన శిబిరంలో రక్తదానం చేయడం జరిగింది. కాటారం మండలంలో బిజెపి ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలలో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మహదేవ్పూర్ మండల బిజెపి నాయకులు మండల బిజెపి అధ్యక్షుడు రామ్ శెట్టి మనోజ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో రక్త దానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా మాజీ అధ్యక్షులు సునీల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చల్ల నారాయణ రెడ్డి, మండల నాయకులు ఐలయ్య, శ్రావణ్, సాయికుమార్ కొక్కు రాకేష్, శ్రీనివాస్, సంతోష్, రవి, సాయికుమార్, పలువురు నాయకులు, ప్రజలు, రక్తదాన శిబిర సిబ్బంది పాల్గొన్నారు.

# కొండముచ్చులను పట్టుకుంటున్న అటవీశాఖ సిబ్బంది

**జహీరాబాద్ ,నేటిధాత్రి:**

కొండముచ్చులను పట్టుకోవడానికి వచ్చినటువంటి సిబ్బంది మన సంగారెడ్డి జిల్లా ఫారెస్ట్ అధికారి శ్రీధర్ రావు గారి మేరకు ఈ రోజు రాంనగర్ గాంధీనగర్ లో కొన్ని కొండముచ్చులను వెతికి పట్టుకోవడం జరుగుతుంది ఇంకొన్ని కూడా సేకరించి పట్టుకుంటారని వారు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలోజహీరాబాద్ అటవీ శాఖ అధికారులు ఎస్ ఎఫ్ ఓ స్టేషన్ ఫారెస్ట్ ఆఫీసర్ కృష్ణమ్మ, కిరణ్ కుమార్ ,బిటి ఆఫీసర్లు భవాని, సంజీవ్ గార్లు మరియు , జాగో తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు పి రాములు నేత,



ప్రధాన కార్యవర్గ సభ్యులు మహమ్మద్ ఇమ్రాన్, మాదినం శివప్రసాద్ , కార్యవర్గ సభ్యులు ప్యార్ల దశరథ్, మహమ్మద్ ఫసి,కాలనీ వాసులు కడమంచి ఎల్లయ్య, కల్లెం శ్రీనివాస్ ,పస్తం శ్రీనివాస్, కుమారి మల్లేష్ తదితరులు కొండముచ్చులను పట్టుకోవడానికి సహకరించినారు.

# అంత్యక్రియల్లో పాల్గొన్న తక్కళ్ళపల్లి రాజు



**మొగుళ్లపల్లి, నేటిదాత్రి:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామానికి చెందిన ఊరుగొండ రాజేందర్ అనారోగ్యంతో గురువారం ఉదయం మృతిచెందాగా. విషయం తెలిసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కళ్లపల్లి రాజు (రాజేశ్వర్ రావు) మృతుని పార్థివ దేహాన్ని సందర్శించి అంత్యక్రియల్లో పాల్గొని ఊరుగొండ రాజేందర్ ఆత్మకు శాంతిః చేకూరాలని పాడే మోసి కన్నీటితో వీడ్కోలు పలికారు. మృతిని కుటుంబానికి ఆ భగవంతుడు అన్ని విధాలుగా ఆదుకోవాలని వేడుకున్న తక్కళ్ళపల్లి రాజు ఆ కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

# దశాబ్దకాలం ఐన ప్రారంభానికి నోచుకోని నీలికుర్తి గోపాల మిత్ర భవనం

▸▸సిపిఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ గౌడ్

**మరిపెడ ,నేటిధాత్రి:**



నీలికుర్తి గోపాలమిత్ర భవనం పూర్తి అయి దశాబ్ద కాల మవుతున్న ప్రారంభానికి నోచుకోలేదు గోపాలమిత్ర భవనాన్ని ప్రారంభించాలి జిల్లా పశు వైద్యాధికారికి కిరణ్ కుమార్ కి పలు అంశాలతో కూడిన వినపత్రాన్ని మరిపెడ మండలంలోని నీలుకుర్తి పరిధిలోని నీలికుర్తి,ఆనేపురం, బావొజీ గూడెం ఉమ్మడి గ్రామాల పరిధిలో గోపాల మిత్ర భవనం నీలికుర్తి గ్రామంలో దశాబ్ద కాలం క్రితం మంజూరై భవనం పూర్తయిన నేటి వరకు గోపాల మిత్ర భవనం ప్రారంభం కాకుండా శిధిల వ్యవస్థలోకి వెళ్ళింది కాబట్టి ఈ పరిధిలో ఉన్న గ్రామాలను రైతాంగాన్ని పశు సంపదని దృష్టిలో పెట్టుకొని తక్షణమే పశువు సంపదని కాపాడాలని గోపాలమిత్ర భవనాన్నిప్రారంభించాలని తమరి దృష్టి సాధించి సమస్యను పరిష్కరించాలనిసిపిఐ మరిపెడ మండల సమితి తరఫున తెలియజేస్తున్నాము ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ పట్టణ కార్యదర్శి మల్లెపాక యాకన్న నాయకులు వీరేందర్ తదితరులు పాల్గొన్నారు

# నిత్య జాతీయ పతాకావిష్కరణ 75వ రోజు కార్యక్రమం

▸▸కష్టపడితేనే విజయాన్ని సాధిస్తారు

▸▸పూర్వ విద్యార్థి రిటైర్డ్ ఇంజనీర్ పత్తిపాక మదన్

**సిరిసిల్లటౌన్, నేటిధాత్రి:**




రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం "నిత్య జాతీయ పతాకావిష్కరణ 75వ రోజు కార్యక్రమంలో" భాగంగా జాతీయ పతాకాన్ని రిటైర్డ్ ఇంజనీర్ పత్తిపాక మదన్ పతాకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ జాతీయ పతాకావిష్కరణ అవకాశం మాన్యులకే కాకుండా సామాన్యులకు కూడా అందించేటువంటి నిత్య జాతీయ పతాకావిష్కరణ అభినందనీయమని ప్రతిరోజు విద్యార్థుల చేత జాతీయ పతాకావిష్కరణ చేయించడం ఒక వినూత్న కార్యక్రమమని ఈ విధంగా ఈ విధమైన కార్యక్రమాన్ని నిర్వహించే రాష్ట్రంలోని ఏకైక కళాశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల అని తెలిపారు .ప్రతి విద్యార్థి దేశభక్తి భావాలను పెంచుకోవాలని క్రమశిక్షణతో చదివితే ఎలాంటి ఉన్నత ఉద్యోగాలైన సాధించవచ్చు అని వారు పేర్కొన్నారు. విద్యతోపాటు క్రమశిక్షణ (సెల్ఫ్ డిసిప్లేన్,) పుస్తక పఠనం చేయాలని ప్రతి విద్యార్థి సెల్ ఫోన్లకు దూరంగా ఉండి, మీ గురువులు చెప్పే విషయాలను పాటించి. (ఇష్టపడి) కష్టపడి చదివితేనే మీ లక్ష్యాన్ని చేరగలుగుతారని ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని వారు తెలిపారు. పూర్వ విద్యార్థులైన మేము మా వంతుగా మేము చదివిన కళాశాలకు మౌలిక వనరులను మరియు పిల్లల భవిష్యత్తుకు కావలసిన వసతులు కల్పిస్తామని వారు చెప్పారు. ఇంగ్లీష్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ లో ప్రాక్టికల్స్ ఉన్నాయి కాబట్టి విద్యార్థుల ద్వారా ఈరోజు ప్రత్యక్షంగా జస్ట్ ఎ మినిట్, జెఎఎం మరియు రోల్ ప్లే ప్రదర్శించడం జరుగుతుంది. ఇదే కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ గాజుల ప్రతాప్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కనక శ్రీ విజయ రఘునందన్ . అధ్యాపకులు శ్రీధర్ ,బి వెంకటేశం. కేదారేశ్వర్.సామల వివేకానంద్, కనకయ్య.రాజయ్య , చంద్రమౌళి,పి. ఆంజనేయులు, సరోజ, విజయ రాజశేఖర్, శ్రీనివాస్ , సుజిత , నర్మద, మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పొలం కాపాడాలని హెచ్ఎండిఏకు ఫిర్యాద

▸▸బాధ్యులపై చర్యలు తీసుకోండ

**బాలానగర్, నేటిధాత్రి:**



జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలంలోని శేరిగూడ గ్రామంలో 2023 సంవత్సరంలో ఓ వెంచర్ యజమాని రోడ్డు పేరుతో.. సర్వేనెంబర్.. 78లో ఎకరా ప్రభుత్వ భూమి ఆక్రమించాడని సామాజిక కార్యకర్త కోస్గి వెంకటయ్య గురువారం హైదరాబాదులోని హెచ్ఎండిఏ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. గతంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయికి ఫిర్యాదు చేశామని.. ఈ వ్యవహారం తమ పరిధిలోకి రాదన్నారు. సందర్భంగా కోస్గి వెంకటయ్య మాట్లాడుతూ.. రైతులకు రోడ్డు పేరుతో ప్రభుత్వ భూమిని ఆక్రమించి వెంచర్ స్టాచ్యూ ఏర్పాటు చేశాడన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

# తీజ్ ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ



**భూపాలపల్లి , నేటిధాత్రి:**

లంబాడీల సాంప్రదాయ తీజ్ పండుగని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమరెడ్డి అన్నారు భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని పెద్దకుంటపల్లి 11వ వార్డు లో మాజీ కౌన్సిలర్ జుమ్మిలాల్ రజిత ఆధ్వర్యంలో తీజ్ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ పండుగ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరైనారు ఈ సందర్భంగా మాట్లాడుతూ లంబాడీల సాంస్కృతి సాంప్రదాయాల పండుగ తీజ్ పండుగ పెండ్లి కానీ యువతలు ఆటపాటలతో ఆనందంగా పాల్గొని లంబాడీల సాంస్కృతిని సాంప్రదాయాలను ఆచారాలు విలువలను భావితరాలకు అందించడమే ఈ పండుగ యొక్క ముఖ్య ఉద్దేశం అని మాజీ ఎమ్మెల్యే గండ్ర అన్నారు అనంతరం మహిళలతో కలిసి తీజ్ ఉత్సవంలో నృత్యం చేశారు జుమ్మిలాల్ ఇంటివద్ద ఏర్పాటుచేసిన విందులో పాల్గొని వారి కుటుంబ సభ్యులు గ్రామస్తులు కలిసి భోజనం చేశారు ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ జుమ్మిలాల్ రజిత మున్సిపల్ మాజీ చైర్మన్ వెంకట రాణి సిద్దు మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలు

▸▸జనం మెచ్చిన నేతకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన భీమ్ భరత్

▸▸జన్మదిన వేడుకలో పాల్గొన్న నవాబుపేట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

**శంకర్పల్లి, నేటిధాత్రి:**



చేవెళ్లనియోజకవర్గం మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం బంజారాహిల్స్ లోని తన స్వగృహంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భీమ్ భరత్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ జనం మెచ్చిన జన నేతకి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ప్రజల మధ్యలో ఉండి ప్రజల కోసం పోరాడే రాజకీయ నాయకుడి పాత్ర సమాజంలో చాలా కీలకమైనది. ప్రజల హక్కుల కోసం, వారి సమస్యలను పరిష్కరించేందుకు, వారి ఎదుగుదలకు మార్గం చూపేందుకు రంజిత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తూ ఎల్లపుడు ముందుంటాడు అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భీమ్ భరత్ తో పాటు నవాబుపేట్ మండల అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య, బీసీ సెల్ అధ్యక్షులు జూలకంటి శ్రీధర్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయం డాక్టర్ శ్రీధర్

▸▸డాక్టర్ గోపీనాథ్ ఎండి జనరల్ ఫిజీషియన్

**చర్ల, నేటిధాత్రి:**



ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా గురువారం కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేకమైన ఆరోగ్య శిబిరం నిర్వహించారు ఈ శిబిరంలో డాక్టర్ గోపీనాథ్ ఎండి జనరల్ పిజిషన్ చే వైద్య సేవలు అందించడం జరిగింది ఈ వైద్య శిబిరంలో చర్ల మండలంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి వైద్య సేవలు ఉపయోగించుకున్నారు డాక్టర్ గోపీనాథ్ ఎండి జనరల్ ఫిజీషియన్ మహిళల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వివిధ రకాల వ్యాధులకు మందులు అందించడం జరిగినది అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేయడం జరిగినది ఈ వైద్య శిబిరం కొయ్యూరు ప్రాథమిక వైద్యశాలలో ఏర్పాటు చేయడం వలన ప్రజలు సంతోషంగా వ్యక్తం చేశారు ఈ శిబిరం లో 153 మంది వైద్యసేవలు పొందారు డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం చాలా అద్భుతమైన కార్యక్రమం అని అన్నారు ఈ కార్యక్రమంలో నిర్వహించబడే ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరాలు అందరు ఉపయోగించుకోగలరని తెలియజేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ హారిక మెడికల్ ఆఫీసర్ చర్ల వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# పత్తి అమ్మకం పట్ల పరిమితులు విధించటం అన్యాయం

▸▸రైతాంగ సమస్యలపై ఈనెల 25న జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు

▸▸ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్

**నర్సంపేట, నేటిధాత్రి:**




రైతులు పత్తిని అమ్మే సందర్భంలో సాధ్యంకానీ కండిషన్లు పెట్టి పరిమితులు విధించడం అన్యాయమని రైతువద్ద నుండి పత్తిని భేశరతుగా మద్దతుధరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్,రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వల్లేపు ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు వస్కుల మట్టయ్య అధ్యక్షతన నర్సంపేట పట్టణంలోని ఓంకార్ భవన్ లో జరిగింది.ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలపై ఈ సమావేశంలో చర్చించారు. పెద్దారపు రమేష్,వల్లెపు ఉపేందర్ రెడ్డిలు మాట్లాడుతూ యూరియాపై కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎత్తివేసి కుట్రలో భాగంగానే కొరత సృష్టించి రైతులకు తీరనినష్టాన్ని చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం సైతం ముందస్తు వ్యవసాయ ప్రణాళిక వేయకుండా యూరియా నిల్వలు చేపట్టకుండా రైతుల నష్టానికి కారణం అయిందన్నారు.మరోవైపు రైతుల అష్ట కష్టాలతో పత్తి పంట పండిస్తే అమ్ముకునే దశలో సిసిఐ మరియు ప్రభుత్వం కలిసి ఫార్మర్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ లాంటి అనేక ఆంక్షలు విధించడం విడ్డూరంగా ఉందన్నారు.ప్రకృతి వైపరీత్యాలు యూరియా కొరతలతో దిగుబడి తగ్గి రైతులు అప్పుల ఆందోళనలో ఉంటే ఇలాంటి ఆంక్షలతో పాటు కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతి పై 11 శాతం సుంకాలను ఎత్తివేసి విదేశీ పెట్టుబడిదారులకు ఊడిగం చేయడం దేశీయ రైతులను దివాలా తీయించి వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలకు పాల్పడుతుందన్నారని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం 22 లక్షల మంది కౌలు రైతులను గుర్తిస్తామని ప్రభుత్వ పథకాలు వర్తింప చేస్తామని హామీ ఇచ్చి నేటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు.ఇప్పటికైనా తక్షణమే కౌలు రైతులను గుర్తించి ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, రాష్ట్ర నాయకులు వి తుకారా నాయక్, ఎండి ఇస్మాయిల్, నాగెల్లి కొమురయ్య, సింగతి మల్లికార్జున్, వక్కల కిషన్, మారయ్య, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

# పాత్ ఫైండర్ ఐనవోలు విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

**అయినవోలు, నేటిధాత్రి:**



స్థానిక పాఠశాల పాత్ ఫైండర్ హై స్కూల్ -ఐనవోలు లో 9 వ తరగతి చదువుతున్న విద్యార్థి గుంపుల అశ్వతేజ్ రెడ్డి ఇటీవల గ్రామం కూనూరు మండలం జఫర్గఢ్ జిల్లా జనగాంలో నిర్వహించిన 44 వ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలలో అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ విజయానికి కృషి చేసిన శిక్షకులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. రాబోయే జాతీయ స్థాయి పోటీలలో కూడా విజయం సాధించి రాష్ట్రానికి, పాఠశాలకు మంచి పేరు తెచ్చిపెట్టాలని డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వర్ రావు మరియు ప్రిన్సిపాల్ సుభానుద్దీన్ లు ఆకాంక్షించారు. రాష్ట్ర బాల్ బాడ్మింటన్ జాతీయ స్థాయిలో ఎంపిక అయినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ ప్రకటించారు. రాష్ట్ర స్థాయి కి ఎంపికైనందున జనగామ జిల్లా బాల్ బాడ్మింటన్ అధ్యక్షులు గాదెపాక అయోధ్య , ప్రధాన కార్యదర్శి నిరటీ ప్రభాకర్, కోశాధికారి కాటం రాజిరెడ్డి, కోచ్ ముచ్చ సుధాకర్ రెడ్డి అభినందించారు.

# 21 తేదీన మనకు సూర్యగ్రహణము లేదు



**జహీరాబాద్, నేటిధాత్రి:**

ఈ గ్రహణం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అంటార్కిటికా, దక్షిణ పసిఫిక్ మహాసముద్రం, అట్లాంటిక్స్ ము మహాసముద్రంలోని ప్రాంతాలలో కనిపిస్తుంది. ఈ పాక్షిక సూర్యగ్రహణం భారతీయ కాలమానం ప్రకారం సెప్టెంబర్ 21 రాత్రి 10:59 గంటలకు ంటలకు ప్రారంభమై, సెప్టె సెప్టెంబర్ 22 తెల్లవారుజామున ల్లవారుజామున 3:23 గంటలకు ముగుస్తుంది.కాబట్టి మనదేశము లో ఈ గ్రహణ ప్రభావము స్త్రీ లేదు కాబ కాబట్టి మనము ఎలాంటి నియమాలు, పరిహారములు పాటించే అవసరము లేదు .

# సైబర్ క్రైమ్ పై అవగాహన పెంచాలి..

▸▸కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు జరపాలి.

▸▸అనుమానిత వాహనాలపై నిఘా పెంచాలి.

▸▸వ్యక్తిగత సమస్యలు ఉంటే.. నేరుగా తెలపండి!

▸▸జిల్లా ఎస్పీ. శ్రీనివాసరావు



**నిజాంపేట, నేటిధాత్రి:**

ఆధునిక పరిజ్ఞానం పెరిగిన కొలది సైబర్ నేరగాళ్ళు ప్రజలను మభ్యపెట్టి, మాయ చేసి మోసం చేస్తున్నారని సైబర్ నేరాల పై గ్రామాల్లో అవగాహన పెంచాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలో గల స్థానిక పోలీస్ స్టేషన్ ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా స్టేషన్ లో రికార్డు అవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ చుట్టూ పరిసరాల, పరిశుభ్రతను ఆయన పరిశీలించారు. కేసులలో నాణ్యమైన దర్యాప్తు జరపాలని, స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తు ఆన్లైన్లో నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సైబర్ నేరాల నివారణకు పాఠశాలలు, కళాశాలలో, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 100 కాల్ కు తక్షణమే స్పందించాలనీ సూచించడం జరిగిందన్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా అనుమానిత వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. పోలీస్ సిబ్బందికి ఏమైనా వ్యక్తిగత సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట సీఐ వెంకట్ రాజాగౌడ్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్సై రాజేష్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# యువత చేతిలో దేశ భవిష్యత్తు



**మెట్పల్లి, నేటిధాత్రి:**

మెట్పల్లి పట్టణంలోని ఐక్యుమైండ్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దేశ ప్రధాని నరేంద్రమోడీ జన్మదిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డా: రఘు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నరేంద్ర మోడీ చాయ్ వాలా నుండి దేశప్రధాని గా ఎదిగిన తీరు యువత అందరికి ఆదర్శం అని భారతదేశాన్నీ ప్రపంచ పటంలో సమున్నతంగా తీర్చిదిద్దే మన ప్రియతమ ప్రధాని మోడీ స్ఫూర్తితో యువత అందరూ గొప్ప లక్ష్యాలు ఏర్పరచుకొని వాటిని చేరుకోవాలని కోరారు, నైపుణ్య శిక్షణతో ముందుకు సాగాలని, యువత,విద్యార్థుల విషయంలో పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ కూడా ఎల్లపుడు ముందు వుంటారు అని అందుకు నిదర్శనమే నవోదయ,కేంద్రీయ విద్యాలయాలు అని కొనియాడారు, అనంతరం విద్యార్థులకు గౌరవ ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్ పుస్తకాలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యుమైండ్స్ సీఈవో యాసీన్,మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి బిస్మిల్లా యాసిన్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# భూమి నష్టపరిహారం 50 లక్షలు ఇవ్వాలి



▸▸గ్రిడ్ కార్పొరేషన్ కరెంట్ పోల్

**జహీరాబాద్, నేటిధాత్రి:**

భూసేకరణ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ కరెంట్ పోల్ యొక్క భూమి పంట నష్ట పోవడంవల్ల మాకు నష్ట పరిహారం కలుగుతుందని ఝరాసంగం మండల బోరేగావ్ గ్రామానికి చెందిన రైతులు తాసిల్దార్ తిరుమల రావు కు మండలం లోని నిమ్స్ కారణంగా భూమి ఎకరం విలువ 3 కోట్ల వరకు (300000000) పైగా పలుకుంది కాబట్టి బోరేగావ్ గ్రామ రైతులు యొక్కరైతులకు ఒక్క టవర్ కు గాను (5000000) యాభై లక్షలవరకు నష్ట పరిహారం ఇవ్వాలని మండల రైతులందరూ కలిసి తాసిల్దార్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

**కథలాపూర్, నేటిధాత్రి:**

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గారి జన్మదినోత్సవం సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వహించారు,ముప్పై మంది రక్తదానం చేశారు రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ప్రశంస పత్రాలు యూత్ కాంగ్రెస్ నాయకులు అందజేశారు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు నిర్వాహకులు వంశీ కాశవత్రి, ఎం డి రెహాన్, అంబటి రాధాకృష్ణ, మధుసూదన్ రెడ్డి, మహేష్ కుంభం



ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ నాగరాజు, అజీమ్, తోట్ల అంజయ్య, పుంద్ర నారాయణ రెడ్డి, పులి హరిప్రసాద్,చెదలు సత్యనారాయణ,దేవ్ యాదవ్,ముద్దం శేఖర్, పాల నవీన్ తదితరులు పాల్గొన్నారు

## ఓ జంటకు అండగా నిలిచిన మానవ హక్కుల సంఘం జోక్యం

**జహీరాబాద్, నేటిధాత్రి:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో, కుటుంబ సమస్యలతో బాధపడుతున్న ఓ జంటకు మానవ హక్కుల సంఘం అండగా నిలిచింది. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపల్లి హుస్సేన్ ఆదేశాల మేరకు, డివిజన్ అధ్యక్షుడు కొల్లూరు నగేష్, మహిళా ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ అంజమ్మ ఆధ్వర్యంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. బాధితులు మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించగా, స్థానిక ఎస్ఐ, సీఐలతో మాట్లాడి,




భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంజమ్మ, నగేష్, కవిత, తుల్జామా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.జి.వి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్టూడెంట్ కౌన్సిల్ ఎలక్షన్



**జైపూర్, నేటిధాత్రి:**

మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్.జి.వి పాఠశాలలో విద్యార్థులకు కౌన్సిల్ ఎలక్షన్ గురువారం నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ చల్లా సుధాకర్ రెడ్డి తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చెన్నూరు ఎంఈఓ ఎం.దత్త కుమార్,మంచిర్యాల జిల్లా ట్రస్మ జనరల్ సెక్రెటరీ సమీర్ ఆధ్వర్యంలో కౌన్సిల్ ఎలక్షన్ ఏర్పాటు చేసి లీడర్షిప్ క్వాలిటీస్ పెంపొందించడానికి పాఠశాల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే వివిధ క్యాటగిరీస్లో పాఠశాల లీడర్స్,స్పోర్ట్స్ లీడర్స్,డిస్పేన్ లీడర్స్ ను విద్యార్థులతో ఎలక్షన్ నిర్వహించి అన్నారు ఎన్నుకున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎంఈఓ దత్త కుమార్, మంచిర్యాల జిల్లా ట్రస్మ జనరల్ సెక్రటరీ సమీర్, చెన్నూర్ సిఆర్పి ప్రవీణ్, చాణక్య కరస్పాండెంట్ సుదర్శన్ రెడ్డి,ఎస్.జి.వి కరస్పాండెంట్ చల్ల సుధాకర్ రెడ్డి,ప్రిన్సిపాల్ ఏ.రమేష్, చేకూర్తి మధుకర్,ఉపాధ్యాయ బృందం,పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నియాత్రణే లక్ష్యంగా సైబర్ వారియర్లు పని చేయాలి.

- జిల్లాలో సైబర్ కేసులలో ప్రతిభ కనబర్చిన సైబర్ వారియర్లకు ప్రోత్సాహకాలు, ప్రశంస పత్రాలు అందజేత.
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్..

**సిరిసిల్లటౌన్. నేటిధాత్రి:**

సిరిసిల్ల జిల్లాలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, మోసపూరిత ఆన్‌లైన్ కార్యకలాపాలను అరికట్టడం, తక్షణ చర్యల ద్వారా బాధితులకు న్యాయం చేయడం వంటి అంశాల్లో కృషి చేసినసైబర్ సెల్ ఆర్.ఎస్.ఐ జునైద్, శ్రీకాంత్ డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్,రాజశేఖర్ వేములవాడ రూరల్, వెంకటరమణ సిరిసిల్ల టౌన్ , లకు ప్రశంశ పత్రాలు, ప్రోత్సాహకాలు అందించిన జిల్లా ఎస్పీ.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.... సైబర్ క్రైమ్ దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అత్యంత కీలకమని,భవిష్యత్‌లో మరింత నైపుణ్యంతో కేసులు పరిష్కరించేలా సైబర్ వారియర్లను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన



సేవలు అందించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్లో నియమించబడ్డ సైబర్ వారియర్స్ సైబర్ నేరాలపై వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి కేసులు నమోదు చేయాలని, సైబర్ నేరగాళ్ల ద్వారా మోసపోయిన వ్యక్తులు డబ్బు బ్యాంకులో ఫ్రీజ్ అయి ఉన్నట్లయితే వీలైనంత త్వరగా డబ్బులు తిరిగి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.అనుకోని రీతిలో ఎవరైనా సైబర్ నేరానికి గురైతే ఖంగారు పడకుండా వెంటనే 1930 ఫోన్ నెంబర్ కు,ఎన్ సిఆర్ పి పోర్టల్ గాని,దగ్గర్లోని పోలీస్ స్టేషన్లో ఉన్న సైబర్ వారియర్ ని సంప్రదించాలని ఎస్పీ తెలిపారు.ఎస్పీ వెంట సైబర్ సెల్ ఆర్.ఎస్.ఐ జునైద్ సిబ్బంది ఉన్నారు.

## క్రీడలు మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనాలు

**కేసముద్రం, నేటిధాత్రి:**

క్రీడలు మనిషి జీవితంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. విద్యతో పాటు క్రీడలు కూడా సమాన ప్రాముఖ్యత కలిగినవే. క్రమశిక్షణ, కృషి పట్టుదలతో ముందుకు సాగినప్పుడు.. భవిష్యత్తులో ఏ రంగంలోనైనా రాణించవచ్చు. అని తెలిపారు.గురువారం సెయింట్ జాన్స్ హై స్కూల్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన 69 వ ఎస్ జి ఎఫ్ ఐ క్రీడలను ప్రారంభిస్తూ ,ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు.. బండారు నరేందర్, జి. రాజశేఖర్, ఫాదర్ శ్రావణ్ రెడ్డి. అన్నారు. అదేవిధంగా క్రీడలు మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనాలని పేర్కొన్నారు.



అందువల్ల ప్రతి విద్యార్థి క్రీడలను జీవితంలో భాగంగా స్వీకరించాలి. క్రీడలు కేవలం వినోదం కాదు భవిష్యత్తు విజయానికి దారి తీసే మార్గం అని కొనియాడారు. కాగా మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 400,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్ కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్, డి విజయ్ చందర్, పద్మ, రవి, లలిత, స్రవంతి,మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## నగదు రహిత హెల్త్ కార్డులు మంజూరు చేయాలి

- ఉపాధ్యాయుల ఆరోగ్యం, సంక్షేమమే విద్యా రంగ అభివృద్ధికి బలమైన పునాది
- తమ వంతు వాటా చెల్లించడానికి ఉపాధ్యాయులు సిద్ధం
- ఇప్పుడున్న హెల్త్ కార్డులతో సరైన వైద్యం అందక సతమతమౌతున్న ఉపాధ్యాయులు
- ప్రభుత్వంలో భాగమైన ఉపాధ్యాయుల ఆరోగ్య బాధ్యత, భద్రత ప్రభుత్వానిదే
- తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ ఉద్ఘాటన

**కేసముద్రం, నేటిదాత్రి:**

నాణ్యమైన నగదు రహిత వైద్యం అందక, ఆపత్కాల సమయంలో డబ్బులు అందక ఉపాధ్యాయులు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని, కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇంకా జాప్యం చేయకుండా నాణ్యమైన నగదు రహిత వైద్యం అందించేలాగా సమగ్ర హెల్త్ కార్డులను అందించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సమగ్ర హెల్త్ కార్డుల జారీలో జాప్యం సరికాదని టిపిటిఎఫ్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ నేతృత్వంలో కేసముద్రం విలేజ్ ప్రాథమిక పాఠశాలలో, ప్రధాన కార్యదర్శి నరసింహ రాజు నేతృత్వంలో అర్పణపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సురేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆరోగ్యంగా ఉంటేనే తమ విద్యార్థులకు సమర్థవంతంగా విద్యను అందిస్తారని, అకుంఠిత దీక్షతో పని చేస్తారని తద్వారా మాత్రమే ఆశించిన ఫలితాలు వస్తాయని అన్నారు. ఉపాధ్యాయుల ఆరోగ్యం, సంక్షేమమే విద్యా రంగ అభివృద్ధికి బలమైన పునాది అని అయన ఉద్ఘాటించారు. ప్రభుత్వంలో భాగమైన ఉపాధ్యాయులకే నాణ్యమైన వైద్యం నగదురహితంగా అందకపోతే ఎలా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఉపాధ్యాయుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సరికాదని విమర్శించారు. ఒకవేళ ప్రభుత్వం కోరిన పక్షంలో తమ వంతు వాటాగా బేసిక్ పే లో 2% అయినా చెల్లించడానికి ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ఉపాధ్యాయులు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఆసుపత్రిలో చేరి తీసుకెళ్లిన డబ్బులు సరిపోక ఇబ్బందులు పడుతున్న సందర్భంలో ఉపాధ్యాయులే చందాలు వేసుకుని బాధితులకు అందించిన దయనీయ సందర్భాలు చాలా ఉన్నాయనే విషయాన్ని ఈ






సందర్భంగా గుర్తు చేశారు.కావున నాణ్యమైన వైద్య సేవలను నగదు రహితంగా అందించడం అత్యవసరమనే విషయాన్ని గుర్తించాలని, ఇంకా మీనమేషాలు లెక్కిస్తూ జాప్యం చేయరాదని ప్రభుత్వానికి సూచించారు.ఉపాధ్యాయులకు సులభంగా ఉపయోగపడే విధంగా ఆధునిక సౌకర్యాలతో హెల్త్ కార్డులు అందించడంతోపాటు అన్ని గుర్తింపు పొందిన కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఈ నాణ్యమైన వైద్య సదుపాయం కల్పించాలని కూడా కోరారు.ఈ కార్యక్రమంలో మండల శాఖ కార్యదర్శి ఊట్కూరి ప్రణయ్ కుమార్, అప్పాల నాగరాజు, ఉపాధ్యాయులు వెలమాల భాస్కర్, ఏ రమాదేవి, భూక్య శ్రీను, బిజయ్, సురేష్ కుమార్ లు పాల్గొన్నారు.

## ప్రజాభవన్ లో చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తూడి



**వనపర్తి , నేటిధాత్రి:**

వనపర్తి పట్టణంలో ప్రజాభవవ్ లో వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సిఎంఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు 10 లక్షల ఆరోగ్య భీమా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం 200 యూనిట్ల ఉచిత కరెంటు రెండు లక్షల రుణమాఫీ రైతు భరోసా 500 కే గ్యాస్ ప్రతి పేద కుటుంబానికి సన్నబియ్యం ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు తెలంగాణ ప్రజలు టిఆర్ఎస్ పార్టీని కర్రు కాల్చి వాత పెట్టారని చెప్పారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినాయకత్వంలో అభివృద్ధి చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు చెక్కుల పంపిణీ లో లబ్ధి దారులువనపర్తి పట్టణంపెబ్బేరు, శ్రీరంగాపురం,గోపాల్పేట, రేవల్లి ఏదుల, ఖిల్లా ఘనపూర్,పెద్దమందడి మండ లాల వారు పాల్గొన్నారని టిపిసిసి అసెంబ్లీ సోషల్ మీడియా కోర్డినేటర్ డి వెంకటేష్ ఒక ప్రకటన లో తెలిపారు వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ బి శ్రీనివాస్ గౌడ్ పిసిసిడెలి గేట్ తైలం శంకర్ ప్రసాద్ ఎస్ ఎల్ ఎన్ రమేష్ 1వ వార్డు చుక్కరాజు జగత్ పల్లి గట్టు ,పెబ్బేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వైస్ చైర్మన్ లు, జిల్లా గ్రంథాలయాల అధ్యక్షులు పిసిసి సభ్యులు వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చౌదర్ మండల కాంగ్రెస్ పార్టీ నేతలు మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండోఅధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, ఎస్సి ఎస్టీ బిసి మైనార్టీ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు, సోషల్ మీడియా మహిళా సంఘం సభ్యురాలు ఎన్ఎస్‌యూఐ, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## గీతాంజలి పాఠశాలలో.. ఘనంగా బతుకమ్మ సంబరాలు

**బాలానగర్, నేటిధాత్రి:**

బాలానగర్ మండల కేంద్రంలోని గీతాంజలి పాఠశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. చిన్నారులు రంగురంగుల పూలతో బతుకమ్మను తయారుచేసి బతుకమ్మ పాటలకు దృశ్యాలు చేశారు. చిన్నారిలను నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీశైలం మాట్లాడుతూ.. తెలంగాణ పండుగలలో బతుకమ్మ పండుగ ప్రత్యేకమైనదని తొమ్మిది రోజులపాటు గ్రామీణ మహిళలు రకరకాల పూలతో బతుకమ్మని పేర్చి.. ఆటపాటలతో,



కోలాటాలతో నృత్యాలు చేస్తూ.. బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తారన్నారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలలో బతుకమ్మ పండుగ ప్రత్యేకమైనదన్నారు.

## మోడీ జన్మదినం మోగిలిపేటలో ఘనంగా నిర్వహణ

**మల్లాపూర్, నేటిధాత్రి:**

మన భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సంబరాలు మోగిలిపేట్ గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగాయి గ్రామబీజేపీ అధ్యక్షుడు శివరాత్రి వెంకటేష్ ఉపాధ్యక్షుడు మోరపాక ధర్మరాజు ఆధ్వర్యంలో గ్రామ ప్రధాన వీధుల గుండా ద్విచక్ర వాహనాల భారీ ర్యాలీతో టపాసుల మోతలతో దద్దరిల్లింది నరేంద్ర మోడీ వీర అభిమాని అయిన సాంబారి సదానందం గ్రామ అధ్యక్షుల సమక్షంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు ఇట్టి కార్యక్రమంలో గ్రామ బిజెపి క్రియాశీలక సభ్యులు



కార్యకర్తలు మహిళలు నరేంద్ర మోడీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## 7వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె



**గుండాల, నేటిధాత్రి:**

గుండాల మండల కేంద్రం లోతమ న్యాయమైన హక్కుల కోసం గత 7 రోజులుగా జరుగుతున్న సమ్మె స్పందించని రాష్ట్ర ప్రభుత్వం సమ్మె మరింత ఉధృతం చేస్తామని జేఏసీ, సీఐటీయూ అల్టిమేటం ఇల్లందు లోని అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ నిరవదిక సమ్మె లో ఉన్నాయి. సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా నేత మండల కన్వీనర్ వజ్జ సుశీల నాయకులు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ డైలీ వేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ తో వెట్టి చాకిరీ చేయిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమం లో ఆశా యూనియన్ సీఐటీయూ నేత పార్వతి, కోటైం బాలయ్య, హాస్టల్ డైలివేజ్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## సత్వార్ గ్రామనికి నూతన జిపిఓ నాగరాజు

- ఘనంగా సన్మానం బైండ్ల నర్సిములు కాంగ్రెస్ నాయకులు



**జహీరాబాద్ , నేటిధాత్రి:**

జహీరాబాద్ నియోజకవర్గం లోని జహీరాబాద్ మండలంలోని సత్వార్ గ్రామానికి చెందిన బైండ్ల నర్సిములు కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతనంగా వచ్చిన జిపిఓ నాగరాజు తన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి సంగమేష్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాలుగోన్నారు,


## కేజీబీపీ విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



**భూపాలపల్లి , నేటిధాత్రి:**

భూపాలపల్లి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొగుళ్లపల్లి మండలంలోని జడ్పీ హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలలో సబ్ జూనియర్ కబడ్డీ సెలక్షన్ లో టేకుమట్ల మండలంలోని.. కేజీబీవీ పాఠశాలకు చెందిన శ్వేత, సరిత సాత్విక సబ్ జూనియర్స్ లో రాష్ట్ర స్థాయి కి ఎంపిక అయ్యారు రాష్ట్ర స్థాయి కి ఎంపిక అయిన విద్యార్థినిలను.. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న, పిఈటి అనిత ఉపాధ్యాయులు పుష్ప గుచ్చం ఇచ్చి.. అభినందనలు తెలిపారు.

## పాఠశాల విద్యార్థులకు కుర్చీలు, టేబుల్స్ అందజేత



**తాండూర్, నేటిధాత్రి:**

మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎం.పి.పి.ఎస్ పాఠశాలలో గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ మిత్రుడైన శశాంక్ శర్మ మంచి మనసుతో పాఠశాలకు 10 కుర్చీలు,2 టేబుల్స్ అందించారు.వారికి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



జహీరాబాద్, నేటిధాత్రి:
సెప్టెంబర్ 19 శుక్రవారం ఉదయం రవింద్ర భారతిలో నిర్వహించ తలపెట్టిన దళిత జర్నలిస్ట్ ఫోరం 10వ రాష్ట్ర మహాసభల పోస్టర్ను గురువారం మధ్యాహ్నం సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ పట్టణంలో టిజీ ఎస్సీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వై. నరోత్తం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిజెఎఫ్ జహీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ బంటు పురుషోత్తమ రావు, కోకన్వీనర్ నవిన్ కుమార్, కోశాధికారి అశోక్ కుమార్, డిజెఎఫ్ సభ్యులు శ్రీనివాస్, మహేష్, రవి, చందు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి విద్యార్థి లక్ష్యం కోసం పట్టుదలతో చదవాలి

●హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

●బాలికల గురుకుల కళాశాల,గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

పరకాల, నేటిధాత్రి:
ప్రతి విద్యార్థి తాము ఎంచుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో చదివి సాధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో తరగతి గదులు, కిచెన్, డార్మేట్రి,పరిసరాల ను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. కలెక్టర్ విద్యార్థినులను పాఠ్యాంశాలకు సంబంధించి తరగతి గదిలోని బోర్డు పై రాయించారు.విద్యార్థినులకు వండిన భోజన పదార్థాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థినులచేత పాఠ్యాంశాలను చదివించారు. ఆయా తరగతుల విద్యార్థినులతో మీ జీవిత లక్ష్యంఏంటి, ఏంసాధిం చాలనుకుంటున్నారని అడగగా డాక్టర్,ఇంజినీర్స్ అవుతామని సమాధానమిచ్చా



రు.దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఎంచుకున్న లక్ష్య సాధనకు మరింత కష్టపడాలని కలెక్టర్ సూచించారు.పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేస్తామన్నారు. విద్యార్థినుల అభ్యసన,పఠన సామర్థ్యం తక్కువగా ఉందని, అభ్యసన సామర్థ్యం పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.అదేవిధంగా పరకాలలో ఉన్న గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు.అక్కడ ఉన్న వసతులు,విద్యార్థుల సంఖ్య ను కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా ఆర్డీవో డాక్టర్ నారాయణ,తహసీల్దార్ విజయలక్ష్మి,ఎంపీడీవో ఆంజనేయులు,ప్రిన్సిపల్, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

## ఇ రి గేషన్ చీఫ్ ఇంగినీర్ ను సన్మానము చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

వనపర్తి నేటిధాత్రి:
ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ నాగేంద్రం బదిలీ పై వనపర్తి లో భాద్యతలు తీసుకున్న సందర్భంగా మర్యాదపూర్వకంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ శాలువాతో సన్మానం చేశారు ఈసందర్భంగా చీఫ్ ఇంజానీర్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు ఈకార్యక్రమంలో, వనపర్తి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో కోఆర్డినేటర్ గడ్డం



వినోద్ యాదవ్ శ్రీరంగాపూర్ మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారని రాజేంద్రప్రసాద్ తెలిపారు

## నాగల్ గిద్దలో వీధి దీపాలు లేక ప్రజల ఇక్కట్లు: కేవీపీఎస్ వినతి

జహీరాబాద్ నేటిధాత్రి:
సంగారెడ్డి జిల్లా నాగల్ గిద్ద మండల కేంద్రంలో వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దసరా పండుగ సమయంలో బంధువులు వస్తారని, వీధి దీపాలు లేకపోతే ఇబ్బందులు తప్పవని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గణపతి అన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామ పంచాయతీ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ లో ఉన్న జీతాలు



విడుదల చేయాలని ఆయన ఎంపీడీవోకు వినతిపత్రం ద్వారా కోరారు.

## దసరా ప్రయాణికులకు శుభవార్త

### 7,754 స్పెషల్ బస్సులను నడపనున్న ఆర్టీసీ



**హైదరాబాద్, నేటిధాత్రి:**
దసరా, బతుకమ్మ పండుగల సీజన్ సమీపిస్తుండటంతో, సొంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సర్వీసులను నడపాలని నిర్ణయించింది. ప్రజల ప్రయాణాన్ని సురక్షితంగా, సౌకర్యవంతంగా మార్చడమే లక్ష్యంగా ఆర్టీసీ ఈ చర్యలు చేపట్టింది. ఈ పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని సులభతరం చేయడానికి, టీ-జీఎస్ఆర్టీసీ సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 2 వరకు ఏకంగా 7,754 స్పెషల్ బస్సులను నడపనుంది. ఈ బస్సులలో, 377 సర్వీసులకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడింది. దీంతో ప్రయాణికులు ఇంటి నుంచే తమ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు, తద్వారా కౌంటర్ల వద్ద నిరీక్షణ తప్పించుకోవచ్చు. సెప్టెంబర్ 30 న సద్దుల బతుకమ్మ , దసరా రోజు రోజుల్లో సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య భారీగా ఉండే అవకాశం ఉంది. ఈ రద్దీని తట్టుకోవడానికి ప్రధాన బస్టాండ్ల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులోకి వస్తాయి. అలాగే, పండుగలు ముగిసిన తర్వాత తిరిగి నగరానికి వచ్చేవారి సౌకర్యార్థం అక్టోబర్ 5, 6 తేదీల్లో కూడా ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ ప్రత్యేక బస్సుల ద్వారా, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. అదనపు ఛార్జీలు లేకుండానే సాధారణ బస్సుల టికెట్ ధరలకే ఈ సేవలు లభ్యం అవుతాయి. దసరా పండుగను ఆనందంగా జరుపుకోవడానికి ఊరెళ్లే ప్రయాణికులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు. మరిన్ని వివరాల కోసం టీ-జీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా సమీపంలోని బస్టాండ్‌లో విచారించవచ్చు.




## వానాకాలం ధాన్యం కొనుగోలు లక్ష్యం

# 2.50 లక్షల మెట్రిక్ టన్నులు

●ధాన్యం కొనుగోళ్ళ కార్యాచరణ ...ప్రణాళికలు సిద్ధంచేయాలి

●జిల్లా వ్యాప్తంగా 260 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

●రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి

●వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ జిల్లా ప్రతినిధి, నేటిధాత్రి:
2025-2026 సంవత్సరం వరంగల్ జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోలు లక్ష్యం 2 లక్షల.50 వేల మెట్రిక్ టన్నులు అని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.వానాకాలం ధాన్యం కొనుగోళ్ళకు పటిష్ట కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం ధాన్యం కొనుగోలు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై వ్యవసాయ, పౌర సరఫరాలు, సహకార, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ, తూనికలు, కొలతల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 వానాకాలం ధాన్యం కొనుగోలుకు సన్నదం కావాలన్నారు.జిల్లావ్యాప్తంగా
ఈ సంవత్సరంలో 2 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, సుమారు 260 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడి క్లినర్లు, డ్రైయ్యర్ లు, త్రాగునీరు , టార్పాలిన్స్, గన్ని బ్యాగులు, తేమ సాంద్రత కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులు ఆయా మండలాల వారీగా ధాన్యం పండించిన రైతులు వివరాల నివేదిక అందించాలని ఆదేశించారు.ఈ సీజన్లో ఏ గ్రేడ్ రకం క్వింటాలు ధాన్యానికి రూ.2389, కామన్ రకానికి రూ.2369 ప్రభుత్వం ధర నిర్ణయించిందని సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహకం ఇస్తున్నందున అన్ని కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం గుర్తింపు కోసం గ్రెయిన్ కాలిఫర్స్(డయల్ మైక్రోమీటర్) అందుబాటులో ఉంచాలన్నారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం గుర్తింపులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.వ్యవసాయ అధికారుల నివేదిక ఆదారంగా కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని కలెక్టర్ సూచించారు. ఎలక్ట్రానిక్ కాంటాలు ఉపయోగించాలని, ధాన్యం తూకం విషయంలో అవకతవకలు జరగకుండా చూడాలని తూనికలు, కొలతల శాఖ అధికారి తనిఖీలు నిర్వహించి సీల్స్ పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో పండించిన ధాన్యం మిల్లింగ్ చేసేందుకు మిల్లులను ట్యాగింగ్ చేయాలని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు రవాణా చేసేందుకు సౌకర్యం కల్పించాలని రవాణాశాఖ అధికారులకు సూచించారు.
అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా ధాన్యం నిలువ చేయడానికి అనుకూల స్థలాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఎంచుకోవాలని సూచించారు.
ధాన్యం రవాణా, ట్రాక్ షీట్ విషయంలో తగుజాగ్రత్తలు వహించాలని, రైతులు దళారులను నమ్మి మోసపోకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయాలు చేసే విధంగా తగు సూచనలతో కూడిన కరపత్రాలను, ఫ్లెక్సీలను , గ్రామాలలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమాలకు, తక్కువ ధరకు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
కొనుగోలు కేంద్రాలలో సన్నరకం ధాన్యం, దొడ్డురకం ధాన్యం రాసులను వేరు వేరుగా నిల్వ చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్ చార్జులకు కొనుగోలు ప్రక్రియపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి,సివిల్ సప్లై డిఎం సంధ్యారాణి,జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య,డిఎం సురేఖా, డిఆర్డీఓ రామిరెడ్డి,డిసిఓ నీరజ, డిఎఓ అనురాధ, జిల్లా రవాణా అధికారి శోభన్, జిల్లా తునికల కొలతల అధికారి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, రవాణా గుత్తేదారులు, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

## డిపి స్కూళ్లో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి

### నిర్లక్ష్యంగా వ్యవహరించిన నాచారం సిఐపై బదిలీవేటు

హైదరాబాద్, నేటిధాత్రి:
దిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థిపై దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై నాచారం సీఐపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. పుట్టిన రోజున.. బర్త్‌డే బంప్స్ పేరిట తోటి విద్యార్థులు చేసిన వికృత చేష్టలతో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తపేటకు చెందిన విద్యార్థి(14) నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆగస్టు 29న పుట్టినరోజు కావడంతో.. తోటి విద్యార్థులు మధ్యాహ్నం విరామ సమయంలో సరదాగా చేసిన చేష్టలతో ఆ విద్యార్థి మర్మంగానికి గాయమై రక్తస్రావమైంది. పిడిగుద్దుల ధాటికి రక్తం కారుతున్నా.. తోటి విద్యార్థులు వదల్లేదు. విషయం తెలిసి ప్రిన్సిపల్ ఆ విద్యార్థిని ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం బంజారాహిల్స్‌లోని ఆసుపత్రికి తరలించారు. విద్యార్థికి శస్త్ర చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనపై కుటు-ంబ సభ్యులు ఫిర్యాదు చేసినప్పటికీ బాధ్యులైన విద్యార్థులు, పాఠశాల యాజమాన్యంపై కేసు




నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నాచారం సీఐని బదిలీ చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

## యూరియా వైఫల్యం కేంద్రానిది

ప్రభుత్వంపై బురదజల్లుతున్న బీఆర్ఎస్

మండిపడ్డట్ట మంత్రి సీతక్క



**ఖమ్మం, నేటిధాత్రి:**
ప్రజల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా, వైరా మున్సిపాలిటీలో పర్యటించిన మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ విమర్శలు చేసి బదనాం చేస్తోందని ఆరోపించారు. యూరియా సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, రైతులను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ నిందలు వేస్తోందని ఆమె అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందని విమర్శించిన మంత్రి సీతక్క, తాము భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను, మహిళలకు వివిధ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరిన ఆమె, స్థానిక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు.

## శ్రీశైలం మల్లన్న ఆలయ చైర్మన్‌గా రమేష్ నాయుడు



**అమరావతి, నేటిధాత్రి:**
రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలకు ఛైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలం మల్లన్న ఆలయ ఛైర్మన్‌గా రమేష్ నాయుడు, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా వెంకట్రాజు, కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఛైర్మన్‌గా సురేంద్రబాబు, శ్రీకాళహస్తి ఆలయ ఛైర్మన్‌గా కొట్టె సాయిప్రసాద్, విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా రాధాకృష్ణ నియమితులయ్యారు.



## పజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

### కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్ చేరు, నేటిధాత్రి:
తిరుపతి పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాణిపాకం లో గల ప్రసిద్ధ శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానాన్ని గురువారం ఉదయం పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. వరసిద్ధి వినాయక స్వామి ఆశీస్సులతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే జిఎంఆర్ తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు.

## శరీర దారుఢ్యం, మానసిక వికాసం కోసం క్రీడలు అవసరం

●వర్ధన్నపేట జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన.ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య

●తల్లిదండ్రులు పిల్లలను చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించాలి : నరుకుడు వెంకటయ్య



వర్ధన్నపేట , నేటిధాత్రి:
మండలం, ఉప్పరపల్లి జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రాంగణంలో వర్ధన్నపేట, రాయపర్తి మరియు పర్వతగిరి మండలాలకు సంబంధించిన వర్ధన్నపేట జోనల్ క్రీడా పోటీలుగురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.ఈ క్రీడా పోటిలను వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.
వర్ధన్నపేట జోనల్ స్థాయి క్రీడా పోటీలలో భాగంగా ఖో-ఖో, వాలీబాల్ మరియు కబడ్డీ క్రీడలకు సంబంధించి అండర్ 17,14 క్రీడాకారులకు క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుంది.
క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ నరుకుడు వెంకటయ్య క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ...క్రీడల ప్రాముఖ్యతను, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాల్సిన అవసరాన్ని క్రీడాకారులకు తెలియజేశారు. అలాగే, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యత పెరగడంతో పాటు మానసిక వికాసం, వ్యక్తిత్వ వికాసం కలుగుతాయని అన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమేనని, క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలని క్రీడాకారులకు సూచించారు.శరీర దారుఢ్యం, మానసిక వికాసం కోసం క్రీడలు అవసరమని తెలిపారు.
బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి చూపడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం గురించి వివరించారు.విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చదువుతోపాటు క్రీడల్లో సైతం రాణించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తూ క్రీడలలో రాణించిన క్రీడాకారులను అనేక విధాలుగా ప్రోత్సహిస్తుందని తెలిపారు.
అంటే మన పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి జీవాంజి అనే ఒక మానసిక దివ్యాంగురాలు గత సంవత్సరం ప్యారిస్ లో జరిగిన పారా ఒలంపిక్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాణించినందుకుగాను మన స్థానిక శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు దీప్తి జీవాంజిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు తీసుకువెళ్లగా దీప్తి జీవాంజికి ప్రోత్సాహకంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున వరంగల్లో 300 గజాల ఇల్లు జాగా మరియు గ్రూప్ టు ఉద్యోగం క్యాష్ ప్రైజ్ మనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇప్పించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమములో నాతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం యాదవ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పోషాల వెంకన్నగౌడ్,కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపెల్లి యాదగిరి,ఉప్పరపెల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు దాడి రాజు లు పాల్గొన్నారు.



# దమ్ముంటే జూబ్లీహిల్స్‌లో గెలిచి చూపించు

## కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్

ఖమ్మం, నేటిధాత్రి:
నేటి పేదోడి ప్రభుత్వం సంక్షేమ పథకాలు తెస్తుంటే.. కొంతమంది విషం కక్కుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పాముకు కోరల్లో విషం ఉంటే, కొందరి నాయకులకు ఒళ్ళంతా విషం ఉంటుందని విమర్శించారు. ఎదులాపురం మున్సిపాలిటీ వరంగల్ క్రాస్ రోడ్డులో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వేదిక మీద నుంచి నాటి ప్రబుద్ధులను అడుగుతున్న.. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే మీకు కడుపు మంట ఎందుకని ఆయన ప్రశ్నించారు. పేదోడికి ఇల్లు కట్టించి ఉంటే మీకు ఈ పరిస్థితి ఉండేది కాదని హితవు పలికారు.

### బీఆర్ఎస్‌కు మరోసారి ప్రజలు బుద్ధి చెప్తారు..

బీఆర్ఎస్ నాయకులకు ప్రజలు రెండు పర్యాయాలు బుద్ధి చెప్పారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. వారి సోదరి, బిడ్డ సమస్యను సీఎం రేవంత్ రెడ్డికి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మూడున్నర సంవత్సరాల తర్వాత జరిగే ఎన్నికల గురించి ట్విట్టర్ టిల్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. 'మీ పార్టీ శాసన సభ్యులు ఆరోగ్యం బాగాలేక చనిపోయారు. దానికి 15 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. మీకు ఉన్న పరిజ్ఞానం, విజన్ గురించి నేను మాట్లాడను.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచి చూపించు' అని కేటీఆర్‌కు సవాల్ విసిరారు.

### నువ్వెంత బచ్చా గాడివి...

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్ మీద బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తామని మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. మూడున్నర సంవత్సరాల తర్వాత కేటీఆర్ ఇండియాలో ఉంటారో.. బ్యాగ్ సర్దుకుని విదేశాలకు వెళ్తారో చూడాలని ఎద్దేవా చేశారు. జూబ్లిహిల్స్ ఎన్నిక తర్వాత మీ పార్టీ స్థానం ఏంటో చూడు నాయన ట్విట్టర్ టిల్లు కేటీఆర్ అంటూ.. విమర్శించారు. మీ దయ దాక్షిణ్యాలతో ఎవరు బి ఫామ్ తీసుకోలేదని పేర్కొన్నారు. మీ నాయన మూడు సార్లు వచ్చి ముక్కు నేలకు రాసిన ఏమి చేయలేక పోయారని, నువ్వెంత బచ్చా గాడివి అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అంటే ఆషామాషీ పార్టీ కాదన్నారు. ఇచ్చిన మాట కోసం నిలబడి, నెరవేర్చే పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. ఈ పార్టీలో ఏ ఒక్కరు తప్పు చేయరని ఉద్ఘాటించారు. తల కిందులగా తపస్సు చేసిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్ని సీట్లు వచ్చాయో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అవే సీట్లు వస్తాయని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు.

### కేటీఆర్ కామెంట్స్..

తంతే.. గారెలబుట్టలో పడినట్టు లక్కీలాటరీలో మంత్రి అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మళ్లీ పాలేరులో ఎలా గెలుస్తారో చూద్దామని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణభవన్‌లో భద్రాచలం నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల భేటీలో పొంగులేటిపై కామెంట్స్ చేశారు. ఏడాది క్రితం పొంగులేటి ఇంటిపై జరిగిన ఈడీ దాడుల్లో దొరికిన డబ్బు గురించి కేంద్రంగానీ, ఆయనగానీ ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. 'పొంగులేటి బీజేపీతో కుమ్మక్కయ్యారా? బీజేపీతో కుమ్మక్కైన రేవంత్‌రెడ్డితో పొంగులేటి కలిసిపోయారా..?' అని నిలదీశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ మాటలకు ఇవాళ(గురువారం) మంత్రి పొంగులేటి బదులిచ్చారు.

# పాఠశాల విద్యార్థులకు కుర్చీలు,టేబుల్స్ అందజేత



తాండూర్,(మంచిర్యాల)నేటిధాత్రి:
మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎం.పి.పి.ఎస్ పాఠశాలలో గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ మిత్రుడైన శశాంక్ శర్మ మంచి మనసుతో పాఠశాలకు 10 కుర్చీలు,2 టేబుల్స్ అందించారు.వారికి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



# మంత్రి కొండా సురేఖను కలిసిన కాశీబుగ్గ దసరా ఉత్సవ సమితి

నేటిధాత్రి, వరంగల్ :
ఈరోజు కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు ధూపం సంపత్ ఆధ్వర్యంలో మంత్రివర్యులు కొండా సురేఖను కలిసి కాశిబుగ్గ దసరా ఉత్సవాలకు ఐదు డివిజన్ల ప్రజలు కాశీబుగ్గ దసరా ఉత్సవాలకు హాజరవుతారని గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా హాజరవుతారని ఉత్సవాలకు కావలసిన సదుపాయాలపై మున్సిపల్ సిబ్బందితో మైదానం క్లీనింగ్ చేయుట లైటింగ్, సౌండ్ సిస్టం, స్టేజ్, బారి గేట్స్, వాటర్ సప్లై, పోలీసు బందోబస్తు, కరెంటు సిబ్బంది, ఫైర్ సిబ్బంది, డి పి ఆర్ ఓతో పలు సంస్కృతి కార్యక్రమాలు దసరా ఉత్సవాలకు ఇలాంటి ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని మంత్రివర్యులకు మెమోరండం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గుల్లపల్లి రాజ్ కుమార్, కన్వీనర్ భయ్యా స్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, ఓని భాస్కర్,గోరంట్ల మనోహర్, క్యాతం రవీందర్, సిద్ధోజు శ్రీనివాస్, గణిపాక సుధాకర్, సిందం చంద్రశేఖర్, కాశీబుగ్గ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కిషన్ రెడ్డి చే "బెస్ట్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు" అందుకున్న

## వైబ్రెంట్ అకాడమీ డైరెక్టర్ రాజేందర్ రెడ్డిని సన్మానించిన టెన్త్ క్లాస్ మిత్ర బృందం

హనుమకొండ జిల్లా నేటిధాత్రి:
హనుమకొండ పట్టణంలో లెక్చరర్ గా రెండు దశాబ్దాల పాటు విద్యా బోధన చేసి అనేకమంది విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించి విద్యారంగంలో సుదీర్ఘ అనుభవం గల చిట్టేటి రాజేందర్ రెడ్డి, కార్పొరేట్ కాలేజీలకు దీటుగా హనుమకొండ పట్టణంలో రాజస్థాన్-కోటా వారి వైబ్రేంట్ అకాడమీ సంస్థను స్థాపించడం జరిగింది. ఈ కాలేజీలోని విద్యార్థులకు నాణ్యమైన మంచి విద్యను అందించడంతోపాటు, రుచికరమైన, పౌష్టిక ఆహారాన్ని అందిస్తూ స్థాపించిన అనతి కాలంలోనే అనేక మంది విద్యార్థులతో దక్షణ తెలంగాణలోనే ప్రముఖ విద్యా సంస్థగా పేరుగాంచింది. విద్యారంగంలో విశేష కృషి చేసినందుకుగాను రాజ్ న్యూస్ వారు రాజేందర్ రెడ్డిని గుర్తించి ఈ విద్యా సంవత్సరంలో" బెస్ట్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు" ప్రధానం చేయడం జరిగింది. రాజేందర్ రెడ్డి కి అవార్డు రావడం పట్ల తన చిన్ననాటి మిత్రులైన పదవ తరగతి 1994 -95 మిత్ర బృందం ఘనంగా సన్మానిస్తూ అభినందించడం జరిగింది. సన్మానించిన వారిలో లావుడియా రాజు నాయక్, రాజేశ్వరరావు, రాజయ్య, రఘుపతి, సత్యనారాయణ , రాజేందర్, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, ప్రభాకర్, మల్లికార్జున్,



రవి, రమేష్, తిరుపతి, సుధాకర్, సుల్తాన్, రమేష్, నాగరాజు , రవి , సునీత,సౌందర్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకు ఇందిరమ్మ మోడల్ హౌస్ పూర్తి చేయాలి



- తహసీల్దార్,ఎంపిడిఓ కార్యాలయాల తనిఖీలు
- డిప్యూటీ తహసీల్దార్,ఆపరేటర్లకు షో కాజ్ నోటీసులు
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ఇందిరమ్మ మోడల్ హౌస్ ను పరిశీలిస్తున్న కలెక్టర్

నర్సంపేట, నేటిధాత్రి:
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పట్ల ప్రభుత్వం ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో నిర్మాణం చేస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ ను నిబంధనల మేరకు నాణ్యతతో పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ మోడల్ హౌస్ ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. సెట్ బ్యాక్ ఎంత పెట్టారు. ఉపయోగించే మెటీరియల్, క్యూరింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే నిధులతో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు ఏ విధంగా ఉంటుందో మోడల్ హౌస్ ఉండేలా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ఎనిమిది మండల కేంద్రాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ మాడల్ హౌస్ పురోగ దశలో ఉన్నాయని,వాటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.

### తహసిల్,ఎంపిడిఓ కార్యాలయాల తనిఖీచేసిన కలెక్టర్

దుగ్గొండి మండలంలోని తహసీల్దార్,ఎంపీడీవో కార్యాలయాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల్లో సిబ్బంది హాజరు,ఇతర రిజిస్టర్ లను పరిశీలించారు. ఉద్యోగుల హాజరు బయోమెట్రిక్ ప్రకారం తప్పకుండా జరగాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ భూభారతి రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన ఆర్జీల పరిష్కరణ పురోగతిపై సమీక్షించి, రెవెన్యూ సదస్సులో స్వీకరించిన ఆర్జీలను రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో ఉన్న రైతులతో కలెక్టర్ నేరుగా సంభాషించి ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.

### డిప్యూటీ తహసీల్దార్, ఆపరేటర్లకు షో కాజ్ నోటీసులు

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆకస్మితంగా తనిఖీ చేయగా బయోమెట్రిక్ హాజరు ప్రకారం విధులకు ఆలస్యంగా హాజరైన డిప్యూటీ తహసీల్దార్,ఆపరేటర్లకు షో కాజ్ నోటీసులు జారీ చేయాలని తహసిల్దార్ రాజేశ్వరరావు ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ అధికారి గణపతి, తహసిల్దార్ రాజేశ్వరరావు,ఎంపీడీవో అరుంధతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "రైతులకు ఇబ్బందులు కలిగిస్తే.. సహించేది లేదు"

- "వ్యవసాయ అధికారులే యూరియా టోకెన్లు ఇవ్వాలి"
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల /నేటిధాత్రి:
మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలో యూరియా పంపిణీలో డీలర్లు, అధికారులు ఎవరైనా అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులకు వ్యవసాయ అధికారులే టోకెన్లు ఇచ్చి వాటి ప్రకారంగానే యూరియాను పంపిణీ చేయాలని, దీనికి భిన్నంగా ఎక్కడైనా జరుగుతుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నవాబుపేటలో యూరియా పంపిణీలో కోరమాండల్ డీలర్ చేసిన అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి (డీఏఓ)ను కోరామని వెల్లడించారు. నియోజకవర్గంలో గత ఏడాది వానాకాలం ఖరీఫ్ సీజన్ మొత్తానికి ఇచ్చిన యూరియా కంటే అధికంగా యూరియాను ఇప్పటికే రైతులకు అందించామని గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఎమ్మెల్యే తెలిపారు. గత ఏడాది ఖరీఫ్ లో సీజన్ మొత్తానికి 9 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయగా ప్రస్తుతం ఇప్పటికే 9600 టన్నులకు పైగా యూరియాను రైతులకు అందించామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో యూరియా రాకపోవడం, గత ఖరీఫ్ సీజన్ కంటే ఎక్కువ విస్తీర్ణంలో ప్రస్తుతం పంటలు సాగు చేయడంతో యూరియాకు ఎక్కువ డిమాండ్ ఏర్పడిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేసిన నేపథ్యంలో తాను అధికారులతో మాట్లాడి ఎక్కువ పరిమాణంలో యూరియా జడ్చర్ల నియోజకవర్గానికి కేటాయించేలా చూస్తున్నానని వివరించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పీఏసీఎస్, ఆగ్రోస్, హాకా, గ్రోమోర్, కోరమాండల్ సెంటర్లలతో పాటుగా ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు యూరియా పంపిణీ జరుగుతోందన్నారు. ఈ కేంద్రాలు అన్నింటిలోనూ వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఇఓలు) స్వయంగా కూర్చొని రైతులకు టోకెన్లు జారీ చేయాలని కోరామని, అదేవిధంగా ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా పని చేస్తున్న 44 మంది ఏఇఓలు టోకెన్లు జారీ చేసి యూరియాను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఈ కారణంగా టోకెన్ లభించిన ప్రతి రైతుకూ యూరియా



దొరుకుతోందన్నారు. అయితే నవాబుపేటలోని కోరమాండల్ డీలర్ కు మంగళవారం 460 బస్తాల యూరియాను కేటాయించి, దానికి సంబంధించి 460 మంది రైతులకు టోకెన్లు జారీ చేయగా, కోరమాండల్ లో పని చేసే మధు శేఖర్ అనే వ్యక్తి టోకెన్లు లేకుండానే సుమారు 200 మందికి యూరియాను ఇచ్చాడని, దీంతో అక్కడ టోకెన్లు తీసుకున్న రైతులు అందరికీ యూరియా దొరక్క వారు ఆందోళన చేసారని తెలిపారు. అలాగే యూరియా తీసుకోని రైతులకు కూడా వారు యూరియా తీసుకున్నట్లుగా మెసేజ్ లు వచ్చాయనే విషయం కూడా తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం కోరమాండల్ సెంటర్ లో ఎరువుల అమ్మకాలను వ్యవసాయ అధికారులు నెల రోజులపాటు నిషేధించారన్నారు. అయితే ఈ సంఘటనలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా తాను డీఏఓను కోరానని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో పూర్తి పారదర్శకంగా యూరియా పంపిణీ జరగాలని అధికారులను కోరారు. దీనికి భిన్నంగా ఎక్కడైనా జరుగుతుంటే ఆ విషయాన్ని తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. యూరియా పంపిణీలో అధికార యంత్రాంగం తీసుకున్న చర్యల కారణంగా ఎక్కడ కూడా యూరియా అధిక ధరలకు అమ్ముకోవడం, బ్లాక్ మార్కెట్ కు తరలించడం లాంటి సంఘటనలు జరిగినట్లు ఎక్కడా తన దృష్టికి రాలేదని తెలిపారు. అయినప్పటికీ రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి రైతులకు యూరియా సక్రమంగా పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. యూరియా పంపిణీలో నిబంధనలకు భిన్నంగా అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తన దృష్టికి తీసుకురావాలని అనిరుధ్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# వాహనాలు తనిఖీ చేసిన పోలీసు అధికారులు

జహీరాబాద్, నేటిధాత్రి:
ఝరాసంగం మండల కేంద్రంలోని కుప్పా నగర్ గ్రామ బర్దిపూర్ కమాన్ సమీపంలో వాహనాలను ఎస్ఐ క్రాంతి కుమార్ పటేల్ గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ క్రాంతి కుమార్ పటేల్ మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. మైనర్లకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వవద్దని, అలాగే సరైన పత్రాలు లేని వాహనాలను, నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్డు పై నడిపిస్తే సీజ్ చేస్తామని తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్



వాడాలని, వాహనాలకు ఉన్న పెండింగ్ చలాన్లు కట్టివేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ క్రాంతి కుమార్ పటేల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లా వాల్మీకి సంగం అధ్యక్షులు గా ఉమ్మల్ల రాములు




వనపర్తి నేటిధాత్రి:
వనపర్తి జిల్లా యూవజన కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస పురం ఉమ్మల్ల రాములు వాల్మీకి సంఘం నూతన అధ్యక్షులు గా నియామకం అయ్యారు ఈమేరకు రాములు ను జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

# పత్తి పంటను ద్వంశం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

## నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని రెతుల డిమాండ్.



కారేపల్లి, నేటిధాత్రి:
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం లోని రంగు రాళ్ళ బోడు సమిపంలో పోడు భూమి సాగు చేసుకుంటూ జీవిస్తున్న గిరిజన రైతు దరంసోత్ సూర్య గేట్ రెలకాయల పల్లి కిచేందిన అతని వ్యవసాయ భూమిలో పత్తి పంటను వెయ్య దాని లో 2ఎకరాల పత్తి పంటను గుర్తు తెలియని వ్యక్తులు ద్వంశంచేశారని రైతుకు కారేపల్లి రెంజ్. ఇల్లందు రెంజ్.పారెస్టు సిబ్బందె తనపత్తి పంట నుద్వంశం చేసినారని రైతు దరంసోత్ సూర్య తన ఆవేదనను వ్యక్తపరుస్తు పారెస్టు అధికారులను అడిగి తేలుసుకోగ వారు వేము పికివేయ్యలెదని అంటున్నారని తెలిపారు అదికారులు నాకు ఉన్న వ్యవసాయ భూమికి కోంత భూమికి పట్ట ఇచ్చి మిగిలిన రెండు ఎకరాల భూమిని తరువాత పట్టఎక్కి స్తామని చెప్పినారని అట్టి భూమిలో కూడా పత్తి పంటను వెశానని పత్తి ఏపుగా పెరిగి చేతికి వచ్చిన పత్తి పంట సుమారు రెండు ఎకరాలు గలదాన్ని ద్వంశం చేసి సుమారు రెండు లక్షల వరకు నష్టం చేశారని నష్టానికి కారకులు అయిన వారి గురించి విచారించి చర్యలు తీసుకోని పంట నష్టపరిహారం ఇప్పించి గిరిజన రైతు దరంసోత్ సూర్యను ఆదుకోవాలని రైతులు అజ్మీరా శోభన్ మొహన్ గుగులోత్ రాములు బానోత్ బాల భూక్యా విరన్న ఖాసిం రఫీ అ్రము దరంసోత్ సూర్య పత్తి పంటను పరిశీలించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



# జిల్లాలో ఐదు పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ ల తొలగింపు వారి స్థానంలో స్పెషల్ ఆఫీసర్ పాలన

తొర్రూర్ డివిజన్ , నేటిధాత్రి: తొర్రూర్ ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం స్పెషల్ ఆఫీసర్ గా అసిస్టెంట్ రిజిస్టర్ కె రమేష్ ను ప్రభుత్వం నియమించింది. సొసైటీ చైర్మన్ గా ఉన్న కాకిరాల హరి ప్రసాదరావు స్థానంలో స్పెషల్ ఆఫీసర్ ను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కమిటీ లను గతంలో ఆరు నెలలు ప్రభుత్వం పదవీకాలం పొడిగించగా, గత ఆగస్టు నెలలో పదవి కాలం పూర్తి కాగా మళ్లీ ఆరు నెలలు పొడిగించిన కాంగ్రెస్ ప్రభుత్వం కొంతమంది సొసైటీల చైర్మన్ ల స్థానంలో స్పెషల్ ఆఫీసర్ల ను నియమించింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యేలకు అనుకూలంగా లేని చోట్ల చైర్మన్ లను తొలగించినట్లు ప్రచారం. మహబూబాబాద్ జిల్లాలో ఐదు సొసైటీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. తొర్రూర్, నెల్లికుదురు, బయ్యారం, కేసముద్రం, కురవి సొసైటీల చైర్మన్లను ప్రభుత్వం తొలగించి స్పెషలాఫీసర్ల ను నియమించింది. దీంతో ప్రభుత్వం తొలగించిన సొసైటీ చైర్మన్లు కోర్టుకు వెళ్తున్నట్లు సమాచారం

# యువతమాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి




## సిఐ రాజువర్మ ఎస్సై కేశవ్

నేటిధాత్రి చర్ల :
చర్ల మండలంలోని నూతన గ్రంధాలయం నందు మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు ఆదేశాల మేరకు చర్ల లైబ్రేరియన్ వంశీకృష్ణ అధ్యక్షత వహించగా చర్ల పోలీస్ శాఖ ఉన్నతాధికారి సీఐ రాజు వర్మ ఎస్సై కేశవ్ గురుదేవ్ విద్యాలయం ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం మరియు మహిళా ఉపాధ్యాయురాలు ముఖ్య అతిథులుగా పాల్గొనగా సిఐ రాజు వర్మ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని బంగారు భవిష్యత్తును పొందాలని కన్న తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సిఐ రాజు వర్మ అన్నారు చర్ల మండలం లోని యువకులు గంజాయి డ్రగ్స్ గుట్క మత్తు పదార్థాల బారిన పడవద్దని గంజాయి అమ్మిన సేవించిన సమాచారం స్థానిక పోలీస్ శాఖ అధికారుల కు అందించాలి ప్రమాదాలు బాల్య వివాహాలు బాల కార్మికులు సమాచారం డయల్100 అందించాలన్నారు ప్రతి



వ్యాపార సముదాయాల ముందు సీసీటీవీ కెమెరాలు అమర్చినట్లయితే ఎటువంటి సమస్య ఉండదు అని అన్నారు వృద్ధాప్యంలో తల్లితండ్రులను మంచిగ చూసుకోవాలని మూడ నమ్మకాలపై అవగాహన కలిగి ఉండాలని అలాగే తదితర సామాజిక అంశాల ను వివరిస్తూ మరియు సైబర్ క్రైమ్స్ బెట్టింగ్ ఆప్స్ పై అవగాహన కలిగి ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని అన్నారు సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 తెలి యజేశారు ఈ కార్యక్రమంలో గురుదేవ్ విద్యాలయం విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు

# కొడుకు పెళ్లి రిసెప్షన్ రద్దు చేసుకున్న ఎమ్మెల్యే



- రైతుల సంక్షేమంకోసం 2కోట్లు ఇవ్వాలని నిర్ణయం
- సీఎం రేవంత్‌ను కలిసి చెక్ అందచేసిన బత్తుల లక్ష్మారెడ్డి

**హైదరాబాద్, నేటిధాత్రి:**
మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉదారత చాటుకున్నారు. రైతుల సంక్షేమం కోసం రెండుకోట్లు విరాళంగా ఇచ్చారు. దీనికి చెక్కు రూపంలో సీఎం రేవంత్ రెడ్డికి అందించారు. తన నియోజకవర్గంలో రైతుల కోసం ఖర్చు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , ఆయన కుటుంబసభ్యులు విరాళం అందించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌ను లక్ష్మారెడ్డి కలిసి రూ. 2కోట్ల చెక్ అందజేశారు. లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందించాలని సీఎంను ఆయన కోరారు. ఇటీవల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు సాయి ప్రసన్న వివాహం జరిగింది. మిర్యాలగూడలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భావించారు. కానీ రిసెప్షన్ రద్దు చేసుకుని ఆ డబ్బును రైతుల కోసం ఖర్చు చేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. దీంతో వెంటనే సిఎంకు చెక్కును అందించారు. లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను సీఎం అభినందించారు.

# వైకాపా హయాంలో భారీ లిక్కర్ స్కామ్



- సిట్ విచారణ జరుగుతోంది
- త్వరలోనే వాస్తవాలు ప్రజల ముందుకు
- పారదర్శకంగా లిక్కర్ పాలసీ అమలు
- మండలిలో మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

**అమరావతి, నేటిధాత్రి:**
వైకాపా ప్రభుత్వంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారన్నారు. ఇందులో వందలకోట్లు దుర్వినియోగం జరిగిందని అన్నారు. బెల్టుషాపులు, నకిలీ మద్యం అమ్మకాలపై శాసన మండలిలో చర్చ సందర్భంగా వైకాపా ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, శివరామిరెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. మద్యం విషయంలో అంతా మంచి జరిగిందని వైకాపా చెప్పడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. మద్యం కుంభకోణంపై సిట్ విచారణ జరుగుతోంది.. త్వరలో వాస్తవాలు బయటకు వస్తాయని మంత్రి అన్నారు. మద్యం దుకాణదారులు తప్పు చేస్తే జరిమానా, రెండోసారి తప్పు చేస్తే లైసెన్స్ సస్పెండ్ చేస్తున్నాం. సరఫరా పర్యవేక్షణకు పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటు చేసి అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో లిక్కర్ పాలసీని చాలా పారదర్శకంగా అమలు చేస్తున్నాం. మనం అమలు చేసే పాలసీని పక్క రాష్ట్రాలు కూడా అధ్యయనం చేస్తున్నాయి. మద్యాన్ని ఆదాయ వనరుగా ప్రభుత్వం ఎప్పుడూ చూడలేదు. నాసిరకం మద్యం అమ్మినవారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో లిక్కర్ వల్ల చనిపోయినట్లుగా ఎక్కడా కేసు నమోదు కాలేదని కొల్లు రవీంద్ర తెలిపారు.

# ప్రతిపక్షహోదా కాదు..సభకు వచ్చి మాట్లాడు



- సభకు రాకుండా హోదా కావానడం సిగ్గుచేటు
- ఇలాంటి వారి గూబ పగులగొట్టాలన్న అచ్చన్న

**అమరావతి, నేటిధాత్రి:**
మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ ప్రతిపక్ష హోదా అడగడం పట్ల మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... ప్రతిపక్ష హోదా అడుగుతున్న జగన్ చెంప పగలగొట్టాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 11 సీట్లు వచ్చిన పార్టీ నేతలు ప్రతిపక్ష హోదా అడుగుతుంటే గూబ పగలగొట్టాలి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓడిపోయిన నాయకుడు అసెంబ్లీలోకి వచ్చి కూర్చుంటే ఎంత తప్పో ... జగన్ ప్రతిపక్ష హోదా అడగటం కూడా అంతే తప్పు అని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేల అనర్హత వేటుపై అసెంబ్లీలో చర్చించి స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని.. అది స్పీకర్ పరిధిలోని అంశమని వెల్లడించారు. జగన్ ప్రతిపక్ష హోదా అడగటం మానేసి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలి అంటూ అచ్చెన్నాయుడు హితవుపలికారు. వైసీపీ నేతలపై శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన జగన్, వైసీపీ నేతలు బావిలో దూకాలంటూ మండిపడ్డారు. పోలవరం కట్టనందుకు జగన్ బావిలో దూకాలన్నారు. శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు పిచ్చి పిచ్చి ప్రశ్నలు అడిగి సమాధానం వినకుండా సభ నుంచి పారిపోతున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని సజ్జల కూటమిపై విమర్శలు చేస్తున్నారన్నారు. వైసీపీ నేతలు బయట ఉండి పిచ్చిపిచ్చి విమర్శలు చేస్తే సహించమని.. సభకు వచ్చి మాట్లాడాలని అనూరాధ హితవు పలికారు.

# ప్రతిపక్ష హోదా కోసం పట్టుబట్టమేంటి



- ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక అసెంబ్లీకి రావాల్సిందే
- జగన్, కేసీఆర్‌ల తీరుపై మండిపడ్డ నారాయణ


**విజయవాడ, నేటిధాత్రి:**
తెలుగు రాష్ట్రాల్లో మాజీ ముఖ్యమంత్రులు అసెంబ్లీకి రాకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచి ఇరు రాష్ట్రాల మాజీ సీఎంలు అసెంబ్లీకి ముఖం చూపించిన దాఖలాలే లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన.. ప్రజా సమస్యల తరపున వారు మాట్లాడక పోవడంతో.. నియోజకవర్గ ప్రజల్లో నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతుంది. అయితే.. ఏపీలో మాజీ సీఎం జగన్ తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతానంటూ.. భీష్మించుకుని కూర్చున్న సంగతి తెలిసిందే. రాజ్యాంగంలో ప్రతిపక్ష హోదాకు ఉన్న నియమ నిబంధనల ప్రకారం జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇచ్చేది లేదని కూటమి ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. మరోపైపు తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్ తన అనారోగ్య సమస్యల వల్ల అసెంబ్లీ సమావేశాలకు రాలేకపోతున్నానని.. కాలం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల మాజీ సీఎంలపై సీపీఐ నేత నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో పోటీ– చేసి ఎమ్మెల్యేలుగా గెలిచిన మాజీ సీఎం జగన్ రెడ్డి, తెలంగాణ మాజీ సీఎం చంద్రశేఖర్ రావులు అసెంబ్లీకి రావాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీకి రాకపోవడం అంటే.. మీకు ఓటు వేసిన ప్రజానీకాన్ని మోసం చేయటడమే అని మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా ఇవ్వలంటే కొన్ని లెక్కలు వుంటాయని.. అవేవి తెలియకుండా జగన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో గెలిచి అధికారం వస్తే అసెంబ్లీకి వస్తారు.. లేకపోతే ముఖం చాటేస్తారా అని నిలదీశారు. అధికారం ఉన్నా లేకపోయినా అసెంబ్లీకి రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలుగా గెలిచి అసెంబ్లీకి రాకపోవటం అంటే.. పెళ్లి చేసుకుని కాపురానికి రాకపోవటమే అని నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు.


# ఆ డబ్బు మొత్తం రేవంత్ రెడ్డి కక్కాల్సిందే

**హైదరాబాద్, నేటిధాత్రి:**
సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిసి ధాన్యం టెండర్లలో వేల కోట్లు దోచుకున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ డబ్బు మొత్తం రేవంత్ రెడ్డి కక్కాల్సిందే అని సుదర్శన్ రెడ్డి అన్నారు.
ధాన్యం టెండర్లలో కుంభకోణం జరుగుతుందని బిఆర్ఎస్ చెప్పింది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిసి వేల కోట్ల రూపాయలు దండుకున్నారని క్యాబినెట్ తేల్చింది. డబ్బులను జప్తు చేయాలని జీఓ నంబర్ 15 విడుదల చేసింది. ధాన్యం టెండర్ల కుంభకోణంపై డిపార్ట్‌మెంట్ ఎందుకు చర్యలు చేపట్టలేదు. రూ. 66 కోట్లను జప్తు చేయాలని క్యాబినెట్ ఎందుకు తీర్మానం చేసిందో చెప్పాలి అని పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. ధాన్యం టెండర్ల కుంభకోణంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు? తేలు కుట్టిన దొంగల్లా తప్పించుకొని తిరుగుతున్నారు అని పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీ పెద్దల ఒత్తిడి మేరకు క్యాబినెట్‌కు ఫైల్ వెళ్ళింది. టెండర్ విలువ కంటే రూ. 230 ఎక్కువ వసూలు చేశారు. ధాన్యం టెండర్ల కుంభకోణంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు. రూ. 380 కోట్లకు రూ. 66 కోట్లు మాత్రమే జప్తు చేశారు. తప్పించుకోవడం కోసమే రూ. 66 కోట్లు జప్తు చేశారు. టెండర్లు నలుగురు వేస్తే ఇద్దరికి మాత్రమే ఎందుకు పెనాల్టీ వేశారు. మొత్తం డబ్బులు జప్తు చేయకుండా కేవలం రూ. 66 కోట్లు మాత్రమే ఎట్లా చేస్తారు. మొత్తం వ్యవహారంపై జ్యుడీషియరీ విచారణ జరపాలి అని పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు






**న్యూఢిల్లీ, నేటిధాత్రి:**
కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు ఢిల్లీలో మీడియా సమావేశంలో ఆరోపణలు చేశారు. ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్ ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక పద్ధతి ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు వేసే కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించిన మేం 100 శాతం ఆధారాలను గుర్తించామన్నారు. త్వరలో ఎన్నికల సంఘంపై హైడ్రోజన్ బాంబ్ పేల్చబోతున్నట్లుగా ప్రకటించినట్లుగానే గురువారం రాహుల్‌గాంధీ పేల్చారు. ఓట్ల చోరీపై గతంలో కొన్ని ఆధారాలు బయటపెట్టగా.. ఈరోజు మరిన్ని ఆధారాలను బయటపెట్టారు. మీడియా ముందు వీడియో ప్రజెంటేషన్ ఇస్తూ... ఓట్ల చోరీపై 100 శాతం ఆధారాలతో రుజువులు బయటపెడుతున్నట్లు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా లక్షలాది ఓట్లు తొలగించాలని కొంత మంది కంకణం కట్టుకున్నారు.. దానికి ఎన్నికల సంఘం వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే ఈసీ కళ్లప్పగించి చూస్తోందని ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రంలో ఎన్నికలు అయిపోతే.. ఇంకొక రాష్ట్రంలో.. ఇలా అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల సమయానికి లక్షలాది మంది ఓట్లను తొలగిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఇందుకోసం కేంద్రీకృత సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి.. కాంగ్రెస్ బూత్ నుంచి ఓట్లు తొలగించారని వివరించారు. ఇందుకు ప్రత్యేక ఉదాహరణగా 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు– బ్యాంక్ ఉన్న బూత్‌ల నుంచి వేలాది ఓట్లు తొలగించినట్లు– వెల్లడించారు. వేరే రాష్ట్రాల ఫోన్ నెంబర్లు, నకిలీ లాగిన్‌లు ఉపయోగించి ఓటర్ పేర్లు తొలగించారన్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ ఉపయోగించారని స్పష్టం చేశారు. ఒక ఎన్నిక తర్వాత ఒక ఎన్నికలో.. భారతదేశం అంతటా లక్షలాది మంది ఓటర్లను.. వివిధ వర్గాలను, ప్రధానంగా ప్రతిపక్షానికి ఓటు వేస్తున్న వర్గాలను, తొలగింపు కోసం ఒక సమూహం క్రమపద్ధతిలో లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి మేము 100 శాతం రుజువును కనుగొన్నాము.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను. ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రేమిస్తున్నాను. నేను ఆ ప్రక్రియను రక్షిస్తున్నాను. మీరు నిర్ణయించగల 100 శాతం రుజువు ఆధారంగా కాకుండా నేను ఇక్కడ ఏమీ చెప్పబోవడం లేదు. తీర్పు మీదేనని రాహుల్ గాంధీ అన్నారు. ర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో ఎవరో 6,018 ఓట్లను తొలగించడానికి ప్రయత్నించారని.. చివరికి ఎవరో పట్టుబడ్డారన్నారు. ఇది చాలా నేరాల మాదిరిగానే యాదృచ్ఛికంగా పట్టుబడినట్లు తెలిపారు. ఈ తొలగింపు ప్రయత్నాలు కేవలం కాంగ్రెస్ పార్టీ గెలిచే బూత్‌లోనే జరిగిందని వివరించారు. గోదాబాయి పేరుతో ఎవరో నకిలీ లాగిన్ సృష్టించి 12 మంది ఓటర్ల పేర్లు తొలగించారన్నారు. కానీ ఈ విషయం గోదాబాయికి తెలియదని చెప్పారు. వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఫోన్ నెంబర్ల ద్వారా ఈ తతంగం అంతా చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. వారంలోపు ఈసీ డేటా విడుదల చేయాలని.. లేకపోతే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నవారిని రక్షిస్తున్నారని భావించాల్సి ఉంటుందని తెలిపారు. కర్ణాటకలోని అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. అలాగే ఓట్ల చోరీకి పాల్పడేవారిని ఎన్నికల సంఘం చీఫ్ రక్షిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరపాలంటూ చేస్తున్న అభ్యర్థనలను విస్మరిస్తున్నారని అన్నారు. ఇది హైడ్రోజన్ బాంబ్ కాదని, దానిని త్వరలో పేలుస్తానని వెల్లడించారు. ఇదిలా ఉంటే రాహుల్ గాంధీ ఆరోపణలను, భారతీయజనతా పార్టీ ఖండించింది. బాంబ్ తుస్సు అందని భాజపా ఎద్దేవా చేసింది.



# నేపాల్ శాంతిస్థాపనకు మద్దతు

## నేపాల్ ప్రధాని సుశీలా కార్కీకు మోడీ ఫోన్

**న్యూఢిల్లీ, నేటిధాత్రి:**
నేపాల్‌లో శాంతి స్థాపనకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందని ప్రధాని మోడీ ప్రకటించారు. ఈ మేరకు ప్రధాని సుశీల కార్కీకు మోడీ సందేశం పంపారు. సోషల్ మీడియాపై నిషేధం, అవినీతి వ్యతిరేక నిరసనలతో కొన్ని రోజుల క్రితం అట్టుడికిన నేపాల్ లో పరిస్థితులు కుదుటపడ్డాయి. ఈ క్రమంలో ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీ తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలను మోదీ ఎక్స్‌లో పంచుకున్నారు. సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు ఆమె చేసే ప్రయత్నాలకు భారత మద్దతును పునరుద్ఘాటించినట్లు మోదీ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై.. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారిన నేపాల్ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దీంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే సుశీలా కార్కీని తాత్కాలిక ప్రధానిగా జెన్‌జీ ఎంపిక చేసింది. గత శుక్రవారం ఆమె ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కార్కీ సిఫార్సు మేరకు దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పార్లమెంటును రద్దు చేశారు. 2026 మార్చి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.

# అల్మట్టి ఎత్తు పెంచేందుకు కర్ణాటక యత్నం

## ఇప్పటికీ స్పందించని రేవంత్‌పై మాజీ ఎంపీ వినోద్ ఫైర్

**హైదరాబాద్, నేటిధాత్రి:** అల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తుంటే.. ఇప్పటికీ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడంపై బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అంశంపై తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. కృష్ణా ట్రిబ్యునల్ 2013లో అల్మట్టి ప్రాజెక్టు ఎత్తుకు సంబంధించి తీర్పు ఇచ్చింది. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ తీర్పుపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఆందోళనల నేపథ్యంలో అప్పటి ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ వేస్తే ట్రిబ్యునల్ తీర్పుపై స్టే వచ్చింది. 2014లో తెలంగాణ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టు స్టే కొనసాగించేలా చర్యలు చేపట్టింది. సుప్రీం కోర్టు స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం అల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు ప్రయత్నిస్తోంది. నిన్న కర్ణాటక ప్రభుత్వం అల్మట్టి ప్రాజెక్టు విస్తరణ కోసం లక్షా 33 వేల ఎకరాల భూ సేకరణ చేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది. ఈ భూ సేకరణ కోసం రెండేళ్లలో రూ. 70 వేల కోట్లు ఖర్చు పెట్టాలని కర్ణాటక లక్ష్యంగా పెట్టుకుంది. కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే. కర్ణాటక అల్మట్టిపై నిర్ణయం తీసుకుని రెండు రోజులు అవుతున్నా సీఎం రేవంత్ రెడ్డి ఇంకా స్పందించలేదు. సుప్రీంకోర్టు స్టే పెండింగ్‌లో ఉండగానే కర్ణాటక అల్మట్టి ఎత్తు పెంచడానికి తీసుకున్న నిర్ణయంపై తక్షణమే మన రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. కృష్ణా నదిలో ఒక్క నీటి చుక్కను వదలుకోమని ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ఓ సమీక్ష సమావేశంలో చెప్పారు. మరి కర్ణాటక అక్రమంగా అల్మట్టి ఎత్తు పెంచుతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ కర్ణాటక నిర్ణయంపై స్పందించారు. అల్మట్టి ఎత్తు పెంచితే తమ రాష్ట్రంలోని రెండు జిల్లాలు సాంగ్లీ, కొల్హాపూర్ జిల్లాల్లో ముంపు ఉంటుందని మహారాష్ట్ర సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. అల్మట్టి ఎత్తు పెంపును ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని అడ్డుకుని తీరుతామని ఫడ్నవీస్ హెచ్చరించారు అని వినోద్ కుమార్ గుర్తు చేశారు. కేసీఆర్‌పై ద్వేషమే తప్ప రేవంత్ రెడ్డికి కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం చేయాలని లేదు. కేసీఆర్ పట్టుదలతోనే సెక్షన్ 3 ప్రకారం కృష్ణా ట్రిబ్యునల్‌లో వాదనలు జరుగుతున్నాయి. కేసీఆర్ కృష్ణా ట్రిబ్యునల్ కోసం 33 లేఖలు కేంద్ర ప్రభుత్వానికి రాశారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తగ్గించారని కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి పదే పదే నిందలు వేస్తున్నారు. నిన్న కూడా సెప్టెంబర్ 17 వేడుకల ప్రసంగంలోనూ కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి విషం చిమ్మారు. తెలంగాణ ఏర్పడ్డ నెల రోజులకే కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు కోసం లేఖ రాశారు. కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటును మహారాష్ట్ర, కర్ణాటక వ్యతిరేకించినా కేసీఆర్ మాటనే చివరకు నెగ్గింది. కేసీఆర్‌పై నిందలు మాని అల్మట్టిపై కర్ణాటక దూకుడును రేవంత్ రెడ్డి అడ్డుకోవాలి. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందుకే రేవంత్ రెడ్డి మౌనంగా ఉన్నారా..? రేవంత్ రెడ్డి ఇప్పటికైనా సుప్రీంకోర్టులో కర్ణాటకకు వ్యతిరేకంగా కంటెంప్ట్ పిటిషన్ వేయాలి. అల్మట్టి ఎత్తు పెరిగితే తెలంగాణకు భారీ నష్టం వాటిల్లుతుంది.. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన స్పందించాలి అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.

# సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు అసాధ్యం




**న్యూఢిల్లీ, నేటిధాత్రి:**
ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటు తొలగించడం లేదు.. ఆన్‌లైన్‌లో మరెవరూ తొలగించలేరని కూడా వివరించింది. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజవర్గంలో ఓటర్ల తొలగింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం.. అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో భాజపా అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బీఆర్ పాటిల్ గెలుపొందారని ఈసీ వెల్లడించింది. ఇలా తొలగంపు అన్నది జరగదని కూడా ఇసి స్పష్టం చేసింది. ఇదిలావుంటే ఓట్ల తొలగింపు అంటూ రాహుల్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని భాజపా దుయ్యబట్టింది. రాహుల్‌కు రాజ్యాంగం, చట్టం అర్థం కావడం లేదు. 2014 నుంచి మోదీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడుతున్నారు. ఈ ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నాను అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా..? వాళ్లు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయాల్సింది దానిని అంగీకరించడం. కష్టపడి మీ స్థాయికి వస్తామనేలా వారి మాటలు ఉండాలి. అంతేకానీ దానికి బదులుగా వారు కోర్టుల జోక్యాన్ని కోరుకుంటున్నారు. లేకపోతే వేరొకరిపై నిందలు వేస్తున్నారని ఢిల్లీ మంత్రి మజీందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు. బంగ్లాదేశ్, నేపాల్ తరహా అశాంతి భారత్‌లో సృష్టించాని రాహుల్ భావిస్తున్నారని కమలం పార్టీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 90 ఎన్నికల్లో ఓటమి చవిచూసిందని, దాంతో ఆయన అసహనం రోజురోజుకూ పెరుగుతోందని ఎద్దేవా చేశారు. క్షమాపణలు కోరడం, కోర్టు మందలింపులు ఆయనకు పరిపాటిగా మారిపోయాయని అన్నారు.

# రాగల మూడురోజులు భారీ వర్షాలు

**హైదరాబాద్, నేటిధాత్రి:**
తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీచేసింది. గురువారం సూర్యాపేట, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని.. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. శుక్ర, శనివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలుపడుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది.
దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు సగటున సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించిందని ఉందని తెలిపింది. మధ్యప్రదేశ్ మధ్య ప్రాంతాల నుంచి పశ్చిమ–మధ్య ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతం వరకు తూర్పు విదర్భ, తెలంగాణ, దక్షిణ తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతుందని వాతావరణశాఖ వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట, హైదరాబాద్, పలు పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ముషిరాబాద్ పరిధిలోని భోలక్‌పూర్‌లో 15.5 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

# ఇరిగేషన్‌ను నాశనం చేసిన వైకాపా

## సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామన్న గొట్టిపాటి

**అమరావతి, నేటిధాత్రి:**
వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇరిగేషన్ రంగాన్ని విధ్వంసం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.. కూటమి ప్రభుత్వం చివరి ఎకరం వరకు సాగు నీరందించేలా ఇరిగేషన్ శాఖను గాడిలో పెడుతోందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల రుణం తీర్చుకునేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారాయన. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఆర్ వంశధార, తోటపల్లి, వంశధార–నాగావళి లింక్, జంఝావతి, హిరమండలం లిఫ్ట్, నాగావళి చంపావతి, మహేంద్ర తనయ, తరకరామతీర్థసాగర్ వంటి కీలకమైన ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి నిమ్మల తెలిపారు.. రెండేళ్ళలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తి చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 2వేల కోట్ల నిధులు కేటాయించారన్నారు..రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థం 5006.35 మెగావాట్లుగా ఉందని మంత్రి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు రాష్ట్రం ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 ను తీసుకొచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ పాలసీ ద్వారా రాష్ట్రంలో సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని 78.50 గిగావాట్లుకు పెంచే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిని పెంచకుండా, 9 సార్లు చార్జీలు పెంచి ప్రజల మీద భారం వేసింది రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థం, 2029 నాటికి ప్రభుత్వం లక్ష్యంపై బత్తుల బలరామకృష్ణ అడిగి ప్రశ్నకు గొట్టి పాటి సమాధానమిచ్చారు.




నెత్తురుకు మరిగిన హంగ్రీ చీతా.. డెత్ కోటా.. కన్ఫర్మ్ అంట ప్రస్తుతం సోషల్ మీడియాను ఇవే లైన్స్ ఏలుతున్నాయి. ఎక్కడ చూసినా.. ఎవరి నోట విన్నా ఓజీ .. ఓజీ అనే పేరు తప్ప ఇంకేదీ వినిపించడం లేదు. కనిపించడం లేదు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా కుర్ర డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా ఓజీ. డీవీవీ ఎంటర్ ట్రైన్మెంట్స్ బ్యానర్ పై డీవీవీ దానయ్య ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాడు.

ఓజీ సినిమాలో పవన్ సరసన ప్రియాంక మోహన్ నటిస్తుండగా.. బాలీవుడ్ రొమాంటిక్ హీరో ఇమ్రాన్ హష్మీ విలన్ గా నటిస్తున్నాడు. వీరితో పాటు దిగ్గజ నటులు ప్రకాష్ రాజ్, శ్రీయా రెడ్డి, అర్జున్ దాస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా సినిమాపై హైప్ ను కూడా క్రియేట్ చేశాయి. ఇకపోతే ఈ సినిమా సెప్టెంబర్ 25 న ప్రేక్షకుల ముందుకు రానుంది.


రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో ఓజీ ప్రమోషన్స్ మొదలుపెట్టిన చిత్ర బృందం వరుస ప్రెస్ మీట్లు, ఇంటర్వ్యూ లతో బిజీ అయ్యారు. అయితే ఇప్పటివరకు ఓజీ ట్రైలర్ రిలీజ్ కాకపోవడంతో.. ట్రైలర్ రిలీజ్ చేయమని

# ఫ్యాన్స్ ఓపిక పట్టండి.. ట్రైలర్ వచ్చేస్తుంది




ఫ్యాన్స్.. మేకర్స్ పై మండిపడుతున్నారు. మాకు ఓజీ ట్రైలర్ కావాలంటూ ఎక్స్ లో ట్రెండ్ చేస్తున్నారు. ఇక ఫ్యాన్స్ ఆవేశాన్ని గ్రహించిన మేకర్స్.. ఎట్టకేలకు ఓజీ ట్రైలర్ డేట్ ను అనౌన్స్ చేసారు. సెప్టెంబర్ 21 ఉదయం 10 గంటల 08 నిమిషాలకు ట్రైలర్ రానుందని తెలుపుతూ ఒక కొత్త పోస్టర్ ను రిలీజ్ చేశారు. అంతే కాకుండా డెత్ కోట.. కన్ఫర్మ్ అంట అంటూ క్యాప్షన్ కూడా ఇచ్చారు. అంటే ఇంకో రెండు రోజులు ఫ్యాన్స్ ఓపిక పడితే.. ఓజీ ట్రైలర్ వచ్చేస్తుంది. మరి ఈ ట్రైలర్ ఏ రేంజ్ లో ఉంటుందో చూడాలి.

# హీరోయిన్‌గా.. మరాఠీ స్టేజ్ ఆర్టిస్ట్



స్టేజీ ఆర్టిస్టుగా గుర్తింపు పొందిన తృప్తి రవీంద్ర తమిళ వెండితెరకు హీరోయిన్‌గా పరిచయమవుతోంది. మహారాష్ట్రకు చెందిన ఈ భామ.. విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'శక్తి తిరుమగన్' (భద్రకాళి) చిత్రంలో నటించగా, ఈ నెల 19న తమిళం, తెలుగు భాషల్లో విడులకానుంది. ఈ సినిమా అనుభవాలను తృప్తి వివరిస్తూ, 'నేను నటనలో శిక్షణ పొందాను. స్టేజ్ ఆర్టిస్టుగా కొనసాగుతున్నాను. ఇపుడు 'శక్తి తిరుమగన్'లో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. అరుణ్ ప్రభు దర్శకుడు. మల్టీటాలెంటెడ్‌గా గుర్తింపు పొందిన విజయ్ ఆంటోనీతో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉంది. ఈ మూవీ ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాను. తమిళ, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ఎంతగానో ఇష్టపడుతున్నా. తమిళంను కూడా నేర్చుకుంటున్నాను. ప్రేక్షకుల మనసుల్లో గుర్తుండిపోయే పాత్రలను ఇచ్చే ప్రతిభావంతులైన దర్శకులతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాను' అని పేర్కొన్నారు.



# కవిన్ 'కిస్' సినిమా తెలుగు ట్రైలర్ విడుదల

తమిళ నటుడు కవిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కిస్'. 'దాదా' సినిమాతో మంచి హిట్ అందుకున్న కవిన్.. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రముఖ కొరియోగ్రాఫర్ సతీష్ కృష్ణన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతుండగా.. రోమియో పిక్చర్స్ బ్యానర్‌పై రాహుల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా, సినిమా నుంచి తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఇందులో కవిన్.. ప్రేమ, ముద్దు అంటే అస్సలు ఇష్టపడని యువకుడి పాత్రలో కనిపిస్తున్నారు. గతంలో జరిగిన సంఘటనల కారణంగా ప్రేమపై నెగిటివ్ భావాలు ఏర్పడిన అతడి జీవితంలోకి 'ప్రీతి' అనే అమ్మాయి ప్రవేశించిన తర్వాత ఎలాంటి మార్పులు జరిగాయి? అన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం. ఈ చిత్రం తెలుగు, తమిళంతో పాటు హిందీ భాషల్లో కూడా విడుదల కానుంది.

# చివరి పాట చిత్రీకరణలో 'అఖండ -2'




నందమూరి బాలకృష్ణ అభిమానులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న సినిమా 'అఖండ 2 - తాండవం'. బాలకృష్ణ, బోయపాటి కాంబినేషన్ కు ఉన్న అరుదైన రికార్డుల దృష్ట్యా ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ మెంట్ రాగానే అంచనాలు అమాంతంగా అంబరాన్ని తాకాయి. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమాను బాలకృష్ణ కుమార్తె తేజస్వినీ నందమూరి సమర్పించడం మరో హైలైట్ గా మారింది. ఇక బాలకృష్ణ సినిమా అంటేనే మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. తమన్... పూనకాలు వచ్చేలా బాణీలు, నేపథ్య సంగీతం సమకూర్చుతాడు. 'అఖండ -2' కోసం తమన్ మరోసారి తనలోని మాస్ అవతార్ ను బయటకు తీశాడని అంటున్నారు. తాజాగా చిత్రీకరణ జరుగుతున్న పార్టీ సాంగ్ కూడా అలానే ఉంటుందని చెబుతున్నారు. భారీ సెట్స్ లో ఈ పాట చిత్రీకరణ హైదరాబాద్ లో జరుగుతోంది. దీనితో ప్యాచ్ వర్క్ మినహా షూటింగ్ పూర్తయినట్టేనని తెలుస్తోంది.

'అఖండ -2' సినిమా షూటింగ్ అనివార్య కారణాలతో కొంత ఆలస్యమైంది. అయితే... ఆ లోటును తీర్చుతూ బోయపాటి శ్రీను తనదైన శైలిలో చకచకా షూటింగ్ పూర్తి చేస్తున్నాడు. అదే సమయంలో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను కూడా ఉరకలు వేయించాడు. బాలకృష్ణ ఇప్పటికే తన డబ్బింగ్ ను పూర్తి చేశారు. సినిమా రషెస్ చూసుకున్న నిర్మాతలు... విఎఫ్ఎక్స్ వర్క్ ఆశించిన స్థాయిలో రాకపోవడంతో దాన్ని తిరిగి చేయించినట్టు తెలుస్తోంది. ఇప్పుడు అన్ని పర్ ఫెక్ట్ గా కుదరడంతో త్వరలోనే రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేయాలని అనుకుంటున్నారట.

సంయుక్త హీరోయిన్ గా నటించిన 'అఖండ -2'లో ఆది పినిశెట్టి ప్రతినాయకుడి పాత్రను పోషించాడు. గతంలో బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఆదికి నటించిన అనుభవం ఉంది. కానీ సంయుక్త మాత్రం తొలిసారి బోయపాటి డైరెక్షన్ లో యాక్ట్ చేస్తోంది. ఇప్పటికే బాలకృష్ణతో వాణిజ్య ప్రకటనల్లో నటించిన సంయుక్త ... హీరోయిన్ ఆయన సరసన నటించడం ఇది ఫస్ట్ టైమ్. 'అఖండ -2' సినిమా దసరా కానుకగా సెప్టెంబర్ 25న విడుదల కావాల్సింది. కానీ విఎఫ్ఎక్స్ వల్ల జరిగిన జాప్యంతో ఇప్పుడు డిసెంబర్ 5కు వాయిదా పడింది. ఇప్పటి వరకూ కొత్త రిలీజ్ డేట్ ను మేకర్స్ అధికారికంగా ప్రకటించకపోయినా... బాలకృష్ణ ఇటీవల ఈ సినిమా డిసెంబర్ ఫస్ట్ వీక్ లో వస్తుందని చెప్పడంతో నందమూరి అభిమానులంతా ఆ తేదీ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ యేడాది సంక్రాంతి కానుకగా బాలకృష్ణ 'డాకు మహరాజ్' విడుదల కాగా... ఇప్పుడు చివరి నెల మొదటి వారంలో 'అఖండ -2' విడుదల అవుతుండటం విశేషం.

# అల్లు అర్జున్ సినిమానే కారణమా...



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణే పాపులర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగ మధ్యలో పచ్చగడ్డి వేస్తే భగ్గముంటున్న విషయం తెలిసిందే. ప్రభాస్ 'స్పిరిట్' మూవీలో నటించడానికి దీపికా తొలుత అంగీకరించింది, కథంతా విని, సినిమాకు సైన్ చేసింది. ఆ తర్వాత దీపికా కొన్ని షరతులు పెట్టడంతో సందీప్ రెడ్డి వంగ కు మండింది. దాంతో ఆమెకు కటీఫ్ చెప్పేశాడు. తన సినిమాలోంచి ఆమెను తీసేశాడు. దీపిక గొంతెమ్మ కోరికలను తీర్చడం ఎవరి వల్లా కాదని సందీప్ వంగ అండ్ బ్యాచ్ సోషల్ మీడియాలో కోడై కూసింది. అయితే అదే సమయంలో దీపికా తరఫున వకాల్తా పుచ్చుకుని కూడా కొందరు మాట్లాడారు. కట్ చేస్తే ఇప్పుడు ప్రభాస్ హీరోగా నటిస్తున్న మరో సినిమా 'కల్కి 2898 ఎ.డి.' సీక్వెల్ నుండి కూడా దీపికా పదుకునేను తప్పించారు మేకర్స్. ఆ విషయాన్ని తెలియచేస్తూ వాళ్ళు ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. దానిని సందీప్ రీ-పోస్ట్ చేస్తూ... లాఫింగ్ ఎమోజీని పెట్టాడు. నవ్వీ నవ్వీ తట్టుకోలేకపోతున్న భావనను ఈ ఎమోజీ ద్వారా వ్యక్తం చేశాడు సందీప్ రెడ్డి వంగ. ఇదిలా ఉంటే... 'కల్కి 2898 ఎ.డి.' సినిమా విడుదలై ఏడాది దాటిపోయింది. అయితే ఇంత ఆలస్యంగా ఇప్పుడు ఈ సీక్వెల్ లో దీపికా ఉండదని మేకర్స్ చెప్పడం వెనక ఆంతర్యం ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు. నిజంగానే మొదటి భాగం షూటింగ్ సమయంలోనే దీపికా పదుకొనేతో ఏవైనా విభేదాలు వచ్చి ఉంటే... అది విడుదల అయిపోగానే చెప్పి ఉండాల్సింది కదా అని అంటున్నారు. దీపికను వదిలించుకోవడానికి చాలానే కారణాలు ఉన్నాయనే మాట కూడా ఫిల్మ్ నగర్ లో వినిపిస్తోంది. కల్కి విడుదల సమయంలో దీపికా పదుకొనే ప్రెగ్నెంట్ కావడంతో మేకర్స్ ఆశించిన స్థాయిలో ఆమె ప్రచారంలో పాల్గొనలేదు. అలానే రేపు ఈ సినిమా షూటింగ్ సమయంలో కావచ్చు, రిలీజ్ టైమ్ లో కావచ్చు ఆమె కోరినంత సమయాన్ని ఇస్తుందనే హామీ ఏదీ మేకర్స్ కు లభించనట్టుగా లేదు. అందుకే నిబద్ధత మాత్రమే ఇలాంటి సినిమాలకు సరిపోదని వారు తమ ప్రకటనలో తెలియచేశారని కొందరు అంటున్నారు. అంటే పరోక్షంగా దీపికా విషయంలో వారి ఏ మాత్రం సంతృప్తిగా లేరని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పదుకొణే.ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ - అట్లీ మూవీ చేస్తోంది. ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ దాదాపు పూర్తి కావచ్చిందట. ఇదే యేడాది డిసెంబర్ లో దీనిని పట్టాలెక్కించాలని నిర్మాతలు భావిస్తున్నారట. అయితే అదే సమయంలో 'కల్కి' సీక్వెల్ కూడా చేయాలని నాగ అశ్విన్ అనుకుంటున్నాడట. ఒకేసారి రెండు సినిమాలు సెట్స్ పైకి వెళుతుండటంతో డేట్స్ ను దీపికా అడ్జస్ట్ చేయలేక చేతులెత్తేసిందని అంటున్నారు. ఆమె అల్లు అర్జున్ మూవీకి ప్రాధాన్యం ఇస్తుండటంతో... తప్పని పరిస్థితుల్లో 'కల్కి' సీక్వెల్ నుండి తొలగించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరి ఈ విషయమై దీపికా పదుకొణే తన వర్షన్ ఏం చెబుతుందో చూడాలి.

# బోల్డ్ బ్యూటీకి.. రూ.530 కోట్ల రెమ్యూనరేషన్? నిజమేనా



హాలీవుడ్ అగ్ర కథానాయిక సిడ్నీ స్వీనీ అంటే తెలియని నేటి తరం ఉండదు. తన మార్క్ మసాలాతో కూడిన "యూఫోరియా", "ఎనీవన్ బట్ యూ" వంటి రొమాంటిక్ సినిమాలు, వెబ్ సిరీస్‌లతో నేడు ప్రపంచాన్ని ఓ కుదుపు కుదిపేస్తుంది. తన నుంచి ఓ సినిమా వస్తుందంటే అత్రుతగా, ఆశగా చూసేవారు ప్రపంచవ్యాప్తంగా కోట్లలో ఉన్నారు. అలాంటిది అంత పెద్ద స్టార్ష్ నాయికను ఓ ఇండియన్ సినిమాల్లో నటింపజేసేందుకు ఓ బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ ప్రయత్నం చేసినట్లు అందుకు గాను అమెకు భారీగా పారితోషకం ఏకంగా రూ.530 కోట్ల రెమ్యూనరేషన్ కూడా ఇచ్చేందుకు రెడీ అయినట్లు ఈ రెండు రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. ముంబై సినీ వర్గాల్లో ఇప్పుడు ఈ వార్త పెద్ద చర్చనీయాంశంగా మారింది.

ఒక వేళ తీసినా.. ఓ పది సినిమాల పెట్టుబడి డబ్బును హీరోకు కాదని హీరోయిన్‌కు ఇచ్చి ఆ రేంజ్‌లో తీసేంత సినిమా ఏమై ఉంటుంటని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఇవన్నీ ఫేక్ న్యూస్ అని వాటిని నమ్మొద్దని చెబుతూన్నారు. అయితే.. నెట్టింట ప్రచారం జరుగుతన్నంత కాక పోయిన అందులో లాస్ట్ జీరో తీసేసి అమౌంట్ ఆఫర్ చేసి ఉండవచ్చని అది కాస్త ఇక్కడకు వచ్చే సరికి రూ. 530 కోట్లకు చేరిందని అంటున్నారు. ఇంతకు అంత డేరింగ్ నిర్మాత, ఆ బ్యానర్ ఏంటో తెలుసుకొవాలని ఉందంటూ వ్యగ్యాస్త్రాలు సందిస్తున్నారు.

# ఈ ఆహారంతో అల్జీమర్స్ రిస్క్‌కు చెక్..!

వయసు పెరిగే కొద్దీ జ్ఞాపక శక్తి తగ్గడం, అల్జీమర్స్ సహా పలు వ్యాధుల ముప్పు పెరగడం ఆందోళన రేకెత్తిస్తుంటుంది. అయితే ఆరోగ్యకర జీవనశైలి, సమతులాహారంతో అల్జీమర్స్ సహా పలు వ్యాధుల ముప్పును నివారించవచ్చు.

ఆరోగ్యకర ఆహారం మెదడు ఆరోగ్యాన్నీ పదిలంగా ఉంచుతుంది. కచ్చితంగా ఈ ఆహారంతో వ్యాధులను నియంత్రించవచ్చనే హామీ లేకునా నిర్ధిష్ట ఆహార పదార్ధాలతో అల్జీమర్స్ ముప్పును తగ్గించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

ఇక అల్జీమర్స్‌తో పాటు శారీరక ఆరోగ్యానికి ఈ ఆహార పదార్ధాలను దైనందిన జీవితంలో భాగంగా చేసుకుంటే వయసు మీద పడే సమస్యను జాప్యం చేయడంతో పాటు దీర్ఘాయువు సొంతమవుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇక అల్జీమర్స్ ముప్పునకు చెక్ పెట్టాలంటే ఈ ఆహార పదార్ధాలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు..



**ఫ్యాటీ ఫిష్ ,...బెర్రీస్‌జి..ఆకుకూరలు, కూరగాయలు...తృణధాన్యాలు, జీడిపప్పు, బాదం, వాల్‌నట్ పసుపు...బీన్స్, చిక్కుడు ...ఆలివ్ ఆయిల్...డార్క్ చాక్లెట్**

# వర్కవుట్స్‌కు ముందు ఈ ఆహార పదార్ధాలు బెస్ట్..!

వ్యాయామానికి ముందు మీరు ఏం తీసుకున్నారనేది మీ వర్కవుట్ సామర్ధ్యం సహా పలు అంశాలపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఖాళీ కడుపుతో వర్కవుట్స్ చేయరాదని, ఫిట్‌నెస్ లక్ష్యాలను అందుకోవాలంటే వర్కవుట్స్ ముందు ఆరోగ్యకర ఆహారం తీసుకోవాలి. మంచి పోషకాహారం శరీరానికి ఉత్తేజం ఇవ్వడంతో పాటు వ్యాయామ సామర్ధ్యాన్ని కూడా పెంచుతుంది.

కండరాలు దెబ్బతినే ముప్పును కూడా ఇది నివారిస్తుంది. ప్రీ వర్కవుట్ స్నాక్స్‌లో ప్రొటీన్, కార్బోహైడ్రేట్లు, కొవ్వుల మధ్య సమతూకం పాటించాలి. వీటి మధ్య సరైన బ్యాలెన్స్ పాటిస్తే శరీరానికి శక్తి సమకూరడంతో పాటు కండరాలు వృద్ధి చెందుతాయి.

ప్రీ వర్కవుట్ స్నాక్స్ కోసం పీనట్ బటర్‌తో యాపిల్, దానిమ్మ ఇతర సీడ్స్‌తో కూడిన పెరుగు, సబ్జా గింజలతో కొబ్బరి నీళ్లు, బాయిల్డ్ ఎగ్స్, బ్లాక్ కాఫీ వంటివి తీసుకోవచ్చు. ఇక వ్యాయామానికి ముందు



షుగర్, షుగర్ అధికంగా ఉన్న ఫుడ్స్, నూనె పదార్ధాలు, ప్రొటీన్ షేక్స్ (వీటిని వర్కవుట్స్ అనంతరం తీసుకోవచ్చు), డైరీ డ్రింక్స్, కార్బోహైడ్రేట్లు అధికంగా ఉన్న ఆహార పదార్ధాలకు దూరంగా ఉండాలి.

# అరటి..ఆరోగ్య ప్రయోజనాలు అందించడంలో మేటి..!

బరువు పెరగాలనుకునేవారికి, ఆకలి తీర్చుకునేందుకు ఏ సమయంలోనైనా, ఎక్కడైనా సులభంగా తీసుకోదగిన అరటి పండు ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అరటి పండు ఆరోగ్యకరమే కాకుండా పోషకాల గనిగా శరీరానికి తక్షణ శక్తిని సమకూరుస్తుంది. ఇందులో శరీరానికి అవసరమైన విటమిన్లు, మినరల్స్ సహా రోగనిరోధక శక్తిని మెరుగుపరిచే విటమిన్ సీ, మెదడు పనితీరుకు అవసరమైన విటమిన్ బీ6 లభిస్తుంది. బీపీని నియంత్రించి, గుండె ఆరోగ్యానికి మేలు చేసే పొటాషియం ఉంటుంది. ఇక జీర్ణ సమస్యలతో ఇబ్బందులు పడే వారికి అరటి పండు దివ్యౌషధమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అరటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియ సాఫీగా సాగేలా చూడటంతో పాటు కడుపుబ్బరం, వికారాలను తగ్గిస్తుంది. అరటిలో ఉండే గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి సహజసిద్ధమైన చక్కెరలు తక్షణ శక్తిని సమకూర్చడంతో పాటు వర్కవుట్స్‌కు ముందు, పర్ఫెక్ట్ స్నాక్‌గానూ ఈ వండర్ ఫ్రూట్ పనికొస్తుంది.



# వ్యాయామంతో తగ్గనున్న స్ట్రోక్ ముప్పు

మెదడుకు అకస్మాత్తుగా రక్త సరఫరాలో అడ్డంకులు ఏర్పడినప్పుడు స్ట్రోక్ ముప్పు తలెత్తుతుంది. రక్తసరఫరాలో బ్లాకేజ్ (ఇస్కిమిక్ స్ట్రోక్), బ్లీడింగ్ (హమరేజిక్ స్ట్రోక్) వంటి సమస్యలతో స్ట్రోక్ ముంచుకొస్తుంది. ఈ సందర్భాల్లో మెదడుకు ఆక్సిజన్, పోషకాల సరఫరా నిలిచిపోవడంతో మెదడు దెబ్బతినడం, మెదడు కణాలు దెబ్బతినడం జరుగుతుంది. స్ట్రోక్స్ ప్రాణాంతకమే కాకుండా దాని ప్రభావం మెదడు, శరీర అవయవాలపై తీవ్రంగా ఉంటుంది. ఇది స్ట్రోక్ ఎక్కడ తలెత్తింది, బ్రైన్ డ్యామేజ్ ఏ మేరకు జరిగిందనే దానిపై అది చూపే ప్రభావ తీవ్రత ఆధారపడి ఉంటుంది.

అయితే నిత్యం వ్యాయామం చేసేవారిలో అనేక ఆరోగ్య ప్రయోజనాలతో పాటు స్ట్రోక్ ముప్పును కూడా నివారించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా మెదడు సహా శరీర భాగాలన్నింటికీ రక్తసరఫరా మెరుగుపడుతుంది. నిత్య వ్యాయామంతో స్ట్రోక్ ముప్పును తగ్గించే కారకాలను పరిశీలిస్తే..



**వ్యాయామంతో గుండె ఆరోగ్యం మెరుగు**
**బరువు నియంత్రణ**
**బీపీ నియంత్రణ**
**అదుపులో మధుమేహం**
**కొలెస్ట్రాల్ బ్యాలెన్స్**
**రక్త సరఫరా మెరుగుదల**
**వాపు ప్రక్రియకు చెక్**
**ఒత్తిడి మటుమాయం**
**నూతన కణాలతో రక్తసరఫరా మెరుగుదల**

# తినరో భాగ్యము.. తర్బూజ!

ఈ వేసవిలో కూడా ఎండలు మండుతాయని వాతావరణ శాఖ అంచనాలు వేస్తున్నది. ఇంకేముంది.. వ్యాపారులు పందిళ్లు వేసుకుని మరీ షర్బత్‌లు, పండ్లరసాల అమ్మకాలు మొదలుపెడతారు. ఎన్నున్నా చల్లదనానికి తర్బూజకు సాటివచ్చే పండు లేదు అంటారు పోషకాహార నిపుణులు. మనం 'ఆహా' అంటూ ఆరగిస్తున్న ఎర్రెర్రటి, తియ్యతియ్యటి తర్బూజ శతాబ్దాలుగా ఎన్నో మార్పులకు లోనైంది.


అధ్యయనాల ప్రకారం తర్బూజ మూలాలు ఆఫ్రికా ఖండంలో ఉన్నాయి. అక్కడినుంచి మధ్యధరా దేశాలకు, ఇతర ఐరోపా ఖండ దేశాలకు చేరుకుంది. దక్షిణ ఆఫ్రికా దేశాల్లో పెరిగే సిట్రన్ మెలన్‌లను ఇప్పటి తర్బూజకు పూర్వీకులుగా భావిస్తున్నారు. పశ్చిమ ఆఫ్రికాలో దొరికే ఎగుసి మెలన్ మరో ప్రసిద్ధి తర్బూజ రకం. అయితే అక్కడి ప్రజలు పండు కోసం కాకుండా, విత్తనాల నిమిత్తం సాగుచేయడం ఆసక్తికరం. కాకపోతే తర్బూజ వన్య రకాలు కొంచెం చేదుగా ఉంటాయి. మళ్లీ తినబుద్ధికాదు. ఇంకొన్నేమో చప్పచప్పగా ఉంటాయి. అయినా సరే, ఆఫ్రికా ప్రజలు వీటి సాగును వదిలిపెట్టలేదు. నీళ్లు దొరకని సమయంలో భద్రంగా దాచుకున్న తర్బూజ రసాన్ని తాగి దాహార్తి తీర్చుకునేవారు. తర్వాత కాలంలో ఎంపికచేసిన కాయల విత్తనాలను సేకరించి.. ఇప్పుడు మనం తింటున్న తియ్యటి పండ్లుగా రూపాంతరం చెందించారు.

## వేల ఏండ్ల చరిత్ర..

ఈజిప్టు ప్రజలు తర్బూజను నాలుగువేల ఏండ్లకిందనే సాగు చేసినట్టు అక్కడి ప్రాచీన సమాధుల మీదున్న చిత్రాల్ని బట్టి తెలుస్తున్నాయి. అంతేకాదు సమాధుల్లో కూడా తర్బూజ ఆనవాళ్లు కనిపించాయి. మరణానంతర జీవిత ప్రయాణంలో తమ పూర్వీకులు దాహం తీర్చుకోడానికి పనికొస్తాయని అప్పటి ప్రజలు నమ్మేవాళ్లు. గ్రీకులు తర్బూజను 'పెపాన్' అని పిలుస్తారు. చిన్నపిల్లలకు గుండెపోటు వస్తే తర్బూజ తొక్కలను తల మీద ఉంచి చికిత్స చేసేవాళ్లు. గ్రీకులు తర్బూజను శరీరానికి చల్లదనాన్ని ఇచ్చే ఆహారంగా పరిగణించేవాళ్లు. ఈ విషయాన్ని ఇటలీకి చెందిన ప్లీని ది ఎల్డర్ తన 'హిస్టోరియా నేచురాలిస్' అనే పుస్తకంలో ప్రస్తావించాడు. తర్బూజ తెచ్చిన తగువు.. చల్లదనాన్ని ఇచ్చే తర్బూజ కేంద్రంగా రాజకీయాలు నడిచాయంటే మనం నమ్మలేం. 1856లో జరిగిన 'తర్బూజ దొమ్మీ' (వాటర్‌మెలన్ రాయట్) దీనికి మంచి ఉదాహరణగా నిలుస్తుంది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి బయల్దేరిన ఓ రైలు ఆ ఏడాది ఏప్రిల్ 15న మధ్య అమెరికా దేశం పనామా రాజధానికి చేరుకుంది. ఇక్కడ దిగిన ప్రయాణికుల్లో ఒకరు దగ్గర్లో ఉన్న పండ్ల దుకాణానికి వెళ్లారు. ఓ తర్బూజ ముక్క తీసుకున్నారు. కానీ, డబ్బులు చెల్లించడానికి ససేమిరా అన్నారు. వ్యాపారి డబ్బులు అడగటంతో.. ఆ అమెరికా ప్రయాణికుడు తుపాకీ తీశాడు. వ్యాపారి ఆవేశంగా తన దగ్గరున్న కత్తితో దాడికి వెళ్లాడు. ఈ సంఘటన చివరికి స్థానికులు, అమెరికన్ ప్రయాణికుల గొడవగా మారిపోయింది. ఈ ఘర్షణలో కొందరు మరణించారు, ఇంకొంతమంది గాయాలపాలయ్యారు.

## పాలస్తీనా పతాకంపైనా

%పాలస్తీనా ప్రజలకు తర్బూజ ఓ స్ఫూర్తినిచ్చే శక్తిమంతమైన చిహ్నం.



ఇజ్రాయెల్- హమాస్ యుద్ధాల్లో తర్బూజ ఓ రాజకీయ సాధనంగా మారింది. పశ్చిమ ఆసియా దేశం ఇజ్రాయెల్ 1967లో పాలస్తీనాకు చెందిన వెస్ట్‌బ్యాంక్, గాజా ప్రాంతాలను అదుపులోకి తెచ్చుకుంది. ఆ ప్రాంతాల్లో ప్రజలు పాలస్తీనా జెండా ఎగరేయకుండా నిషేధం విధించింది. దీంతో పాలస్తీనా ప్రజలు తమ జెండా రంగులైన ఎరుపు, నలుపు, తెలుపు, ఆకు పచ్చకు దగ్గరగా ఉండే తర్బూజ చిత్రాన్ని జెండాగా ఉపయోగించారు. ఇప్పుడు హమాస్-ఇజ్రాయెల్ దాడుల సందర్భంగా సోషల్ మీడియాలో 'తర్బూజ' పాలస్తీనాకు సంకేతంగా చక్కర్లు కొడుతున్నది. ఇలా, ఎన్నో పోషకాలతో నిండిన తర్బూజ చరిత్రపైనా తనదైన ముద్ర వేసింది.

## అనేక పోషకాలు

**తర్బూజలో 92 శాతం నీరే ఉంటుంది. పండుగా తిన్నా, జూస్ తాగినా తాజాదనాన్ని, ఉత్తేజాన్ని ఇస్తుంది.**

**విటమిన్-ఎ, సి పుష్కలంగా ఉంటాయి. రోగ నిరోధక శక్తిని, కంటిచూపును మెరుగుపరుస్తాయి. మంచి పోషణను అందిస్తాయి.**

**ఇందులో ఉండే లైకోపీన్ ఆరోగ్యకర కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. రక్తపోటును అదుపులో ఉంచుతుంది.**

**తియ్యగా ఉన్నప్పటికీ తర్బూజలో క్యాలరీలు, కొవ్వులు తక్కువ. కాబట్టి బరువు, ఇతర సమస్యలను పట్టించుకోకుండా తినేయొచ్చు.**

**జీర్ణవ్యవస్థకు మేలుచేస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.**

**హైడ్రేటింగ్ గుణాలు ఉంటాయి కాబట్టి, తర్బూజ చర్మం ఆరోగ్యానికి ఎంతో మంచిది.**

**కొన్ని అధ్యయనాలు ఇది క్యాన్సర్‌ను నివారించగలదని పేర్కొన్నాయి. తర్బూజ శక్తి సామర్థ్యాలపై మరిన్ని అధ్యయనాలు జరుగుతున్నాయి.**

# ఈ ఆహారంతో ఫ్యాటీ లివర్ ముప్పునకు చెక్



ఆధునిక జీవనశైలితో మద్యం సేవించే వారితో పాటు మద్యం తీసుకోని వారిలోనూ (నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్) ఫ్యాటీ లివర్ సమస్య పెరుగుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. లివర్‌లో అధికంగా కొవ్వు పేరుకుపోవడం ద్వారా ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ పరిస్థితి నివారించడం, నియంత్రించడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది.

ఫ్యాటీ లివర్ వ్యాధి ముప్పును తగ్గించేందుకు ఆరోగ్యకర ఆహారాన్ని జీవనశైలిలో భాగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఆహారంలో ముఖ్యంగా పాలకూర వంటి యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సీ వంటి విటమిన్స్, మెగ్నీషియం వంటి మినరల్స్ అధికంగా ఉండే ఆకుకూరలు అధికంగా తీసుకోవాలి.

ఇవి లివర్‌లో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంతో పాటు శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను నియంత్రిస్తాయి. ఇక ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉండే సాల్మన్, మాక్‌రెల్, సార్డినెస్ వంటి ఫ్యాటీ ఫిష్‌లు లివర్‌లో ఫ్యాట్ లెవెల్స్, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. ఒమెగా 3 ఆమ్లాలు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. ఇక ఒలెరుపిన్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్ కూడా లివర్ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. ఇక ఈ పది ఆహారాలను డిన్నర్‌లో తీసుకోవడం ద్వారా ఫ్యాటీ లివర్‌ను నియంత్రించవచ్చు..

**ఆకుకూరలు ఫ్యాటీ ఫిష్ ఆలివ్ ఆయిల్ నట్స్, సీడ్స్ అవకాడో వెల్లుల్లి బెర్రీస్‌జి గ్రీన్ టీ పసుపు తృణధాన్యాలు**

# ఫోలేట్.. తీసుకుంటున్నారా?

ఫోలేట్‌ను విటమిన్ బి9 అని కూడా పిలుస్తారు. రోజువారీ పనులు, గర్భిణిగా ఉన్న సమయంలో పిండం అభివృద్ధిచెందడంలో, తల్లి రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయులు తగినమోతాదులో ఉండటంలో ఫోలేట్ కీలకపాత్ర పోషిస్తుంది. ఇది తక్కువగా ఉంటే నాడులకు సంబంధించిన రుగ్మతలు వస్తాయి. మెదడు పనితీరు మందగిస్తుంది. ఫోలేట్ వివిధ ఆహార పదార్థాల నుంచి సహజంగానే లభిస్తుంది. ఇక విటమిన్ సప్లిమెంట్లు, ఫోర్టిఫైడ్ ఆహారాల్లో మాత్రం దీన్ని ఫోలిక్ యాసిడ్ రూపంలో జతచేస్తారు. అయితే, సహజమైన ఫోలేట్‌లా కృత్రిమ ఫోలిక్ యాసిడ్ శరీరంలో కలిసిపోదని కొందరి అభిప్రాయం.

కాబట్టి మనం తినే ఆహారంలోనే ఫోలేట్ ఎక్కువగా ఉన్నవాటిని ఎంచుకోవడం మంచిది. పాలకూర, తోటకూర, అవకాడో, పచ్చిబటాణీలు, బ్రసెల్స్ స్ప్రౌట్స్, బ్రకోలి, ఆవకూర, టమాటాలు, నారింజ, పల్లీలు, అంగూర్లు, బొప్పడి, అరటి పండ్లు, పచ్చసొనతో కూడిన గుడ్లు, జంతు మాంసంలో తినదగిన అవయవాలు (ఆర్గాన్ మీట్స్)



మొదలైన వాటిలో ఫోలేట్ దొరుకుతుంది. అయితే సేంద్రియమైనవి, హానికరమైన పురుగుమందుల అవశేషాలు లేని పదార్థాలు ఎంచుకోవాల్సి ఉంటుంది.




# “ఖాకీ”లో మానవతా దృక్పథం

**ఇంతేజార్గంజ్ మహిళా కానిస్టేబుల్ హృదయాన్ని కదిలించిన ఘటన**

“నేటిధాత్రి”, వరంగల్ :
వరంగల్, దేశాయిపేట పీహెచ్‌సీ సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న ఇంతేజార్గంజ్ పోలీస్ స్టేషన్ మహిళా హెడ్ కానిస్టేబుల్ నవనీత ఒక “ఉదార” ఉదాహరణగా నిలిచారు. విధి నిర్వహణలో భాగంగా అక్కడి ప్రాంతంలో ఉన్న నిరుపేద వృద్ధ దంపతుల దయనీయ పరిస్థితి కళ్లారా చూసిన ఆమె, చలించిపోయి తన వంతుగా వారికి దుస్తులు అందజేశారు.
సాధారణంగా “ఖాకీ” కఠినత్వానికి ప్రతీకగా కనిపించినప్పటికీ, “నవనీత” చూపిన మానవతా హృదయం “ఖాకీ వెనుక దాగి ఉన్న సేవాస్ఫూర్తిని” బయటపెట్టింది. ఈ సందర్భంగా ఇంతేజార్గంజ్ పోలీస్ స్టేషన్ ఎస్సై సందీప్, ట్రైనీ ఎస్ఐ తేజ, స్థానికులు మహిళా కానిస్టేబుల్ ను అభినందించారు.
ఈ స్ఫూర్తిదాయక చర్యతో పోలీస్ వ్యవస్థ కేవలం చట్టాన్ని అమలు చేయడమే కాక, సమాజానికి అండగా నిలబడే మానవతా సహచరులుగా ఉన్నారనే విషయం మరోసారి రుజువైంది.

# అసెంబ్లీకి రాని నేతలు అవసరమా?



డెస్క్, నేటిధాత్రి:
తెలుగు రాష్ట్రాల్లో చాలా విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అధికారం కోల్పోవడంతో విమర్శలే లక్ష్యంగా విపక్షంలో ఉన్న పార్టీలు వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్షహోదా ఇస్తే తప్ప అసెంబ్లీకి రానని ఎపిలో విపక్ష వైకాపా అధినేత జగన్ మొండిపట్టుతో ఉన్నారు. విపక్ష హోదా ఇవ్వంది అసెంబ్లీకి వస్తానని అంటున్నారు. ఇక తెలంగాణలో విపక్ష హోదా ఉన్నా కెసిఆర్ అసెంబ్లీకి రావడం లేదు. అధికారం ఉంటే తప్ప అసెంబ్లీలో అడుగు పెట్టేది లేదన్న ధోరణిలో ఉన్నారు. ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న తరవాత అసెంబ్లీకి రావాల్సిందే. సమస్యలపై చర్చించాల్సిందే. అలా కాకుండా జీతభత్యాలు మాత్రం అందుకుంటూ ఎత్తుకుంటున్నారు. ప్రజల సొమ్ము తింటున్న ఈ ఇద్దరు నేతలు ఇంత బాధ్యతారాహిత్యంగా ఉంటున్నారు. ఇలాంటి సమయాల్లో చట్టప్రకారం ఏం చేయాలన్నది ఆలోచన చేయాలి. ఇలాంటి వారిపై కొరడా ఝళిపించ చాలి. వారిని ఎమ్మెల్యేలుగా అనర్హులను చేయాలి. మళ్లీ ఎన్నుకోకుండా చూడాలి. ఇకపోతే అధికారంలో ఉండగా అప్పులు చేసి, విభజిత ఆంధ్రప్రదేశ్‌ను ఈ ఇద్దరూ కలిసి అప్పుల ఊబిలోకి నెట్టారు. ఇప్పుడేమో ఉన్న ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు. నిజానికి వీరు ఎందుకు అప్పులు చేశారు.. ఎందుకు దివాళా తీయించారన్నది దానికి సమాధానం లేదు. దేశంలో బహుశా ఇంతగా అప్పుల బారినపడ్డ రాష్ట్రాలు లేవేమో. అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణను పాటించలేదు. దీంతో ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తూ అనుత్పాదక రంగాలకు ఖర్చుపెట్టి దుబారా చేశారు. వీటినే అభివృద్ది, సంక్షేమం అంటూ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకునే పనిలో ఉన్నాయి. ఆర్థిక క్రమశిక్షణతో పాటు, రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకపోవడంతో మళ్లీ కరిపోవడానికి గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ప్రధానంగా అభివృద్ధి పేరుతో చేస్తున్న డబ్బు పందేరాలు రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. ఈ అప్పుల నుంచి బయటపడే మార్గాలు కూడా కనిపించడం లేదు. అలాగే అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఇరు రాష్ట్రాల్లో విపక్షాలను దెబ్బతీయడం, విమర్శలను సహించక పోవడం వంటి చర్యలతో ఇద్దరు సిఎంలు నిరంకుశంగా పనిచేయడం ద్వారా తెలుగు రాష్ట్రాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాంటి రాష్ట్రాలను గాడిలో పెట్టాల్సిన ప్రస్తుత సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు మరిన్ని అప్పులు చేస్తున్నారే తప్ప ఆలోచన చేయడం లేదు. ఎపిలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణిచివేయడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ప్రజల్లో పలచన అయి, అధికారం కోల్పోయి, అసెంబ్లీకి రానని మంకు పట్టుతో ఉన్నారు. పార్టీలను అణగదొక్కడంలో కెసిఆర్ చేసిన కృషి ఇప్పుడు ఆయనకే ఎదురు తిరిగింది. కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేయాలన్న కుట్రతో చేసిన ప్రయత్నాలు బెడిసి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా చేశారు. దీంతో ఆయనా అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారు. కాంగ్రెస్, బిజెపిలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కెసిఆర్ వేసిన ఎత్తుగడలు ఫలించలేదు. వారి దెబ్బకు బిఆర్ఎస్ ఉనికిలేకుండా పోయింది. ఇలాంటి రాజకీయ నేతలు అవసరమా అన్నది ప్రజలు ఆలోచనచేయాలి. నిజాయితీ లేని రాజకీయ నేతలను పక్కన పెట్టడం నేర్చుకోవాలి. అసెంబ్లీకి రాని నేతలు ప్రజలకు ఏం సేవ చేస్తారో చూస్తున్నాం. అధికారంలో ఉన్నా మేలు చేయలేదు. విపక్షంలో ఉన్నా మేలు లేదని కెసిఆర్, జగన్‌లు నిరూపించారు. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30 ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజా ఆశలను,ఆకాంక్షలను పట్టించుకోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడ మమత బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా ఇప్పుడు అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. బిజెపి అక్కడ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారు. నిరంతరం నిస్సహాయంతో ఉన్న మమతా బెనర్జీ బిజెపి నేతలపై దాడులకు దిగుతోంది. ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. ప్రజల మనసెరిగి ముందుకు సాగితే ఎంతకాలమైనా ప్రజలు ఆదరిస్తారు. తెలంగాణలో కూడా తొలుత తెలుగుదేశం పార్టీని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని బోలుకొట్టడంలో దెబ్బతీసిన కేసీఆర్, ఇప్పుడు ప్రతిపక్ష పాత్రకే పరిమితం అయ్యారు. ఇలాంటి దుస్థితి ఎదురౌతాల్సి వస్తుందని ఊహించి ఉండక పోవచ్చు. పశ్చిమబెంగాల్లో ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఏ తప్పు చేశారో తెలంగాణలో కూడా కేసీఆర్ అదే తప్పు చేసారు. పశ్చిమ బెంగాల్లో బలంగా ఉన్న వామపక్షాలను మమత బెనర్జీ బలహీనపరిచారు. ఎపిలో కూడా జగన్ టిడిపిని తిట్టడం,కేసులు పెట్టడం, లేపేయడం వంటి చర్యలకు ప్రోత్సాహం ఇవ్వడంతో ప్రజలు తిరిగి టిడిపిని ఎన్నుకున్నారు. ప్రజలు మెచ్చేలా పాలన అందించినంతవరకు పాలక పార్టీకి దిగులు లేదు. అయితే ఇది విస్మరించి వ్యవహరించడంవల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జగన్, కెసిఆర్లు గడ్డు పరిస్థితులను ఎదుర్కొం టున్నారు. వారు అసెంబ్లీకి వచ్చి తమ హయాంలో మంచిచేస్తే మంచిని చెప్పాలి. విపక్షంగా ప్రజల పక్షాన పోరాడాలి. సమస్యలపై నిలదీయాలి. కానీ అధికార పక్షం ఎదురుదాడిని తట్టుకోలేక భయంతో అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నారు. ఇప్పుడు భారతీయ జనతాపార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోంది. బీజేపీ ఇంతలా బలం పుంజుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రజల్లో నిరసనను నివృత్తిచేస్తే నాయకుడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించడంలేదు. బిఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వామ్యాన్ని మచ్చుకు కూడా కనిపించకుండా అంతా తామే అన్నట్లుగా కెసిఆర్, కెటిఆర్ వ్యవహారాలు నడిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. అసెంబ్లీకి వెళ్లకుంటే నష్టపోయేది జగన్, కెసిఆర్లు మాత్రమేనని గుర్తించాలి.

# తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

**●యూరియా సరఫరాలో నిర్లక్ష్యం ●కేంద్రమాజీమంత్రి వేణుగోపాలాచారి**

**ఆదిలాబాద్, నేటిధాత్రి:**
యూరియా విషయంలో స్పష్టత లేని కేంద్రం, రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం వహించిందని మాజీకేంద్రమంత్రి, కాంగ్రెస్ నేత డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి అన్నారు. రాష్ట్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్రం ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రకటన చేయలేదన్నారు. దీనికితోడు రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు, మంత్రులు అనవసరంగా నోరు పారేసుకోవడం సరికాదన్నారు. ఇకపోతే కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపైన, హామీలపైన స్పష్టత ఇవ్వడంలో విఫలమైన కేంద్రంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. యూరియాపై ఎందుకు స్పష్టత ఇవ్వరని అన్నారు. ఇప్పుడు దేశంలో ఆహార కొరతకు, ధాన్యం రేట్లు పెరగడానికి కారణం



ఎవరని అన్నారు. తెలంగాణ పండించిన ధాన్యాన్ని బేషరతుగా కొనివుంటే ఇవాళ ఇంతటి సంక్షోభం వచ్చి ఉండేది కాదన్నారు. ఇంతకాలం తాము సంయమనంతో వ్యవహరించామని అన్నారు. తమ ఎంపిలు పార్లమెంటులో పోరాడినా లాభం లేకుండా పోయిందన్నారు. కేంద్రం నీతి ఆయోగ్ ఏర్పాటు చేసినప్పుడు చేసిన ప్రకటనలకు తాజాగా అనుసరిస్తున్న విధానాలకు పొంతన లేకుండా ఉందన్నారు. నిధుల విడుదలలో తెలంగాణకు అన్యాయం జరుగు తోందన్నారు. బిజెపి ఎంపిలు కూడా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. తెలంగాణలో హుంకరిస్తున్న నేతలు ఈ నేలకు ఏంచేశారో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని వారు గుర్తించాలన్నారు. అనేక విషయాల్లో కేంద్రం తెలంగాణపై చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఈ సమస్య తెలంగాణకు సంబంధించిందే కాదని.. దాదాపు చాలా రాష్ట్రాలకు సంబంధించిందన్నారు. ఆర్థిక సంఘం బకాయిలు, గ్రామీణాభివృద్ధి నిధులు తక్షణమే విడుదల చేయాలని కొత్త ప్రభాకర్ రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని సూచించారు.


# మహిళలపై అకృత్యాలకు చర్యలేవీ

## కఠినంగా శిక్షలు వేస్తేనే మార్పు సాధ్యం



**అమరావతి, నేటిధాత్రి:**
ఇటీవల నల్లగొండలో ఫోక్సో కోర్టులు రేపిస్టులకు జైలుశిక్షలు వేశాయి. జీవిత ఖైదు విధించాయి. అయితే ఇవన్నీ ఆలస్యంగానే అమలవుతున్నాయి. కఠిన శిక్షలు వెంటనే అమలు కావాల్సిన అసవరం ఉంది. ఎన్ని కఠిన చట్టాలను తీసుకుని వచ్చినా లైంగిక వేదింపులు, ప్రేమదాడులు ఆగడం లేదు. అలాగే వరుస ఘటనలు ఎపిలో ఆందోళన కలిగిస్తున్నాయి. మృగాళ్ల కారణంగా ఆడపిల్లలకు భయం కలుగుతోంది. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు మరింత క్షోభకు గురవుతున్నారు. ఇప్పుడు భయపడేలా పరిస్థితులు దాపురించాయి. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు కఠిన శిక్షలు పడేలా చూడాలని సత్వర శిక్షలు అమలు చేయాలని యావత్ దేశం కోరుకుంటున్న వేళ కఠిన చట్టాలపై ఆలోచన చేయాలి. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడితే ఉరిశిక్ష విధించేలా చట్టాన్ని రూపొందించాలి. దీనిని నిర్ధారించే ఆధారాలున్నప్పుడు 21 రోజుల్లోనే తీర్పు ఇచ్చేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలి. మహిళలపై అత్యాచారానికి పాల్పడితే అతి త్వరగా నిందితులకు మరణశిక్ష పడేలా చట్టం తీసుకుని రావాలి ఇటువంటి కేసుల్లో నిందితులను దోషులుగా నిర్ధారించే ఆధారాలున్నప్పుడు మూడు వారాల్లోగా అంటే 21 వర్కింగ్ డేస్ ల్లో తీర్పు వచ్చేలా క్రిమినల్ లా చట్టంలో మార్పులు తేవాలి.. కానీ ఇటీవలి ఘటనలు మృగాళ్లలో భయాన్ని కలిగించడం లేదని తెలిస్తోంది. ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరకారించందనో లేక తనను ప్రేమించడం లేదనో లేకపోతే..ఒంటరి అమ్మాయిలను లేదా మహిళలను లక్ష్యంగా చేసుకుని రెచ్చిపోతున్నారు. రేప్‌లు చేయడం, హత్యలు చేయడం చాలా సులువైన పనిగా చూస్తున్నారు. మహిళలు, చిన్నారులపై నేరాల విచారణకు ప్రతి జిల్లాలోను ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్ని ఏర్పాటు చేయాలి. అత్యాచారం, యాసిడ్ దాడులు, వేధింపులు, లైంగిక వేధింపులు వంటి హింసాత్మక ఘటనల్లో నేరాల విచారణకు ప్రతి జిల్లాల్లోను ప్రత్యే కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వాలు ముందుకు రావాలి. అంతేకాదు సోషల్ మీడియా వేదికగా బాధిత మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాలకు అడ్డుకట్టవేసేలా చట్టాన్ని రూపొందించాలి. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా పోస్టింగ్‌లు పెట్టేవారిపై ఉక్కుపాదం మోపాలి. నిజానికి ఆడవాళ్లపై అకృత్యాలు జరిగిన వెంటనే ఉపశమనం కలిగే చట్టం రావాలని తల్లిదండ్రులు, ప్రతి మహిళ, చెల్లి, ప్రతి ఇంట్లోని ఆడపిల్ల ఎదురు చూస్తోంది. ప్రభుత్వం కఠిన చట్టంతో మహిళలకు భద్రత ఇస్తోందన్న భరోసా రావాలి. అయితే చట్టాలు ఉన్నా ప్రజల్లో మార్పులు మాత్రం రావడం లేదు. దుండగులను కఠినంగా అణచివేస్తే తప్ప మహిళలకు రక్షణ ఉండదని తేలిపోయింది. కఠినంగా అణచివేత చర్యలకు ఉపక్రమించాలన్ని సర్వత్రా విజ్ఞప్తులు వస్తున్నాయి. భయం కలిగేలా పోలీసులు వ్యవహరించాలని కూడా యువతులు కోరుకుంటున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్



**హైదరాబాద్, నేటిధాత్రి:**
హైదరాబాద్ నగరంలో బుధవారం భారీ వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నదుల్లా పారింది. ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదు ర్కొన్నారు. ముషీరాబాద్ సర్కిల్ తాళ్లబస్తీలో 19 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.
చిలకలగూడ, బోలక్‌పూర్ ప్రాంతాల్లో 15 నుంచి 18 సెంటీమీటర్ల మధ్య వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. బేగంపేట్, శేర్లింగంపల్లి ప్రాంతాల్లో 15 సెంటీమీటర్లు, జూబ్లీహిల్స్, చందానగర్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో 11 నుంచి 13 సెంటీమీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది. మూసాపేట్, పటాన్‌చెరు, కూకట్‌పల్లి, కాప్రా సర్కిళ్ల పరిధిలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతోపాటు.... యూసఫ్‌గూడా, కార్వాన్, కుత్బుల్లాపూర్, మెహిదీపట్నం ప్రాంతాల్లో 7-8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు చెప్పారు.మరో 3 రోజులు తెలుగు రాష్ట్రంలో భారీ వర్షాలు కురువనున్నాయి
ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో మరో 3 రోజులు తెలంగాణలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. భారత్ నుంచి రుతుపవ నాలు తిరోగమనం చెందుతున్నాయి. వచ్చేనెల 1 నాటికి దేశం నుంచి పూర్తిగా నిష్క్రమిస్తాయి.
గురువారం సిద్దిపేట, కామారెడ్డి, మహబూబ్ నగర్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, జగిత్యాల, నాగర్‌కర్నూల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. రేపు హైదరాబాద్, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వనపర్తి, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముంది.
ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమలో ఒకటి, రెండు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు, ఏలూరు, కృష్ణా, గుంటూరు, చిత్తూరు, తిరుపతి, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

# అనేక గ్రామాల్లో తొలగని బురద




**●సీజనల్ వ్యాధుల నివారణకు ఇదే మార్గం**
**●సవాల్‌గా మారిన పారిశుద్య నిర్వహణ**

**ఏలూరు, నేటిధాత్రి:**
ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇటీవలి వర్షాలు వరదల కారణంగా పలుప్రాంతాలు కంపు కొడుతున్నాయి. అనేక లంకగ్రామాలు, విలీన మండలాల గ్రామాలు ఇంకా బురదలోనే ఉన్నాయి.ప్రజలు దీంతో సహవాసం చేస్తూ అవస్థలు పడుతున్నారు. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ఏలూరులో వింతవ్యాధి ఇటీవల ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలు తున్న విషయం సుస్పష్టం. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి.ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుద్ధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభిం చాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్తాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి.

# కాకులకే ఎందుకు పిండం పెట్టాలి ?

**(ఆధ్యాత్మిక చింతన )**

**తిరుమల, నేటిధాత్రి:**
మహాలయంలో అంటే పితృపక్షాల సమయంలో మనం కాకులకు ఆహారం ఎందుకు పెడతాము? మన పూర్వీకులు కాకులుగా మారారా? అయితే ఇంతటి అల్ప పక్షిగా ఎందుకు మారారు? ఏదైనా పెద్ద స్థాయిలో ఉన్న పక్షిగా ఎందుకు మారలేదు?‘అని భక్తుడొకరు పరమాచార్య స్వామివారిని అడిగాడు. స్వామివారు ఒకసారి చిరునవ్వి, ‘తమిళంలో మనం కాకిని 'కాకా' అని పిలుస్తాము. ఇక ఏదైనా ప్రాణిని మనం అవి చేసే శబ్దాలతో పిలుస్తామా? పిల్లిని 'మ్యావ్' అని, చిలుకలు కికి అంటాయి కాబట్టి వాటిని 'కికి' అని పిలుస్తామా? లేదు! కాకిని దాని అరుపుతో పిలుస్తాము. అదే దాని ప్రత్యేకత. క అంటే కాపాత్తు (కాపాడు), రక్షించు అని అర్థం. కనుక నువ్వు కాకికి ఆహారం పెట్టి 'కా కా' అని పిలిస్తే, కాపాడు అని పితృదేవతలని అడిగినట్టు!విరివిగా ఉంటాయి, ఏది పడితే అది తింటాయి కాబట్టి కాకిని నువ్వు అల్పపక్షి అంటున్నావు. కాకి ఎంత గొప్పదో ఇప్పుడు చెబుతాను విను. అది బ్రహ్మముహూర్తంలో లేస్తుంది. కా కా అని అరచి నిన్ను నిద్రలేపుతుంది. ఒక్కోసారి కోళ్ళు సరిగ్గా సమయానికి లేవవు. కాని కాకి సరైన సమయానికి లేస్తుంది. అది కాకా అని అరుస్తూ నీ జపానికి సరైన సమయమైన బ్రహ్మముహూర్తంలో నిన్ను నిద్రలేపుతుంది.అది పూజకు సరైన నిర్దేశం. అంతేకాక, దానికి ఆహారం దొరికితే ఇతర కాకులను పిలుస్తుంది. ఆహారాన్ని పంచుకుని తినండి అని మనకు తెలిపే వేరే ప్రాణుల్లో కనపడని ఒక ప్రత్యేకక లక్షణం కలిగినది. మరలా సాయంత్రం నిద్రకు ఉపక్రమించే ముందు,



మరలా కాకా అని అంటుంది. ఆ రోజు జరిగిన అన్ని విషయాలకు భగవంతునికి కృతజ్ఞతగా. అలాగే, కాకులు సూర్యాస్తమయం తరువాత ఏమీ తినవు. ఇది శాస్త్రములు చెప్పిన ఉత్తమమైన విషయం కూడా. ఇది ఎంతమంది పాటిస్తున్నారు?కనుక నాకు తెలిసి కాకి అల్ప ప్రాణి కాదు. అది మనకు ఎంతో నేర్పుతుంది. అందుకే పితృ దేవతలు కాకి రూపంలో వస్తారు. మరొక్క విషయం.. కేవలం మహాలయం లోనే కాదు, ప్రతిరోజూ కాకికి ఆహారం పెట్టు. కాకి మనకు అద్వైతాన్ని కూడా నేర్పుతుంది.నువ్వు పెట్టిన ఆహారాన్ని చూడగానే కాకి ఎంతో సంతోషపడి ఆ ఆహారాన్ని స్వీకరిస్తుంది. అది తినడం చూడడం వల్ల నువ్వు కూడా ఆనందాన్ని పొందుతావు. కనుక ఇరువురు ఆనందంగా ఉంటారు. ఇద్దరూ భగవత్ స్వరూపులే! అని తెలిపారు.

# యూరియా కొరతపై వైసీపీ వాయిదా తీర్మానం

**●మండలిలో చర్చకు పట్టుబట్టిన వైకాపా సభ్యులు ●గందరగోళం మధ్య పది నిముషాలు వాయిదా**

**అమరావతి, నేటిధాత్రి:**
ఏపీ శాసనమండలి సమావేశాలు ప్రారంభమైన కొద్ది సేపటికే వైసీపీ సభ్యుల ఆందోళనతో వాయిదా పడింది. సభ మొదలవగానే యూరియా కొరత, గిట్టుబాటు- ధరలపై వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. అయితే వైసీపీ వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించారు. దీంతో వైసీపీ సభ్యులు సభలో నినాదాలు చేశారు. అయితే యూరియా, గిట్టుబాటు ధరలపై సమయం కేటాయించాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. చర్చకు తము రెడీ అంటూ సమాధానం ఇచ్చారు. ఎవరి ప్రభుత్వంలో ఏం చేశారు అనేది చర్చలో తేలుద్దామంటూ మంత్రి సవాల్ విసిరారు. యూరియా, పంటలకు గిట్టుబాటు ధరలపై బీఏసీ సమావేశంలో సమయం కేటాయిస్తే ఎన్ని గంటలు అయినా చర్చ చేయడానికి ప్రభుత్వం సిద్ధం అని అచ్చెన్న స్పష్టం చేశారు. అయితే మంత్రి సమాధానం చెప్పినప్పటికీ వైసీపీ ఎమ్మెల్సీలు నినాదాలు చేస్తూ చైర్మన్ పోడియం వద్ద ఆందోళనకు దిగారు. యూరియా కొరత సిగ్గు సిగ్గు అంటూ నినాదాలు చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేవంటూ సిగ్గు సిగ్గు చైర్మన్ పోడియం దగ్గర నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు వైసీపీ సభ్యులు. అయితే వైసీపీ ఎమ్మెల్సీలకు టీ-డీపీ ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వసతులు కల్పించక పోవడం సిగ్గు సిగ్గు అంటూ ప్రశ్న అడుగుతూ వ్యాఖ్యానించారు




ఎమ్మెల్యే. కాగా.. బీఏసీ సమావేశంలో సమయం కేటాయిస్తే చర్చించేందుకు తాము సిద్ధం అని మంత్రి చెబుతున్నారని వైసీపీ ఎమ్మెల్సీలకు నచ్చచెప్పేందుకు చైర్మన్ ప్రయత్నించారు. అయినా వైసీపీ సభ్యులు నినాదాలు ఆపని పరిస్థితి. మరోవైపు సభలో వైసీపీ సభ్యుల నినాదాలకు పోటీగా టీడీపీ సభ్యులు కూడా నినాదాలు చేశారు. రైతు ద్రోహి జగన్ అంటూ కావలి గ్రీష్మా నినాదాలు చేశారు. ఈ క్రమంలో సభలో పరిస్థితి గందరగోళంగా మారడంతో మండలి చైర్మన్ సభను పది నిమిషాల పాటు వాయిదా వేశారు.

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999